తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 23.04.2026 | సంపుటి :12 సంచిక :274 | పేజీలు :12 వెల : రూ. 4/-


RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV

జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా

# చర్యలు చేపట్టొద్దు

- తెలంగాణ సర్కారుకు హైకోర్టు ఆదేశం
- కేసీఆర్,హరీశ్‌రావులకు భారీ ఊరట
- కమిషన్ నివేదికను నిలిపివేసిన ధర్మాసనం

హైదరాబాద్(జనంసాక్షి): కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ధర్మాసనం నిలిపివేసింది. జస్టిస్ ఘోష్ కమిషన్ చట్టబద్ధమేనని న్యాయస్థానం తెలిపింది. అయితే రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పిటిషనర్లు కేసీఆర్, హరీశ్ రావుతో పాటు స్మిత సబర్వాల్, ఎస్కే జోషికి ఊరట లభించినట్లైంది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో

మిగతా 2లో..

ఎన్ని కుట్రలు పన్నినా న్యాయమే

## గెలిచింది: హరీశ్

## హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు : కేటీఆర్

కాళేశ్వరం అవినీతి విచారణలో సర్కారు

## విఫలం: కిషన్‌రెడ్డి

## సీబీఐ విచారణకు తీర్పు అడ్డంకి కాదు

పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

వివరాలు 2వ పేజీలో..

కాళేశ్వరంపై ఎవరికీ

## క్లీన్‌చిట్ ఇవ్వలేదు



- హైకోర్టు తీర్పుపై సీఎంతో మంత్రి ఉత్తమ్ చర్చలు
- తదుపరి కార్యాచరణపై ఇరు నేతల సమాలోచనలు

హైదరాబాద్(జనంసాక్షి):కాళేశ్వరం ప్రాజెక్టులో తెలంగాణ హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జస్టిస్ ఘోష్ కమిషన్ ఏర్పాటు సరైందని హైకోర్టు అభిప్రాయం

మిగతా 2లో..



ఆర్టీసీ సమ్మెతో

# ఆగిన బస్సులు

## జనం ఇక్కట్లు..

- డిపోల ముందు ధర్నాలతో కార్మికుల నిరసన
- నగరంలో అద్దె బస్సులను ఉచితంగా తిప్పిన ప్రభుత్వం
- ఆటోలు, క్యాబ్‌లకు పెరిగిన గిరాకీ
- కరీంనగర్‌లో లారీని ఢీకొట్టిన అద్దె బస్సు
- నగరంలో మెట్రో సర్వీసులు పొడగింపు
- కార్మికుల సమస్యలపై సానుకూలంగా ఉన్నాం: ఆర్టీసీ ఎండి
- ఆర్టీసీ సమ్మెకు బీఆర్ఎస్ సంఘీభావం

హైదరాబాద్(జనంసాక్షి):చాలాలకాలం తరవాత ఆర్టీసీ బస్సులు సేదదీరుతున్నాయి. సమ్మె కారణంగా అన్ని బస్సులు ఆయా డిపోలకే పరిమితం అయ్యాయి. తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో బస్ డిపోల్లో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. డిపోల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సమ్మెతో రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కార్మికుల సమ్మెతో పెద్దపల్లిలో 150 బస్సులు డిపోనకే పరిమితమయ్యాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. మహబూబ్‌నగర్‌లో 112 బస్సులు డిపోనకే పరిమితం కాగా.. ప్రయాణికుల కోసం 16 విద్యుత్ బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ఆర్టీసీ అద్దె బస్సులను నడుపుతోంది. కండక్టర్ లేకుండా వీటిని తిప్పుతోంది. మరోవైపు బస్సులు లేక పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. అన్ని జిల్లాల వ్యాప్తంగా అర్ధరాత్రి నుంచే బస్సులను డిపోలకు పరిమితం చేశారు. రహదారులపై బైఠాయించి

మిగతా 2లో..



సమస్యలపై ప్రభుత్వానికి

## చిత్తశుద్ధి లేదు

- డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మె మరింత ఉధృతం
- నేడు ఆర్టీసీ డిపోల ఎదుట మహాధర్నాకు జేఏసీ నాయకుల పిలుపు

## సమ్మె విరమించండి చర్చించుకుందాం రండి..

- సమ్మెతో సమస్యలు పరిష్కారం కావు
- కార్మికులకు మంత్రి పొన్నం విజ్ఞప్తి

2లో..

మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్‌రావు

## మృతి

చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన నేత



ప్రధాని మోదీపై వ్యాఖ్యలు..

## ఖర్గేకు ఈసీ నోటీసులు

గేమింగ్ రూల్స్

## మే 1 నుంచి అమల్లోకి

నోటిపై చేసిన కేంద్రం..

వివరాలు 9వ పేజీలో..



హఠాత్తుగా దాడి చేసేందుకే..

## సీజ్‌ఫైర్ పొడిగింపు

- ట్రంప్ కాల్పుల విరమణను పొడిగించడంపై స్పందించిన ఇరాన్
- ఓడిపోయేవారు షరతులు పెట్టకూడదంటూ ఎద్దేవా
- హర్మూజ్ జలసంధిలో.. నౌకలపై ఐఆర్‌జీసీ దాడి
- గుజరాత్ వస్తున్న నౌకను సీజ్ చేసిన ఇరాన్

టెహ్రాన్(జనంసాక్షి):అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాల్పుల విరమణను పొడిగించడాన్ని ఇరాన్ వెక్కిరించింది. ఇది అర్థంలేని చర్యగా అభివర్ణించింది. ఈ క్రమంలో ఓడిపోయేవారు షరతులు పెట్టకూ డదంటూ ఎద్దేవా చేసింది. ట్రంప్ సీజ్‌ఫైర్‌ను పొడిగించడంపై ఇరాన్ పార్లమెంటు స్పీకర్ ఘాలిబఫ్ సీనియర్ సలహాదారు మహ్దీ మహమ్మదీ ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. ట్రంప్ కాల్పుల విరమణ

మిగతా 2లో..

# కాల్పుల విరమణ మళ్లీ పొడిగింపు



స్పష్టమైన ప్రతిపాదనతో రావాలని ఇరాన్‌కు ట్రంప్ సూచన

రెండు,మూడు రోజుల్లో మలివిడత శాంతి చర్చలు ఉండొచ్చని వెల్లడి

వాషింగ్టన్(జనంసాక్షి): ఇరాన్‌తో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇరుదేశాల మధ్య గతంలో కుదిరిన కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్ నాయకత్వం ఒక సమగ్ర ప్రతిపాదనను సమర్పించే వరకు ఈ కాల్పుల విరమణ కొనసాగుతుందని తెలిపారు. అమెరికా, ఇరాన్ మధ్య ఈ నెల 8వ తేదీన కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. రెండు వారాల ఈ సీజ్ ఫైర్ మరో కొద్ది గంటల్లో ముగియనుందనగా ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, పాకిస్థాన్ నుంచి వచ్చిన అభ్యర్థన మేరకే కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించినట్లుగా ట్రంప్ తెలిపారు. ముఖ్యంగా పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ల అభ్యర్థన మేరకు



సైనిక చర్యను వాయిదా వేసి, దౌత్య చర్చలకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లుగా పేర్కొన్నారు. ఈ మేరకు తన ట్రూత్ సోషల్ ఖాతా ద్వారా వివరాలను వెల్లడించారు.అయితే, సీజ్ ఫైర్ కొనసాగుతున్న సమయంలోనే ఇరాన్‌పై సముద్ర దిగ్బంధనాన్ని కొనసాగించాలని సైన్యానికి ఆదేశాలు ఇచ్చినట్లుగా ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు తీవ్రంగా ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో వారు ఏకీకృత ప్రతిపాదనతో రావడానికి సమయం అవసరం. అందుకే ఈ దాడిని నిలిపివేసి, సీజ్ ఫైర్ పొడిగించాం అని తెలిపారు. బ్లాకేడ్ కొనసాగించాలని ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై ఇరాన్ మండిపడింది. ఇది కాల్పుల విరమణకు వ్యతిరేకమని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అర్ఘాచీ విమర్శించారు. వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడమంటే యుద్ధ చర్యే అని సమానమని అన్నారు. తమ ప్రయోజనాలను రక్షించుకోవడం ఇరాన్‌కు తెలుసని స్పష్టం చేశారు. ఇక పాక్‌లో జరగాల్సిన చర్చలకు హాజరుకాకూడదని ఇరాన్ నిర్ణయించుకున్నట్లుగా టస్నీమ్ వార్త సంస్థ వెల్లడించింది. అమెరికా అతిగా డిమాండ్లు చేస్తుందని.. అవి ఒప్పందానికి అడ్డుగా మారుతున్నాయి కాబట్టి చర్చల్లో పాల్గొనడం వ్యర్థమని అభిప్రాయపడుతున్నట్లుగా పేర్కొంది.

మిగతా 2లో..

అన్ని మతాచారాలను ఒకే ప్రాతిపదికన

# చూడలేం

- వాస్తవ పరిస్థితులు, ఆచారాల నేపథ్యం కూడా ముఖ్యం
- శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశం కేసు విచారణ
- సుప్రీం కోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ(జనంసాక్షి): మత స్వేచ్ఛ, సామాజిక సంస్కరణల మధ్య సమతుల్యత అనేది ఆయా కేసుల వాస్తవ పరిస్థితులు, ఆచారాల నేపథ్యంపైనే ఆధారపడి ఉంటుందని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ విచారణ కేవలం శబరిమలకే పరిమితం కాకుండా, మసీదుల్లోకి మహిళల ప్రవేశం, పార్సీ మహిళల హక్కుల వంటి ఇతర మతపరమైన అంశాలను కూడా స్పృశిస్తోంది. ఒక మతానికి చెందిన ఆచారం లేదా నిబంధనను ప్రాతిపదికగా తీసుకుని, అదే

మిగతా 2లో..



సుప్రీం ఓటుకు నోటు కేసు విచారణ..

## రెండు వారాలకు వాయిదా

2లో..

రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి

# రూ.98 వేల కోట్లు



- 2028 కల్లా తెలంగాణలో దేశంలోనే అత్యుత్తమ రహదారుల నిర్మాణమే లక్ష్యం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి):ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే కనీ, విని ఎరగని విధంగా రాష్ట్రంలో 98,000 కోట్ల విలువైన రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనులు చేపడుతున్నాం అధికారులు ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని, వేగంగా పనులు పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. 2028 చివరి నాటికి రోడ్ల నిర్మాణంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టినట్టు మంత్రులు తెలిపారు. దేశంతో పాటు, ప్రపంచం నలుమూలల నుంచి రోడ్డు కాంట్రాక్టర్లు, బిల్డర్లు హాజరయ్యే ప్రతిష్టాత్మక ఇండియన్ రోడ్డు కాంగ్రెస్ సమావేశం 2026 నవంబర్ లో హైదరాబాదులోని హైటెక్స్ లో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు విజయవంతం అయ్యాయని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఎంపీగా, కేంద్రమంత్రి గడ్కరీ తో తనకున్న పరిచయం మూలంగా హైదరాబాదులో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సమావేశం నిర్వహించేందుకు ఒప్పించానని మంత్రి వెంకట్ రెడ్డి వివరించారు.

మిగతా 2లో..

ఉగ్రవాదానికి భారత్ ఎప్పటికీ

# తలొగ్గదు



- పహల్గామ్ దాడిలో మరణించిన అమాయకులను ఎప్పటికీ మరచిపోలేం : మోదీ
- భారత్ జోలికి వస్తే జాగ్రత్త!
- పాకిస్తాన్‌కు రాజ్‌నాథ్‌సింగ్ వార్నింగ్

న్యూఢిల్లీ(జనంసాక్షి):జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ లో ఉగ్ర దాడి జరిగి నేటికి ఏడాదైంది. ఈ నేపథ్యంలో దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రధాని మోదీ నివాళులర్పించారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ.. 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. పహల్గామ్‌లో ఉగ్ర దాడి దేశం మొత్తాన్ని కలచివేసిందని మోదీ అన్నారు. ఈ విషాదాన్ని, ఇందులో మరణించిన అమాయకులను ఎప్పటికీ మరచిపోలేమన్నారు. వారిని స్మరించుకుంటున్నట్లు తెలిపారు. ఆ దాడిలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు ప్రధాని సానుభూతి వ్యక్తం చేశారు. దుఃఖంలో, సంకల్పంలోనూ దేశం మొత్తం ఐక్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉగ్రవాదానికి భారత్ ఎప్పటికీ తలొగ్గదని స్పష్టంచేశారు. ఉగ్రవాదుల కుట్రలు ఎప్పటికీ సఫలం కావన్నారు. కాగా.. గతేడాది ఏప్రిల్ 22న పర్యాటకులపై ముష్కరులు విచక్షణారహితంగా దాడి చేశారు. హిందువులే లక్ష్యంగా జరిగిన ఈ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిని ప్రపంచమంతా తీవ్రంగా ఖండించింది.

మిగతా 2లో..

## ఆరుగురు ఐపీఎస్‌లకు డీజీ హోదా

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో పనిచేస్తున్న ఆరుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులకు డీజీ హోదా కల్పించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఒక ప్రకటనను విడుదల చేశారు. 1995 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన మహేశ్ భగవత్, స్వాతి లక్రా, వీవీ శ్రీనివాసరావు,1996 బ్యాచ్‌కు చెందిన చారుసిన్హా, అనిల్‌కుమార్, సజ్జనార్ కు డైరెక్టర్ జనరల్ పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# ఈడీ విచారణలో జోక్యం సరికాదు

సీఎం మమతా బెనర్జీ తీరుపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ(జనంసాక్షి):పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీరుపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మనీలాండరింగ్ వ్యవహారంలో రాజకీయ కన్‌స్టలెన్సీ సంస్థ 'ఐప్యాక్'పై జరుగుతున్న ఈడీ విచారణలో ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులు నేరుగా కలగజేసుకోవడం సరికాదని, ఆమె చర్యలు ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేలా ఉన్నాయని వ్యాఖ్యానించింది. బెంగాల్‌లో చోటుచేసుకున్న బొగ్గు కుంభకోణానికి సంబంధించిన నమోదైన మనీలాండరింగ్ కేసుపై ఈడీ గత కొన్నాళ్లుగా దర్యాప్తు చేస్తోంది. అయితే, ముఖ్యమంత్రి మమతాబెనర్జీతోపాటు ప్రభుత్వ అధికారులు దర్యాప్తులో జోక్యం చేసుకుంటున్నా రంటూ ఈడీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం.. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ఇలా ప్రవర్తించే పరిస్థితి తలెత్తుతుందని రాజ్యాంగనిర్మాత అంబేడ్కర్ ఎప్పుడూ ఊహించి ఉండరని వ్యాఖ్యానించింది. ఇది రాష్ట్రానికి, కేంద్రానికి మధ్య వివాదం కాదు. ఓ ముఖ్యమంత్రి నేరుగా విచారణలో జోక్యం చేసుకోవడం సమర్థనీయం కాదు.

మిగతా 2లో..

## బ్యాంకింగ్ వ్యవస్థలో సమూల ప్రక్షాళన అవసరం

సైబర్ నేరాలు పురుగుతున్న వేళ ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రాకు సీపీ సజ్జనార్ లేఖ

2లో..

## అన్ని మతాచారాలను ఒకే ప్రాతిపదికన చూడలేం

సూత్రాన్ని అన్ని మతాల ఆచారాలకు వర్తింపజేయడం సాధ్యం కాదని ధర్మాసనం పేర్కొంది. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశం, మతపరమైన ఆచారాల్లో ప్రభుత్వ జోక్యంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం కీలక విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు.. మత స్వేచ్ఛ, రాజ్యాంగ పరమైన హక్కుల మధ్య ఉన్న సున్నితమైన సంబంధాన్ని స్పష్టం చేస్తున్నాయి. మతపరమైన ఆచారాల్లో ప్రభుత్వం ఎంతవరకు జోక్యం చేసుకోవచ్చనే అంశంపై ముందస్తుగా ఎలాంటి ఉమ్మడి లేదా సార్వత్రిక నిబంధనలను విధించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తొమ్మిదిమంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ కీలక అంశాలపై స్పష్టతనిచ్చింది. ఆర్టికల్ 25 ప్రకారం పౌరులకు ఉన్న మత స్వేచ్ఛను గౌరవిస్తూనే, అవసరమైన చోట సామాజిక సంస్కరణల కోసం ప్రభుత్వం జోక్యం ఏ మేరకు ఉండాలనేది న్యాయస్థానం నిశితంగా పరిశీలిస్తోంది. ప్రభుత్వ జోక్యంపై ముందస్తుగా గైడ్‌లైన్స్ జారీ చేయడం వల్ల భవిష్యత్తులో వచ్చే వివిధ కేసుల విచారణకు ఆటంకం కలిగే ప్రమాదం ఉందని ధర్మాసనం భావించింది. మతపరమైన హక్కులు 'రాజ్యాంగ నైతికత'కు లోబడి ఉండాలా లేదా అనే కీలక ప్రశ్నపై ఈ విచారణ కొనసాగుతోంది. ఏడో రోజు విచారణ ద్వారా సుప్రీంకోర్టు మతపరమైన విషయాల్లో న్యాయవ్యవస్థ, ప్రభుత్వ పరిధులను అత్యంత జాగ్రత్తగా విశ్లేషిస్తోంది. శబరిమల తీర్పును పున:సమీక్షించే క్రమంలో వెలువడే ఈ నిర్ణయాలు భారతదేశంలోని అన్ని మతాల ఆచార వ్యవహారాలపై సుదూర ప్రభావం చూపే అవకాశం ఉంది. తొమ్మిది మంది సభ్యుల ధర్మాసనం తీసుకునే నిర్ణయం మతపరమైన హక్కుల విషయంలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలవనుంది.

**సుప్రీం ఓటుకు నోటు కేసు విచారణ..**

## రెండు వారాలకు వాయిదా

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఓటుకు నోటు కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. జస్టిస్ జేకే మహేశ్వరి నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం ఈ కేసును మరో రెండు వారాల తర్వాత విచారిస్తామని తెలిపింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ విజయ్ బిష్ణోయ్ కూడా సభ్యుడిగా ఉన్నారు. మంగళవారం ఈ కేసు విచారణ జరిగింది. ముఖ్యంగా ఈ కేసులో రెండు కీలక పిటిషన్లు విచారణకు వచ్చాయి. ఒకటి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ కాగా, మరొకటి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ కీలక నేత సండ్ర వెంకట వీరయ్య దాఖలు చేసినది. సీఎం రేవంత్ రెడ్డి తన పిటిషన్‌లో ఓటుకు నోటు కేసును అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల ప్రకారమే విచారించాలని కోరారు. ఈ కేసును క్రిమినల్ అవినీతి కేసుగా కాకుండా ఎన్నికల ఉల్లంఘనగా పరిగణించాలని ఆయన వాదించారు.

## ఉగ్రవాదానికి భారత్ ఎప్పటికీ తలొగ్గదు

అనంతరం భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టి పాకిస్థాన్‌లోని ఉగ్రమూకల క్యాంపులను నేలమట్టం చేసింది.కాగా పహల్గాం ఉగ్ర దాడి జరిగి నేటికి ఏడాది పూర్తయ్యింది. ఈక్రమంలోనే రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పాకిస్థాన్‌కు వార్నింగ్ ఇచ్చారు.

## ఈడీ విచారణలో జోక్యం సరికాదు

ఈ అంశాన్ని కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య వివాదంగా తయారు చేయొద్దు. మీ చర్యలు ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయని మమతా బెనర్జీని ఉద్దేశించి సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ఈడీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఐప్యాక్ సహ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ ప్రతీక్‌జైన్ ఇంట్లో ఈడీ సోదాలు నిర్వహిస్తున్న సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తన అధికారులతో కలిసి అక్కడకు ప్రవేశించినట్లు వెల్లడించారు..

### రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి రూ.98వేల కోట్లు

ఈ సమావేశం నిర్మాణాలకు బిజెపి పాలనలోని రాష్ట్రాలు పోటీపడినప్పటికీ కేంద్ర మంత్రి గడ్కరీ తన విజ్ఞప్తి మేరకు రాష్ట్రంలో నిర్వహించేందుకు అనుమతించినట్లు తెలిపారు. ఇండియన్ రోడ్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ గా రాష్ట్రానికి చెందిన మోహన్ నాయక్ ఎన్నికైన విషయాన్ని సైతం మంత్రి కోమటిరెడ్డి గుర్తు చేశారు. ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సమావేశాన్ని నిర్వహణకు అవసరమైన నిధులను బుధవారం జరిగిన సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విడుదల చేసినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు అని మంత్రి వెంకట్రెడ్డి తెలిపారు.ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సమావేశం అనంతరం రాష్ట్రానికి 20 వేల కోట్లకు పైగా పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.148 కోట్ల రూపాయలతో నిర్మించనున్న అప్రోచ్ రహదారులతో 300 గ్రామాల్లో నెలకొన్న సమస్యకు పరిష్కారం లభించనుందని తెలిపారు. గత ప్రభుత్వం సమావేశాలు పెట్టి వదిలివేయడం తప్ప అప్రోచ్ రోడ్ల పూర్తికి నిధులు మంజూరు చేయలేదని మంత్రి వెంకటరెడ్డి అన్నారు. రాష్ట్రంలో 13 వేల కోట్లతో 6000 కిలోమీటర్ల రహదారులను హ్యాబ్రిడ్ మోడల్ లో చేపడుతున్నట్టు మంత్రి వెంకటరెడ్డి వివరించారు. ఈ పనులకు సంబంధించిన ప్రైస్ బిడ్ పనులు పూర్తి అయ్యాయి మే మొదటి వారంలో రాష్ట్రంలో హ్యాబ్రిడ్ మోడల్ లో రోడ్ల నిర్మాణం చేపట్టుతున్నట్టు సమావేశంలో మంత్రి వెంకట్ రెడ్డి వివరించారు. 20 వేల కోట్లతో హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నారు తెలిపారు. మొత్తం ఎనిమిది లైన్లతో ఈ రహదారి విస్తరణ మందు చేపట్టినట్టు తెలిపారు. ఆరు ప్రధాన లైన్లు, రెండు సర్వీస్ లైన్ల నిర్మాణం జరుగుతుంది అన్నారు. 500 కోట్లతో బ్లాక్ స్పాట్స్, చౌటుప్పల్, చిట్యాల వంటి గ్రామాల మీదుగా ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణం జరుగుతుందని మంత్రి వెంకటరెడ్డి వివరించారు.ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి– బందరు పోర్టు వరకు 20 వేల కోట్లతో గ్రీన్ ఫీల్డ్ రోడ్ నిర్మాణానికి అలైన్మెంట్ ఖరారు చేసి కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్టు మంత్రి వెంకటరెడ్డి అధికారులకు వివరించారు. ఈ రోడ్డు అలైన్మెంట్ కు అనుగుణంగా బుల్లెట్ ట్రైన్ నడిపేందుకు అవసరమైన అలైన్మెంట్ సైతం ఖరారు చేసి కేంద్రానికి పంపినట్టు మంత్రి వెంకటరెడ్డి వివరించారు. మన్ననూరు– శ్రీశైలం 52 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ రహదారి నిర్మాణానికి 8,000 కోట్లు కేటాయించడం జరిగిందని మంత్రి తెలిపారు.రీజినల్ రింగ్ రోడ్డు (ఖీఖీఖీ )నిర్మాణానికి 36 వేల కోట్లు మంజూరు అయ్యాయని ఇది రాష్ట్రానికి గేమ్ చేంజర్ ప్రాజెక్టు అని మంత్రి వెంకట్ రెడ్డి వెల్లడించారు. ఈనెల 8న రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తరభాగం భూ సేకరణకు రాష్ట్ర వాటాగా 628 కోట్ల రూపాయలు ఔఊంఎ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాకు జమ చేశాం అని తెలిపారు.

**148 కోట్లతో అప్రోచ్ రోడ్ల నిర్మాణం**

రాష్ట్రంలో మూడు సంవత్సరాల క్రితం బ్రిడ్జిలు నిర్మించినప్పటికీ వాటికి అప్రోచ్ రోడ్లు నిర్మించకపోవడం మూలంగా అవి నిరూపయోగంగా ఉన్నాయి, సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న అప్రోచ్ రోడ్ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతనన్యూ స్ట్రక్చర్ మరియు క్యాపిటల్ వర్క్స్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రులు, క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులైన కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిల్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి అవసరమైన రూ.148 కోట్ల నిధుల విడుదలకు క్యాబినెట్ సబ్ కమిటీ ఆమోదం తెలిపిందని డిప్యూటీ సీఎం ప్రకటించారు. సరైన పద్ధతిలో ప్రతిపాదనలు పంపితే ఆమోదం తెలపడం, అమలు చేయడం సులభం అవుతుందని పనులు వేగవంతం అవుతాయని డిప్యూటీ సీఎం తెలిపారు. 1:4 నిష్పత్తిలో వివిధ శాఖల నుంచి ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపితే సబ్ కమిటీలు చర్చించి ఆమోదం తెలుపుతామని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని జూన్ 8 లోపల అప్రోచ్ రోడ్ల నిర్మాణం పూర్తి కావాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రగతిని తాను ప్రత్యేకంగా ప్రతి వారం సమీక్షిస్తానని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు.

## జస్టిస్ ఘోష్ నివేదిక ఆధారంగా

# చర్యలు చేపట్టొద్దు

అవినీతి జరిగిందంటూ రాష్ట్ర ప్రభుత్వం 2024 మార్చిలో జీవో నంబర్ 6ను జారీ చేస్తూ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. అయితే ఘోష్ కమిషన్‌ను సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో మాజీ సీఎం కేసీఆర్, హరీశ్ రావు, స్మిత సబర్వాల్, ఎస్కే జోషి పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానంలో సుదీర్ఘంగా విచారణ జరిగింది. ఈ పిటిషన్లపై ఏప్రిల్ 8న వాదనలు ముగియగా తీర్పును హైకోర్టు ఈరోజుకు(ఏప్రిల్ 22) వాయిదా వేసింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 6ను సమర్థించిన హైకోర్టు.. జీవో నంబర్ 6ను ఆధారంగా ఏర్పాటైన కమిషన్ నివేదికను అసెంబ్లీలో చర్చ జరగకుండానే మీడియా ముందుకు తీసుకురావడాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. కమిషన్ ఇచ్చిన నివేదికను ఆధారంగా చేసుకుని పిటిషనర్లపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని తెలంగాణ హైకోర్టు తీర్పునిచ్చింది. కాళేశ్వరంపై హైకోర్టు తీర్పుతో కేసీఆర్‌కు ఊరట లభించిందని మాజీ సీఎం అడ్వకేట్ గండ్రమోహన్ రావు తెలిపారు. హైకోర్టు తీర్పుతో కమిషన్ రిపోర్టును చెత్తలో పడేయవచ్చన్నారు. సెక్షన్ 8 కింద విచారణ జరగలేదని చెప్పారు. పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటును హైకోర్టు సమర్థించిందని తెలిపారు. అయితే కమిషన్ రిపోర్టును పరిగణనలోకి తీసుకుని సీబీఐ దర్యాప్తు చేయరాదని న్యాయస్థానం చెప్పిందని కేసీఆర్ అడ్వకేట్ గండ్రమోహన్ రావు వెల్లడించారు.

## కాళేశ్వరంపై ఎవ్వరికీ క్లీన్‌చిట్ ఇవ్వలేదు

వ్యక్తం చేసిందని తెలిపారు. సీబీఐకి ఘోష్ కమిషన్ పంపిన రిపోర్టుల్లో ఎవరి పేర్లను మెన్షన్ చేయలేదని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రి ఉత్తమ్ బుధవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్, హైకోర్టు తీర్పుపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మీడియాతో చిట్ చాట్ చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 6ను కొట్టివేయాలని పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారని... కానీ జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటును హైకోర్టు తప్పుపట్టలేదని స్పష్టం చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నియామకాన్ని పూర్తిగా సమర్థించిందని తెలిపారు. కమిషన్ ఫైండింగ్స్‌ను కూడా హైకోర్టు తప్పుపట్టలేదని చెప్పుకొచ్చారు. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ చట్టం 1952లోని సెక్షన్ 3 ప్రకారం జీవో ఎంఎస్ నంబర్ –6 ద్వారా ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ రాజ్యాంగబద్ధమేనని న్యాయస్థానం స్పష్టం చేసిందని పేర్కొన్నారు. కమిషన్ ఏర్పాటు అధికార పరిధిని మించింది కాదని.. అసమంజసం కాదని, అక్రమం కాదని కూడా న్యాయస్థానం స్పష్టం చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణ నివేదికలో కొందరు బాధ్యులపై చేసిన నిర్ధారణలపై హైకోర్టు అభ్యంతరం తెలిపిందని చెప్పారు. పిటిషనర్లకు నిర్ణీత ఫార్మాట్ ప్రకారం నోటీసు ఇవ్వలేదనే టెక్నికల్ అంశాన్ని తప్పుపట్టిందన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణ నివేదిక ఆధారంగా వారిపై చర్యలు తీసుకోవద్దని పిటిషనర్లకు రిలీఫ్ ఇచ్చిందని చెప్పారు. ఇప్పటికే తమ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలు, అవకతవకలపై సీబీఐతో విచారణ చేపట్టాలని నిర్ణయించిందని అన్నారు. సీబీఐకు లేఖ రాశామని ప్రస్తావించారు. ఈ రోజు వెలువడిన హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదని.. న్యాయస్థానం ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. హైకోర్టు పూర్తి తీర్పును పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని ముమ్మాటికీ నిజమన్నారు. ప్రాజెక్టుకు ఎంచుకున్న సైట్ నుంచి డిజైన్ల నుంచి నిర్మాణాలు, నిర్వహణ అన్నిచోట్ల అవకతవకలు జరిగాయని.. అన్నీ లోపాలే ఉన్నాయని.. బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇది పూర్తిగా ప్రొసిజరల్, టెక్నికల్ అంశమని చెప్పుకొ చ్చారు. కాళేశ్వరం ప్రజల కళ్లముందే కుంగిపో యిందని.. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాక్ కుంగిపోయిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆ బ్యారేజీ దగ్గరకు వెళ్తే ఎవరికైనా కుంగిన తీరు కనపడుతుందన్నారు. లక్ష కోట్లతో కట్టిన బ్యారేజీ మూడేళ్లకే కుంగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో కట్టిన ప్రాజెక్టు వాళ్ల హయంలోనే కుంగిపోయిందని అన్నారు. అందుకు కారణాలేమిటో తేల్చాల్చిన బాధ్యత.. తమ ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కూడా బ్యారేజీల కుంగుబాటుకు దారి తీసిన కారణాలు, డిజైన్ల, నిర్మాణం, నిర్వహణ లోపాలపై తమ ప్రాథమిక నివేదికను బీఆర్ఎస్ హయాంలోనే సమర్పించిందని అన్నారు. బ్యారేజీలకు ఎంచుకున్న ప్రాజెక్టు సైట్ నుంచి డిజైన్లు, నిర్మాణంలో జరిగిన లోపాలన్నింటినీ తమ ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ కమిషన్ బయటపెట్టిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాలు, అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన రిటైర్డ్ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కూడా ఇంజనీర్లను, ఐఏఎస్‌లను, అప్పటి పరిపాలనా బాధ్యులను విచారించి నివేదికను వెల్లడించిందని తెలిపారు. బాధ్యులెవరు, దోషులెవరు.. ఎక్కడెక్కడ తప్పులు జరిగాయో తేలుస్తామని చెప్పారు. ఏమేం లోపాలున్నాయో.. ఎన్డీఎస్ఏతో పాటు విజిలెన్స్, పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలపై ఆగస్టులోనే తమ ప్రభుత్వం అసెంబ్లీలో చర్చకు పెట్టిందని ప్రస్తావించారు. విజిలెన్స్, ఎన్డీఎస్ఏ, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికల ఆధారంగా దర్యాప్తు జరపాలని సీబీఐ విచారణకు ప్రభుత్వం లేఖ రాసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## ఎన్ని కుట్రలు పన్నినా న్యాయమే గెలిచింది

హైదరాబాద్(జనంసాక్షి):ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపితమైందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పీసీ ఘోష్ నివేదికపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందించారు. ఘోష్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం స్పష్టం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలు అయ్యాయని, రేవంత్ నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యిందంటూ హరీశ్ పోస్ట్ చేశారు. 'సత్యమేవ జయతే.. ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపితమైంది. ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ నడిపిన విచారణను ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కమిషన్ చేసిన వ్యాఖ్యలు చెల్లవని, ఆ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని స్పష్టంగా తీర్పునిచ్చింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలయ్యాయి. ప్రజా సమస్యలు పక్కనపెట్టి డ్రామాలు ఆడిన రేవంత్ రెడ్డి నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యింది. ఇప్పటికైనా కక్షసాధింపులు, రాజకీయ దుష్ప్రచారం మానేసి వెంటనే రెండు పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేసి తెలంగాణ రైతుల ప్రయోజనాలు కాపాడాలని విజ్ఞప్తి చేశారు

## హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

హైదరాబాద్(జనంసాక్షి): కూలింది.. కాళేశ్వరం కాదని, కాంగ్రెస్ చేసిన కుట్రలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై బుధవారం హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. హైకోర్టు తీర్పు కాంగ్రెస్ కుట్రలకు చెంపపెట్టు అని కేటీఆర్ అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పని చేయాలని హితవు పలికారు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదు, ముమ్మాటికీ పీసీసీ నివేదిక అని మేము ముందు నుంచి చెబుతుంది ఇవాళ అక్షరాల నిజమని తేలిపోయిందన్నారు.. కేసీఆర్‌పై దుష్ప్రచారం చేసిన వారి చెంప చెళ్లుమనించే విధంగా హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు.

## కాళేశ్వరం అవినీతి విచారణలో సర్కార్ విఫలం

హైదరాబాద్(జనంసాక్షి): కాళేశ్వరం అవినీతి విచారణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం అవకతవకలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికకు సంబంధించి బుధవారం తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఈ ప్రభుత్వ వైఫల్యాన్ని మరోసారి బట్టబయలు చేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగినట్లు ఆధారాలు ఉన్నప్ప టికీ.. వాటిని చట్టపరంగా సమర్థవంతంగా కోర్టు ముందు ప్రవేశపెట్టడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. .

## కాళేశ్వరం కథ ముగియలేదు

హైదరాబాద్(జనంసాక్షి): కాళేశ్వరంపై తెలంగాణ హైకోర్టు క్లీన్ చిట్ ఇవ్వలేదని.. బీఆర్ఎస్ నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదన్నారు. హైకోర్టు తీర్పును పూర్తిగా అధ్యయనం చేశాక భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

**అన్ని నివేదికలు ఇదే చెప్పాయి:కోదండరామ్**

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై టీజేఎస్ అధ్యక్షులు కోదండరాం స్పందించారు. హైకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారో అర్థం కావడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అవినీతి జరిగిందని, లోపాలు ఉన్నాయని కాగ్, విజిలెన్స్, ఎన్డీఎస్ఏ రిపోర్ట్‌లు ఇచ్చాయని తెలిపారు. ఈ నివేదికల ఆధారంగా కూడా చర్యలు తీసుకోవచ్చన్నారు. విచారణ చేయకపోతే సీబీఐదే తప్పవుతుందని టీజేఎస్ అధ్యక్షులు చెప్పుకొచ్చారు. కాళేశ్వరంలో తప్పు జరిగిందని తెలుస్తున్నప్పుడు చర్యలు తీసుకోడానికి ఇబ్బంది ఏంటని కోదండరాం ప్రశ్నించారు.

## సమ్మె విరమించండి చర్చించుకుందాం రండి..

హైదారబాద్(జనంసాక్షి):ఆర్టీసీ సమ్మెను విరమించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమస్యలకు సమ్మె పరిష్కారం కాదని ఆయన సూచించారు. సమస్యల పరిష్కారానికి నలుగురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేసిందని.. 4 వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించామని తెలిపారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తామనడం పొరపాటు అని స్పష్టం చేశారు.ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన 32 అంశాల్లో 29 అంశాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి వ్యతిరేకత లేదని పొన్నం ప్రభాకర్ తెలిపారు. అవన్నీ వెంటనే పరిష్కారమయ్యే అంశాలని పేర్కొన్నారు. ఆర్టీసీ విలీనం, గుర్తింపు సంఘాల ఎన్నికలు రెండు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఈ రెండు అంశాల్లో పలు సాంకేతిక అంశాలు చర్చించాల్సి ఉందన్నారు. వీటిపై అధ్యయనం చేసేందుకే నాలుగు వారాల గడువు అడిగామని వివరించారు. ఈ రెండు అంశాలు కూడా సీఎం, డిప్యూటీ సీఎం దగ్గర చర్చిస్తామని అన్నారు. ఆర్టీసీ విలీనం ఆలస్యమైనప్పటికీ.. ఉద్యోగులకు ఒకటో తారీఖు జీతాలు వస్తున్నాయని పొన్నం ప్రభాకర్ తెలిపారు. గుర్తింపు సంఘాల ఎన్నికల విషయంలో నాయకుల మధ్య అంతర్యుద్ధం, నాయకత్వ అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటుందని.. అన్ని అంశాలను పరిష్కరిస్తామని చెప్పారు. మిమ్మల్ని ఎవరూ అడ్డుకోరని.. ప్రజాస్వామ్య పద్ధతిలో మీ నాయకులు నిరసన తెలపవచ్చని.. ప్రజలపై ఒత్తిడి తీసుకురావచ్చని అన్నారు.

## సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

హైదరాబాద్(జనంసాక్షి):

తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ టీజీఎస్ ఆర్టీసీ ప్రారంభించిన సమ్మెను నేటి నుంచి మరింత ఉధృతం చేసేందుకు సన్నాహాలు ప్రారంభించింది. గురువారం అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట మహాధర్నాను నిర్వహించాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఉదయం 5 గంటల నుంచి ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం, యాజమాన్యం సమ్మె డిమాండ్లను పరిష్కరించకుండా మొండిగా వ్యవహరిస్తూ దాటవేత ధోరణి అవలంబిస్తూ, ప్రజలను ఆర్టీసీ కార్మిక వర్గాన్ని తప్పుదారి పట్టిస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వం వేసిన కమిటీ అధికారులే ఇప్పటి కిప్పుడు సమస్యలు పరిష్కరించలేమని చేతులెత్తేయడం వల్ల విధిలేని పరిస్థితుల్లో సమ్మెను ప్రారంభించ వలసి వచ్చిందని వెల్లడించారు. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేసేంతవరకు, 2021 వేతన సవరణ 30 శాతం తగ్గకుండా అమలు చేసేంతవరకు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ బస్సులను రద్దుచేసి ఇతర జోన్లకు ఉద్యోగులను బదిలీ చేసే ఉత్తర్వులను రద్దు చేసే వరకు తమ ఆందోళనను కొనసాగిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు, అన్ని యూనిట్లు, అన్ని వర్క్ షాప్ లలో మహాధర్నాలను జయప్రదం జేయాలని జేసీసీ నాయకులు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొంటున్నారని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న తెలిపారు.

# ఆర్టీసీ సమ్మెతో ఆగిన బస్సులు



తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి బస్సులన్నీ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వంటి మహానగరంలో దాదాపు రోజుకు 25 లక్షల మంది ప్రజా రవాణాను వినియోగిస్తున్నారు. ఇదే అదనుగా వారు అధిక ఛార్జీలను వసూలు చేస్తున్నారు.కరీంనగర్‌లో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రైవేటు డ్రైవర్‌తో నడిపిస్తున్న అద్దె బస్సు లారీని ఢీకొట్టింది. కరీంనగర్‌లోకి కోతిరాంపూర్ బైపాస్ వద్ద బస్సు అదుపు తప్పడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. కాగా, శిక్షణ లేని డ్రైవర్లతో బస్సులు నడిపిస్తుండటం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీజీఎస్ ఆర్టీసీ కార్మికుల సమ్మెతో హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. మెట్రో రైళ్ల సంఖ్య, ఫ్రీక్వెన్సీ పెంచాలని నిర్ణయించారు. ఆర్టీసీ సమ్మె ముగిసేవరకూ 56 మెట్రో రైళ్లను నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు. మియాపూర్– ఎల్.బి.నగర్ కారిడార్‌లో 4 నిమిషాల 20 సెకన్ల విరామంతో, అలాగే నాగోల్– రాయదుర్గం కారిడార్‌లో 3 నిమిషాల 40 సెకన్ల విరామంతో రోజంతా గరిష్ఠంగా 56 రైళ్లను నడపనున్నట్లు తెలిపారు. చివరి మెట్రో రైలు సర్వీస్ రాత్రి 11 గంటల తర్వాత కూడా పొడిగించేలా చర్యలు చేపట్టినట్లు మెట్రో అధికారులు పేర్కొన్నారు. అయితే, కార్మికుల సమ్మెతో నగరవాసులు మెట్రో రైళ్లపై ఆధారపడాల్సి వచ్చింది. ఉదయం నుంచి రైళ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు తండోపతండాలుగా మెట్రోస్టేషన్లకు తరలివస్తున్నారు. పెరిగిన ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 56 మెట్రో రైళ్లను నడపాలని అధికారులు నిర్ణయించారు. మరోవైపు కార్మికుల సమ్మెపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.కాగా ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ సంఘీభావం తెలుపుతుందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ గత కేసీఆర్ ప్రభుత్వంలోనే కేబినెట్ ఆమోదం తెలిపి, జీవో, గెజిట్ ఇచ్చామన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చెప్పిందే అమలు చేయమని ఆర్టీసీ కార్మికులు అడుగుతున్నారన్నారు.రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోవడం వల్లే ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీకి రూ.3000 కోట్లు ప్రభుత్వం బకాయిలు పడింది. దీంతో ఆర్టీసీ ఉద్యోగులకు డీఏలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేకపోతుందని విమర్శించారు. కార్మికులతో చర్చలు జరిపి వారి న్యాయబద్ధమైన కోరికలు నెరవేర్చాలన్నారు. తక్షణమే మహాలక్ష్మి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## కాల్పుల విరమణ మళ్లీ పొడిగింపు

ఇదిలావుంటే ఇరాన్‌తో ప్రస్తుతం కొనసాగుతున్న కాల్పుల విరమణ ఒప్పందంపై అమెరికా ఒక హెచ్చరిక జారీ చేసింది. ఈ కాల్పుల విరమణ అనేది 'అపరిమిత కాలం' కోసం కాదని, ఇరాన్ తన బాధ్యతలను నెరవేర్చడానికి ఒక నిర్దిష్ట సమయం మాత్రమే కేటాయించామని అమెరికా ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు. ఈ అంశం గురించి సదరు అధికారి 'యాక్సియోస్' పత్రికతో మాట్లాడుతూ, ఇరాన్ నిబంధనలను పాటించకపోతే ప్రస్తుతం ఉన్న కాల్పుల విరమణను ఎప్పుడైనా రద్దు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉద్రిక్తతలను తగ్గించడానికి ఇరాన్‌కు ఒక అవకాశం ఇచ్చామని, అయితే దీనిని ఆ దేశం బలహీనతగా భావించకూడదన్నారు.

**రెండు,మూడు రోజుల్లో మలివిడత శాంతి చర్చలు:ట్రంప్**

ఇస్లామాబాద్ వేదికగా ఇరాన్‌తో జరగనున్న మలివిడత శాంతి చర్చలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. రెండు మూడు రోజుల్లో చర్చలు తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ మేరకు అమెరికా మీడియాలో వార్తలు వచ్చాయి. బుధవారంతో అమెరికా– ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ముగియాల్సి ఉన్నప్పటికీ.. రెండు రోజుల క్రితమే శాంతి చర్చలకు ఇరాన్‌కు మరింత సమయం ఇస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు.

**హఠాత్తుగా దాడి చేసేందుకే.. సీజ్‌ఫైర్ పొడిగింపు**

పొడిగింపు అర్థం లేనిదని కొట్టిపారేశారు. ఓటమి అంచున ఉన్నవారు.. షరతులు విధించలేరని ఎద్దేవా చేశారు. తమ నౌకల రాకపోకలపై దిగ్బంధనాన్ని కొనసాగించడం అంటే.. అది బాంబు దాడితో సమానమేనని వ్యాఖ్యానించారు. దీనికి సైనిక ప్రతిస్పందన తప్పనిసరిగా ఉంటుందని హెచ్చరించారు. ట్రంప్ కాల్పుల విరమణ పొడిగింపు అనేది హఠాత్తుగా తమపై దాడి చేయడం కోసం చేసిన ప్రణాళిక అని ఆరోపించారు. ఈ సందర్భంగా ఇరాన్ చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందంటూ బెదిరించారు. ఇక, అమెరికా– ఇరాన్ మధ్య ఈనెల 8న రెండు వారాల పాటు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఇది ముగియడానికి కొన్ని గంటల ముందు.. కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. అయితే, హర్మూజ్ వద్ద తమ దిగ్బంధనం మాత్రం ఇంకా కొనసాగనుందని స్పష్టంచేశారు.

**హర్మూజ్ జలసంధిలో.. నౌకలపై ఇరాన్ దాడి**

అమెరికా–ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం పొడిగించిన కొన్ని గంటలకే కీలక పరిణామం చోటుచేసుకొంది. హర్మూజ్ జలసంధిలో రెండు నౌకలపై ఇరాన్ దాడి చేసింది. ఈ దాడిలో ఓ కంటైనర్ నౌక దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ హర్మూజ్ జలసంధి లో ఓ కంటైనర్ నౌకపై కాల్పులకు పాల్పడిందని యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ పేర్కొంది. కాల్పులకు ముందు గన్‌బోట్ నౌకకు ఎలాంటి హెచ్చరికలు చేయలేదని తెలిపింది. కాల్పుల్లో నౌకకు నష్టం వాటిల్లిందని, ఇందులో ఎవరికీ గాయాలు కాలేదని స్పష్టంచేసింది.

## బ్యాంకింగ్ వ్యవస్థలో సమూల ప్రక్షాళన అవసరం

హైదరాబాద్(జనంసాక్షి):సైబర్ నేరాలను అరికట్టాలంటే బ్యాంకింగ్ వ్యవస్థలో సమూల ప్రక్షాళన అవసరమని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. సైబర్ ముఠాలకు 'మ్యూల్ అకౌంట్లు' వరంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నగర పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ ఆక్టోపస్' దర్యాప్తులో వెలుగుచూసిన అంశాల ఆధారంగా బ్యాంకింగ్ వ్యవస్థలోని లోపాలను వివరిస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రాకు లేఖ రాశారు. ఖాతాల ప్రారంభంలో కేవైసీ ధ్రువీకరణలో జరుగుతున్న నిర్లక్ష్యం ప్రధాన సమస్యగా ఉందని సీపీ పేర్కొన్నారు. బ్రాంచ్ స్థాయి అధికారులపై జవాబుదారీతనం నిర్ధారిస్తూ అన్ని వాణిజ్య బ్యాంకులకు కఠిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఆర్బీఐ మార్గదర్శకాల అమలుపై తక్షణమే సిస్టమిక్ ఆడిట్ నిర్వహించాలని సూచించారు. ప్రజల సొమ్మును కాపాడాల్సిన కొంత మంది బ్యాంకు అధికారులే సైబర్ నేరగాళ్లతో కుమ్మక్కవుతున్నారని పేర్కొన్నారు. నాసిక్‌లో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లో జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ కేవైసీ వెరిఫికేషన్‌లో జరిగిన లోపాలు భద్రతా వైఫల్యానికి నిదర్శనమని తెలిపారు. సైబర్ నేరాలకు సహకరించిన బ్యాంకు అధికారులను గుర్తించి ఆర్బీఐకి నివేదించి వారిని శాశ్వత బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలని సూచించారు. మ్యూల్ అకౌంట్లపై నిరంతర పర్యవేక్షణ కోసం ఆర్బీఐ, బ్యాంకులు, పోలీసులతో కూడిన జాయింట్ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

# ప్రభుత్వ కాలేజీలు, హాస్పిటళ్ల అభివృద్ధి

- అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- అధికారులకు మంత్రి దామోదర ఆదేశాలు




హైదరాబాద్, ఏప్రిల్ 22 (జనంసాక్షి) : రాష్ట్రంలో ప్రభుత్వ కాలేజీలు, హాస్పిటళ్ల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. భారత సంప్రదాయ వైద్య సేవలకు ప్రాచుర్యం కల్పించి, ప్రజలకు ఉపయోగపడేలా ఆయుష్ డిపార్ట్‌మెంట్ పనివిధానం ఉండాలని మంత్రి సూచించారు. ఓపీ, ఐపీ పేషెంట్ల సంఖ్య మరింత పెరగాలన్నారు. అవసరమైన చోట డాక్టర్లు, సిబ్బందిని నియమించుకోవాలని ఆదేశించారు. సిద్ధిపేట, వికారాబాద్, భూపాలపల్లిలోని ఇంటిగ్రేటెడ్ ఆయుష్ హాస్పిటల్స్‌లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించి, వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు. ఆయుష్ మెడిసిన్ సప్లైలో గ్యాప్ ఉండకూడదని, పేషెంట్లకు అవసరమయ్యే అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రభుత్వ ఆయుర్వేద, హోమియోపతి డాక్టర్లు, సిబ్బంది అటెండెన్స్‌ను స్ట్రిక్ట్‌గా మానిటర్ చేయాలని మంత్రి ఆదేశించారు. డ్యూటీలకు గైర్హాజరయ్యే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. సరియైన అనుమతులు, అర్హతలు లేకుండా, ఆయుర్వేద, హోమియోపతి తదితర హాస్పిటళ్లు, క్లినిక్‌లు నడిపిస్తూ, తప్పుడు ప్రకటనలతో ప్రజలను దోచుకుంటున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆయుష్ డైరెక్టర్ శ్రీకాంత్ బాబును మంత్రి ఆదేశించారు. తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా ఆయుర్వేద, హోమియోపతి తదితర పేర్లతో నడుస్తున్న క్లినిక్‌లు, హాస్పిటళ్లను తనిఖీ చేయాలని, అవసరమైన అనుమతులు లేని హాస్పిటళ్లపై చర్యలు ప్రారంభించాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో ఆయుష్ వైద్య సేవలపై నేచర్‌క్యూర్ హాస్పిటల్‌లో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ బుధవారం సమీక్ష చేశారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, ఆయుష్ డైరెక్టర్ శ్రీకాంత్ బాబు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆయుష్ హాస్పిటల్స్, క్లినిక్‌లు, కాలేజీలు, తదితర అంశాలను మంత్రి ఆరా తీశారు.

# ఘనంగా క్రీడా యువజన కార్యక్రమాలు

- క్రీడోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రులు



హైదరాబాద్, ఏప్రిల్ 22 (జనంసాక్షి) : ప్రజా పాలన ,ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ఐటీ / పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు , యువజన సర్వీసులు / క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మే 18 నుండి 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా యువజన క్రీడా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా క్రీడల శాఖ రూపొందించిన యువజన క్రీడోత్సవాల పోస్టర్‌ను బుధవారం ఉదయం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రధాన లక్ష్యం ప్రజలకు ప్రభుత్వ సేవలను వారి వద్దకే తీసుకెళ్లడం అని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. మే 1 నుండి 12 వరకు జిల్లా కేంద్రాల్లో ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నట్లు, అలాగే మే 18 నుండి 23 వరకు యువజన కేంద్రిత కార్యక్రమాలను క్రింది విధంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో రాష్ట్రవ్యాప్తంగా యువజనులు, క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని, అలాగే ఉద్యోగ మేళాలు మరియు ఇతర కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. అన్ని జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం అయ్యే విధంగా జిల్లా కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. ఏ. సోనిబాలా దేవి, ఐఎఫ్ఎస్ గారు మాట్లాడుతూ, ఇటీవల గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ఐదు దశల్లో నిర్వహించిన సీఎం కప్ 2025 రెండవ ఎడిషన్‌లో సుమారు 5.64 లక్షల మంది క్రీడాకారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని తెలిపారు. 16 సంవత్సరాలు పైబడిన యువజనులను ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండి డా. సోనిబాలా దేవి, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, యువజన సర్వీసులు జాయింట్ డైరెక్టర్ వేణుగోపాల్, స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ డా. రవితేజ, టాస్క్ సీఈఓ నితిన్ రెడ్డి, డిఐడి అధికారి రాజేశ్వర్ రెడ్డి స్పోర్ట్స్ పి ఆర్ ఓ సురేష్ కాలేరు తదితరులు పాల్గొన్నారు.

# గోష్ కమిషన్ రిపోర్టుపై హైకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయం

హైకోర్టు న్యాయవాది మాజీ బీసీ కమిషన్ సభ్యులు ఉపేంద్ర



హైదరాబాద్ (జనంసాక్షి) : రాజకీయంగా లబ్ధి పొందాలని కాంగ్రెస్ పార్టీ అనేక తప్పుడు ఆరోపణలతో తప్పుడు కేసులు తప్పుడు ప్రచారాలు అసత్య ప్రచారాలు సత్య దూరమైనటువంటి వార్తలు మీడియా ద్వారా ప్రచారం చేసి కేసీఆర్ వ్యక్తిత్వాన్ని హననం చేయాలని ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నదని ప్రతి విషయంలో వాస్తవం ఆలస్యం అయినా కానీ బయటికి వస్తుందని ఆ విషయానికి నిదర్శనమే గోష్ కమిషన్ రిపోర్టును పక్కకు పెట్టాలని రిపోర్టు ఆధారంగా కేసీఆర్‌పై హరీష్ రావుపై మిగతా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ప్రజలకు న్యాయస్థానంపై గౌరవం పెంచిందని ఆయన అన్నారు. గోష్ కమిషన్ ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే విధంగా ఆర్టికల్ 21ను ఉల్లంఘించిందని అదేవిధంగా కమీషనర్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్‌లోని సెక్షన్ 8కు విరుద్ధంగా విచారణ కొనసాగించిందని ఆయన అన్నారు అందుకే కోర్టులో కేసీఆర్ గారికి న్యాయం జరిగిందని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మేడిగడ్డను మరమ్మతులు చేసి కేసీఆర్ లాగే కాళేశ్వరం ద్వారా తెలంగాణ రైతాంగానికి నీళ్లు ఇచ్చి సహాయ పడాలని అన్నారు పాలనపై దృష్టి పెట్టి అభివృద్ధి సంక్షేమాన్ని గత ప్రభుత్వం లాగే కొనసాగించాలని సూచించారు.

# మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాలల ప్రస్తావన కేబినెట్‌లో చర్చించండి

- ఇప్పటికే ప్రారంభమైన 'దోస్త్' ఆన్లైన్ ప్రక్రియ
- మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాకూబ్ పాషా



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలనే ప్రస్తావన ను గురువారం జరిగే రాష్ట్ర కేబినెట్ లో చర్చించాలని మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ.యాకూబ్ పాషా రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు లేఖ ద్వారా కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా గల 204 మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలల్లో గత యేడాది 8000 మంది, ఈ యేడాది 7753 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలలో ఉత్తీర్ణత సాధించడంతొపాటు, ఈ యేడాది ఇంటర్ ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో మైనారిటీ గురుకుల సంస్థ రెండో స్థానంలో నిలిచిందని అన్నారు. రాష్ట్రంలో నేటి వరకు మైనారిటీలకు గురుకుల డిగ్రీ కళాశాలలు లేనందున అనేక మంది విద్యార్థులు గత ఐదేళ్లుగా ఇంటర్ తర్వాత చదువులకు స్వస్తి పలికి, ఉపాధి చూసుకుని జీవనం సాగిస్తున్నారని, బాలికలకు వివాహాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఐదవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సంవత్సరానికి ఒక్కో విధ్యార్థికి ఒక లక్షా, ఇరవై వేలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, రాష్ట్రంలో నేటి వరకూ ఒక్క మైనారిటీ గురుకుల డిగ్రీ కాలేజీ కూడా ఏర్పాటు చేయలేదని దీని కారణంగా మైనారిటీ గురుకుల సంస్థ పై వెచ్చిస్తున్న నిధులు బూడిదలో పోసిన పన్నీరవుతుందని అన్నారు. యస్సీ, యస్టీ, బీసీలకు రాష్ట్ర వ్యాప్తంగా 80 కు పైగా గురుకుల డిగ్రీ కళాశాలలున్నాయని, మైనారిటీలకు మాత్రం ఒక్క కళాశాల కూడా లేదన్నారు. దీని కారణంగా మైనారిటీ గురుకులాలో ఇంటర్ వరకు చదివిన విధ్యార్థులు ఉన్నత విధ్యలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే డిగ్రీ ప్రవేశాల కొరకు ఆన్లైన్ ప్రక్రియ ప్రారంభమైందని కావున ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బాల, బాలికల కొరకు వేర్వేరుగా ప్రాతీ జిల్లాలలో మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేసేవిధంగా ముఖ్యమంత్రి ధ్రుష్టికి తీసుకెళ్లాలని కోరారు.

## నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల చిన్నారెడ్డి సంతాపం

హైదరాబాద్ (జనంసాక్షి) : ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు మృతి చెందడం పట్ల రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలిపారు. భాస్కర్ రావుతో ఉన్న అనుబంధాన్ని చిన్నారెడ్డి గుర్తు చేసుకున్నారు.

## వడదెబ్బతో మహిళ మృతి



గూడూరు, ఏప్రిల్22 (జనంసాక్షి): వడదెబ్బ తగిలి మహిళ మృతి చెందిన సంఘటన గూడూరు మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్ళగా ఎస్సై గిరిధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బొద్దుగుండ గ్రామానికి చెందిన పుల్సం ఎల్లమ్మ భర్త,సమ్మయ్య(లేట్ ), వయసు సుమారు 48 సం,,లు,కూలి పనుల కోసం బుధవారం ఉదయం సుమారు 6:30 గంటలకు గుమ్మడి కోటేష్ మిరప తోట ఎరడానికి వెళ్లినది. ఉదయం సుమారు 11:30 గంటల సమయంలో కళ్ళు తిరుగుట మరియు వాంతులు అవ్వడంతో ఇంటికి వచ్చిన అనంతరం కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా,వైద్యులు పరిశీలించి ఆమె అప్పటికే మృతి చెందినదిగా నిర్ధారించారు. అధిక వేడి (వడదెబ్బ) కారణంగా మృతి చెందినదని వెల్లడించారు. ఈ మేరకు మృతురాలి కొడుకు పుల్సం సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, తదుపరి విచారణ చేస్తున్నామని ఎస్ఐ గిరిధర్ రెడ్డి తెలిపారు.

# నాలుగు రోజుల్లో పెండ్లి

- అనుమానాస్పదంగా యువతి మృతి



మరిపెడ ఏప్రిల్ 22 (జనంసాక్షి) : పెళ్లికి కేవలం నాలుగు రోజులు మాత్రమే మిగిలి ఉండగా, మరిపెడ మండలంలో ఒక యువతి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపగా, పలు అనుమానాలకు తావిస్తోంది. మరిపెడ మండలం గిరిపురం ఇటుకలగడ్డ తండాకు చెందిన భూక్యా సంగీత (19)కు, మరిపెడ మున్సిపాలిటీ కొత్త తండాకు చెందిన అజ్మీర అరవింద్‌తో ఈనెల 29న పెళ్లి నిశ్చయమైంది. గతంలో ఇద్దరూ ప్రేమించుకున్నప్పటికీ, యువతి తల్లిదండ్రులు తొలుత ఈ పెళ్లికి అంగీకరించలేదని గ్రామస్తులు తెలిపారు. ఆ సమయంలో సంగీత పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసినట్లు సమాచారం. తరువాత కుటుంబ సభ్యులు ఒప్పుకుని, అదే యువకుడితో నిశ్చితార్థం జరిపి పెళ్లి తేదీ ఖరారు చేశారు. పెళ్లి ఏర్పాట్లు జరుగుతున్న క్రమంలో అబ్బాయి ఇంట్లో జరిగిన శుభకార్యానికి ఇరు కుటుంబ సభ్యులు హాజరైనట్లు తెలిసింది. మంగళవారం రాత్రి సమయంలో సంగీత అరవింద్ బైక్‌పై వెళ్లినట్లు తండా వాసులు చెబుతున్నారు. ఆ తర్వాత ఏమి జరిగిందో తెలియకుండానే, బుధవారం తెల్లవారుజామున గ్రామ సమీపంలోని భావి వద్ద సంగీత మృతదేహం కనిపించడం సంచలనం సృష్టించింది. మృతదేహం సమీపంలో రక్తపు మరకలతో ఉన్న చెప్పులు కనిపించడంతో ఘటనపై మరింత అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని మార్చురికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# గిగ్ వర్కర్ల సంక్షేమానికి ప్రభుత్వం అండ

- మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా
- మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్, ఏప్రిల్ 22 (జనంసాక్షి) : విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన గిగ్ వర్కర్ల కుటుంబ సభ్యులకు కార్మిక మరియు గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. గిగ్ వర్కర్లు లోకుర్తి నరేష్, జీ. శ్యామ్ సుందర్ మరియు అహ్మద్ బిన్ అబ్దుల్ ఖాదర్ కుటుంబ సభ్యులకు మంత్రి స్వయంగా చెక్కులు అందజేశారు. సెక్రటేరియట్‌లోని తన ఛాంబర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులతో మంత్రి మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం గిగ్ వర్కర్లకు అండగా నిలుస్తూ అసెంబ్లీలో గిగ్ వర్కర్స్ వెల్ఫేర్ చట్టాన్ని ఆమోదించిందని తెలిపారు. గిగ్ వర్కర్లకు ఇలాంటి రక్షణ, భద్రతా వలయం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. ఏ కార్మికుడికి ఎలాంటి ఇబ్బంది వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. గిగ్ వర్కర్లు అయినా, హమాలీలు అయినా అందరికీ ప్రభుత్వం నుండి తగిన సహాయం, పరిరక్షణ అందాల్సిందేనని అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి గిగ్ వర్కర్ల యూనియన్ కీలక పాత్ర పోషించిందని, వారు కార్మిక శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఈ చర్యలను సాధ్యంచేసారని మంత్రి అభినందించారు. ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ గిగ్ వర్కర్లు మరియు బలహీన వర్గాలను నిర్లక్ష్యం చేయదని, వారి హక్కులు మరియు సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్మిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ దాన కిషోర్, కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ ఈ. గంగాధర్, గిగ్ వర్కర్ల యూనియన్ నాయకుడు సలావుద్దీన్ మరియు ఇతరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయం అందించడంతో పాటు తమకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి, కార్మిక మరియు గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి గారికి కృతజ్ఞతలు తెలిపారు.

# హజ్ యాత్రకు పదివేల మంది సిద్ధం



- సకాలంలో వారిని హజ్‌కు పంపాలి
- అధికారులతో సమీక్షలో మంత్రి అజారుద్దీన్

హైదరాబాద్, ఏప్రిల్ 22 (జనంసాక్షి) : తెలంగాణ మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ హజ్-2026 ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ నుండి ప్రయాణించే సుమారు 10,000 మంది యాత్రికులకు ఉత్తమ సౌకర్యాలు కల్పించాలని అన్ని శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. రవాణా, భద్రత, వైద్య సేవలు, విమానాశ్రయ సమన్వయం, యాత్రికుల సంక్షేమ చర్యలు సమర్థవంతంగా అమలు అవుతున్నాయి. తెలంగాణ సచివాలయంలో హజ్-2026 ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్ష చేశారు. ఎంబార్కేషన్ పాయింట్ నుండి ఈ సంవత్సరం హజ్ యాత్రకు బయలుదేరనున్న సుమారు 10,000 మంది యాత్రికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన మరియు ప్రపంచ స్థాయి ఏర్పాట్లు చేయాలని అన్ని శాఖలకు ఆదేశించారు. యాత్రికుల వసతి, రవాణా, విమానాశ్రయ కార్యకలాపాలు, వైద్య సేవలు, భద్రత, సామాను రవాణా, జమ్‌జమ్ పంపిణీ తదితర అంశాలపై మంత్రి సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ నుండి జెడ్డాకు హజ్ చార్టర్ విమానాలు మే 4 నుండి మే 21, 2026 వరకు నడవనున్నాయి. తిరుగు ప్రయాణ విమానాలు మదీనా నుండి హైదరాబాద్‌కు జూన్ 11 నుండి జూన్ 26, 2026 వరకు కొనసాగనున్నాయి. వృద్ధులు, మహిళలు, తొలిసారి హజ్ యాత్రకు వెళ్తున్న వారికి మంత్రి అజారుద్దీన్ అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అధికారులు తెలిపారు. వారు గౌరవప్రదంగా, ప్రశాంతంగా తమ ఆధ్యాత్మిక యాత్ర పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

## వెంచర్ల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి




- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల ప్రతినిధి, ఏప్రిల్ 22 (జనంసాక్షి) : భూమి అభివృద్ధిలో భాగంగా వెంచర్ల ఏర్పాటు కొరకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో వెంచర్ ఏర్పాటు కొరకు అందిన దరఖాస్తులకు సంబంధించి భూమిని పట్టణ ప్రణాళిక అధికారి సంపత్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వెంచర్ల కొరకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను సరిచూసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక రంగంలో 'రివర్స్ టూరిజం'

- 'ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్
- జెండా ఊపి ప్రారంభించిన మంత్రి జూపల్లి
- ఆదివాసీలతో కలిసి బస్సులో ప్రయాణించిన మంత్రి



నిర్మల్,ఏప్రిల్ 22 (జనంసాక్షి) : రాష్ట్ర పర్యాటక రంగ చరిత్రలో సరికొత్త ఒరవడికి నాంది పడింది. కేవలం నగరవాసులు ప్రకృతిని చూడటానికి పల్లెలకు వెళ్లడమే కాకుండా, అడవి బిడ్డలు సైతం ఆధునిక అభివృద్ధిని, చారిత్రక వైభవాన్ని కళ్లారా చూడాలన్న సంకల్పంతో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు 'రివర్స్ టూరిజం'కు శ్రీకారం చుట్టారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం గోండు గూడెంలో బుధవారం నిర్వహించిన 'ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్'ను మంత్రి జూపల్లి కృష్ణారావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ఆదివాసీలకు కొత్త అనుభవాలు ఇవ్వడం, నగర జీవన విధానం పరిచయం చేయడం, ఆత్మవిశ్వాసం పెంచడం, రెండు సంస్కృతుల మధ్య అవగాహన పెంచడం, సాంస్కృతిక మార్పిడి, అంతిమంగా ఆదివాసీల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో ఈ వినూత్న కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు వివరించారు. కార్యక్రమాన్ని ప్రారంభించడమే కాకుండా, మంత్రి జూపల్లి స్వయంగా ఆదివాసీలతో కలిసి బస్సులో ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రయాణ పొడవునా వారితో ముచ్చటిస్తూ పర్యటన లక్ష్యాన్ని వివరించారు. 'బయటి ప్రపంచంతో అనుసంధానం కావడం వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. నగరాల్లోని అభివృద్ధిని చూసి చదువుల పట్ల ఆసక్తి పెంచుకోవాలి. ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలి. అప్పుడే ఆదివాసీల జీవన ప్రమాణాల్లో మార్పులు వస్తాయి' అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివాసీల విశిష్ట సంస్కృతికి, నగర నాగరికతకు మధ్య ఈ కార్యక్రమం ఒక వారధిలా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. 5 ప్రత్యేక బస్సుల్లో బయలుదేరిన 250 మంది ఆదివాసీలు మధ్యాహ్నం హైదరాబాద్‌లోని తారామతి బారాదరికి చేరుకుంటారు. రెండు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో విమానాశ్రయం, చార్మినార్, గోల్కొండ కోట, లుంబినీ పార్క్, శిల్పారామం వంటి ప్రాంతాలను వీరు సందర్శించనున్నారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మట్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ కామ్డే పాల్గొన్నారు. వీరితో పాటు డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, ఆత్రం సుగుణ, కాంగ్రెస్ నాయకులు ఆత్రం సక్కు, సోయం బాపురావు, ఆదే గజేందర్ తదితరులు పాల్గొన్నారు,

# కాకతీయుల నాటి గ్రామ స్వయంపాలన - ఆధునిక భారతానికి దర్పణం

"చరిత్ర కేవలం గతాన్ని నమోదు చేయదు - అది భవిష్యత్తుకు మార్గదర్శనం చేస్తుంది. కాకతీయుల సామాజిక-ఆర్థిక వ్యవస్థ అందుకే నేటికీ అత్యంత సంబంధితంగా ఉంది. గ్రామం నుండి సామ్రాజ్యం వరకు, రైతు నుండి రాజు వరకు - ప్రతి స్థాయిలో సమగ్ర ఆలోచన చేసిన ఆ పాలకులు చరిత్రలో శాశ్వతంగా నిలిచారు."

**పీఠిక - చరిత్రకు ఒక కొత్త దృష్టి**

పదకొండు శతాబ్దం మొదలు పద్నాలుగు శతాబ్దం వరకు దక్షిణ భారతదేశాన్ని ఏలిన కాకతీయులు కేవలం యుద్ధవీరులు మాత్రమే కాదు - వారు ఒక మహత్తరమైన సామాజిక-ఆర్థిక నిర్మాతలు. ఓరుగల్లు కేంద్రంగా ఒక చిన్న సామంత రాజ్యం నుండి మొదలుపెట్టి, వారు నిర్మించిన సామ్రాజ్యం కేవలం భూభాగ విస్తరణకు మాత్రమే పరిమితం కాలేదు. గ్రామ జీవనంలో, వ్యవసాయ పద్ధతుల్లో, వాణిజ్య సంబంధాల్లో, సమాజ నిర్మాణంలో - ప్రతి రంగంలో వారు చేసిన మార్పులు యుగాంతరాలకు అభివృద్ధి నమూనాను అందించాయి.

గణపతిదేవుడు, రుద్రమాదేవి, ప్రతాపరుద్రుడు వంటి పాలకులు వారి శాసనాల ద్వారా, నిర్మాణాల ద్వారా, విధాన నిర్ణయాల ద్వారా నేటికీ మనతో సంభాషిస్తున్నారు. ఆ సంభాషణను సరిగ్గా వినగలిగితే - అందులో నేటి భారతదేశానికి అవసరమైన అనేక పాఠాలు దొరుకుతాయి. ఈ సంపాదకీయం ఆ పాఠాలను అన్వేషించే ప్రయత్నం.

**గ్రామ స్వయంపాలన - వికేంద్రీకరణ విజయగాథ**

కాకతీయుల అత్యంత విశిష్టమైన విజయం ఏదైనా అంటే అది గ్రామ స్వయంపాలన వ్యవస్థ. అయగర్ పద్ధతి ద్వారా ప్రతి గ్రామం ఒక స్వయం సమృద్ధి కేంద్రంగా నిర్మించబడింది. పన్నెండు మంది సేవాధికారులు - రెడ్డి నేతృత్వంలో, కరణం లెక్కల నిర్వహణలో, ఇతర వృత్తిజీవులు వారివారి సేవల్లో - ఒక పటిష్టమైన స్థానిక పాలన వ్యవస్థను రూపొందించారు. వారికి మన్యం భూములు కేటాయించడం ద్వారా ఆ సేవాధికారులు గ్రామంతో జీవితాంతం అనుబంధితులయ్యారు. ఈ విధానం యొక్క ప్రాముఖ్యత అర్థం చేసుకోవాలంటే నేటి సందర్భాన్ని గుర్తు తేవాలి. కేంద్రీకృత పాలన విధానాలు ఎప్పుడూ స్థానిక సమస్యలను సమర్థంగా పరిష్కరించలేవని సమకాలీన పరిపాలనా శాస్త్రం నిరూపిస్తుంది. కాకతీయులు శతాబ్దాల ముందే ఈ సత్యాన్ని అనుభవపూర్వకంగా అర్థం చేసుకున్నారు. స్థానిక స్థాయిలో అధికారం, వనరులు, బాధ్యత - ఈ మూడూ ఒకే చేతుల్లో ఉంటే పాలన ఎంత సమర్థంగా నడుస్తుందో అయగర్ వ్యవస్థ నిరూపించింది.

స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కరించబడేవి కాబట్టి రాజ్య కేంద్రంపై పరిపాలనా భారం తగ్గింది. ప్రతి గ్రామం స్వయంగా తన వ్యవహారాలను నిర్వహించుకోవడం వల్ల ప్రజల్లో యాజమాన్య భావన పెరిగింది. ఈ భావన అభివృద్ధిలో అత్యంత శక్తివంతమైన చోదక శక్తి. నేటి గ్రామ పంచాయతీలు, స్వయంసహాయక సంఘాలు, స్థానిక పాలన సంస్థలు ఇదే సూత్రం ఆధారంగా నిర్మించబడ్డాయంటే, కాకతీయులు ఆధునిక పాలన తత్వాన్ని తమ కాలంలోనే అభ్యసించారని అర్థమవుతుంది.

**నీటిపారుదల విప్లవం - దూరదృష్టి యొక్క ఫలితం**

కాకతీయుల ఆర్థిక విధానాల్లో అత్యంత విప్లవాత్మకమైనది నీటిపారుదల రంగంలో వారు తీసుకున్న నిర్ణయాలు. వేల సంఖ్యలో చెరువులు, కుంటలు నిర్మించి వర్షాధారపు అనిశ్చితిని అధిగమించారు. రామప్ప చెరువు, పాకాల చెరువు, లక్నవరం చెరువు వంటి నిర్మాణాలు ఈ కాలపు ఇంజినీరింగ్ సామర్థ్యానికి మాత్రమే కాదు, పాలకుల దూరదృష్టికి కూడా నిదర్శనాలు.

వ్యవసాయానికి నిరంతర నీటి సరఫరా లభించినప్పుడు రైతు రెండు పంటలు పండించగలడు. రెండు పంటలు అంటే రెట్టింపు ఆదాయం. రెట్టింపు ఆదాయం అంటే మెరుగైన జీవన ప్రమాణాలు. ఈ గొలుసు ప్రతిచర్యను కాకతీయులు స్పష్టంగా అర్థం చేసుకుని అమలు చేశారు. అంతేకాక, అరణ్య ప్రాంతాలను సాగుభూములుగా మార్చి కొత్త గ్రామాలు



స్థాపించారు. ఇది జనాభా విస్తరణకు, పన్ను ఆదాయ పెరుగుదలకు, వ్యవసాయ ఉత్పత్తి వృద్ధికి - అన్నింటికీ ఒకే నిర్ణయం దోహదపడింది.

నేటి సందర్భంలో ఇది మరింత ప్రాసంగికంగా అనిపిస్తుంది. భారతదేశంలో వ్యవసాయ సంక్షోభానికి ప్రధాన కారణాల్లో నీటి అభద్రత ఒకటి. దక్కన్ పీఠభూమిలో వర్షాలు అనిశ్చితంగా ఉండటం, భూగర్భ జలాలు అడుగంటిపోవడం - ఇవి నేటి రైతు ఎదుర్కొంటున్న సవాళ్ళు. కాకతీయులు అమలు చేసిన చెరువుల ఆధారిత నీటి సంరక్షణ వ్యవస్థ ఈ సమస్యకు స్థానిక పరిష్కారాన్ని అందించింది. చెరువుల పునరుద్ధరణ నేటి తెలంగాణలో ఒక ముఖ్యమైన విధాన ప్రాధాన్యతగా మారడం కాకతీయుల ఆలోచన యొక్క శాశ్వత ప్రభావానికి నిదర్శనం.

సామాజిక నిర్మాణం - సమానత్వం వైపు ప్రయాణం

కాకతీయుల కాలంలో కుల వ్యవస్థ ఉన్నది - కానీ అది ఆ కాలం నాటి ఇతర రాజ్యాల్లో కనిపించే కాఠిన్యంతో అమలు కాలేదని శాసన ఆధారాలు స్పష్టంగా చెప్తున్నాయి. జన్మ ఆధారిత స్థానం కంటే వృత్తి ఆధారిత స్థానం, ప్రతిభ ఆధారిత గుర్తింపు ప్రాముఖ్యతను పొందాయి. "నాయక" అనే బిరుదు ఎవరైనా సరే సాధించవచ్చు - దానికి జన్మ కంటే కర్మ, సేవ, సామర్థ్యం ఆధారం.

రైతులు సైన్యంలో చేరడం, వృత్తిజీవులు పరిపాలనలో భాగస్వాములు కావడం - ఇవి సామాజిక చలనానికి నిదర్శనాలు. ఒక సమాజంలో సామాజిక చలనం సాధ్యమైనప్పుడు, వ్యక్తులకు తమ జన్మ స్థితిని అధిగమించి ఎదగగలిగే అవకాశం ఉన్నప్పుడు - ఆ సమాజం మొత్తం మరింత ఉత్పాదకంగా, మరింత శక్తివంతంగా పనిచేస్తుంది. అది మానవ వనరుల సద్వినియోగానికి మూలసూత్రం. ఈ సూత్రాన్ని కాకతీయులు ఆచరణలో పెట్టారు.

కులాల మధ్య సహకారం, పరస్పర గౌరవం ఆ కాలంలో ఎక్కువగా కనిపించాయి. దేవాలయ నిర్మాణాల్లో, చెరువుల తవ్వకంలో, రక్షణ కోటల నిర్మాణంలో - వివిధ వర్గాల ప్రజలు కలిసి పనిచేశారు. ఈ సహకారం కేవలం ఆర్థిక అవసరం మాత్రమే కాదు, సామాజిక ఐక్యతకు కూడా బాటవేసింది. ఒక విభజిత సమాజం ఎన్నటికీ శాశ్వతమైన అభివృద్ధిని సాధించలేదని చరిత్ర పదేపదే నిరూపించింది. కాకతీయులు ఈ పాఠాన్ని ముందే గ్రహించారు.

**రుద్రమాదేవి - చరిత్రలో ఒక సంకేతం**

కాకతీయుల కాలంలో మహిళల స్థానం గురించి మాట్లాడేటప్పుడు రుద్రమాదేవి అనే పేరు తప్పనిసరిగా వస్తుంది. ఆమె రాజ్యపాలన చేసిన కాలం - సుమారు 1263 నుండి 1295 వరకు - ఒక అసాధారణ చారిత్రక సంఘటన.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం**

# ఆకాశహర్మ్యాల వెలుగు...పర్యావరణానికి ముప్పు

ప్రపంచ జనాభా పెరుగుతోంది. జీవన శైలి మారుతోంది. గ్రామం నుంచి పట్టణానికి, పట్టణం నుంచి మహానగరానికి, అక్కడి నుంచి విదేశీ నగరాలకు వలసలు విస్తరిస్తున్నాయి. ఉపాధి, విద్య, వైద్యం, వ్యాపారం, సౌకర్యాలు ఇవన్నీ నగరాల చుట్టూ కేంద్రీకృతం కావడంతో "నగరీకరణ" అనివార్యంగా మారింది. ఫలితంగా భూమి విలువలు ఎగబాకాయి. రియల్ ఎస్టేట్ బూమ్ పెరిగింది. ఆకాశాన్ని తాకే అపార్ట్‌మెంట్ టవర్లు అభివృద్ధి చిహ్నాలుగా నిలుస్తున్నాయి. కానీ ఒక కఠినమైన ప్రశ్న మన ముందుంది: ఈ కాంక్రీట్ నాగరికత పర్యావరణానికి ముప్పు కానుందా?

ఐక్యరాజ్యసమితి తాజా గణాంకాల ప్రకారం, ప్రస్తుతం ప్రపంచ జనాభాలో సుమారు 45 శాతం మంది నగరాల్లో నివసిస్తున్నారు. 2050 నాటికి ఈ సంఖ్య మరింత పెరిగి ప్రపంచ జనాభా పెరుగుదలలో రెండు మూడొంతులు నగరాలకే చేరనున్నాయని అంచనా. అంటే రాబోయే దశాబ్దాల్లో మరింత గృహనిర్మాణం, మరింత రోడ్లు, మరింత వాణిజ్య సముదాయాలు, మరింత మౌలిక వసతులు అవసరం అవుతాయి.

అయితే నగరాల పెరుగుదల కేవలం నివాసాల విస్తరణ కాదు; అది ప్రకృతిపై ఒత్తిడి. భవన నిర్మాణ రంగం ప్రస్తుతం ప్రపంచ శక్తి వినియోగంలో 32 శాతం భాగం తీసుకుంటోంది. ప్రపంచ కార్బన్ డైఆక్సైడ్ ఉద్గారాల్లో 34 శాతం ఈ రంగం నుంచే వస్తున్నాయి. సిమెంట్, ఉక్కు వంటి నిర్మాణ పదార్థాల తయారీ ఒక్కటే పెద్ద కాలుష్య మూలం.

ఒక అపార్ట్‌మెంట్ టవర్ నిర్మించడానికి వేల టన్నుల సిమెంట్, ఉక్కు, ఇసుక, నీరు, విద్యుత్ అవసరం. ఒక్కో భవనం వెనుక అనేక గనులు, ఫ్యాక్టరీలు, రవాణా వ్యవస్థలు పనిచేస్తాయి. అంటే మనం చూస్తున్నది కేవలం భవనం కాదు...అదృశ్యంగా ప్రకృతి సంపదల వినియోగ చరిత్ర. అడవులు నరికివేత, నదుల నుంచి ఇసుక తవ్వకం, భూగర్భ జలాల తగ్గుదల, మట్టిసారపు నష్టం ఇవన్నీ దాని వెనుక ఉంటాయి.

అపార్ట్‌మెంట్ సంస్కృతి మరో ప్రమాదాన్ని తీసుకొస్తోంది...హీట్ ఐలాండ్ ప్రభావం. కాంక్రీట్, గాజు, టార్‌రోడ్లు వేడిని గ్రహించి నగరాలను చుట్టుపక్కల ప్రాంతాల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలతో ఉంచుతున్నాయి. చెట్లు తగ్గిపోవడం, ఖాళీ ప్రదేశాలు కనుమరుగవడం వల్ల వేసవులు భరించరాని స్థాయికి చేరుతున్నాయి. ఎయిర్ కండిషనర్లు పెరగడంతో విద్యుత్ వినియోగం పెరుగుతుంది; విద్యుత్ ఉత్పత్తి కోసం మరింత ఇంధనం కాలుతుంది. ఇది తిరిగి గ్లోబల్ వార్మింగ్‌ను వేగవంతం చేస్తుంది. నగరాల్లో వర్షపు నీరు నేలలోకి దిగే అవకాశాలు కూడా తగ్గుతున్నాయి. ఎక్కడ చూసినా కాంక్రీట్ కప్పేస్తే వర్షం పడినప్పుడు నీరు నేలలోకి చొరబడదు. ఫలితం- ఒక వైపు వరదలు, మరో వైపు భూగర్భ జలాల కొరత. ముంబై, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలు దీనికి ప్రత్యక్ష ఉదాహరణలు.

ఇక యుద్ధాల ప్రభావం మరింత ఘోరం. ఒక నగరం మీద బాంబులు పడితే కేవలం భవనాలు కూలవు; సంవత్సరాలుగా ఉపయోగించిన సిమెంట్, ఉక్కు, శక్తి, మానవ శ్రమ...అంతా హృదా అవుతుంది. యుద్ధాల తర్వాత మళ్లీ పునర్నిర్మాణం కోసం మరిన్ని వనరులు వినియోగించాల్సి వస్తుంది. ఇటీవల ప్రపంచంలోని యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో లక్షల ఇళ్లు ధ్వంసమై, కోట్ల టన్నుల శిథిలాలు పేరుకుపోయాయి. పునర్నిర్మాణం కోసం మళ్లీ సిమెంట్, ఉక్కు, ఇంధనం అవసరం అవుతుంది. అంటే యుద్ధం ద్విగుణీకృత నష్టం. మొదట విధ్వంసం, తరువాత పర్యావరణ ఖర్చుతో పునర్నిర్మాణం.

అయితే ఎత్తైన భవనాలన్నీ చెడు అని చెప్పడం సరైంది కాదు. సరైన ప్రణాళికతో నిర్మించిన అధిక సాంద్రత గృహాలు విస్తారమైన పట్టణ విస్తరణ కంటే మంచివే. ఒకే ప్రాంతంలో ఎక్కువ మందికి నివాసం కల్పిస్తే రవాణా దూరాలు తగ్గుతాయి, రోడ్ల విస్తరణ అవసరం తగ్గుతుంది, సేవల పంపిణీ సులభమవుతుంది. కానీ సమస్య ఏమిటంటే... మన నగరాల్లో చాలా నిర్మాణాలు "లాభం ముందు, పర్యావరణం తర్వాత" అన్న ధోరణిలో జరుగుతున్నాయి.

**అందుకే ప్రభుత్వాలు తక్షణం ఐదు చర్యలు చేపట్టాలి:**

మొదటిది, గ్రీన్ బిల్డింగ్ కోడ్లు తప్పనిసరి చేయాలి. వర్షపు నీటి సంరక్షణ, సౌరశక్తి, సహజ గాలి ప్రవాహం, శక్తి పొదుపు డిజైన్లు ఉండాలి. రెండవది, ప్రతి కొత్త ప్రాజెక్టుకు నిజమైన పర్యావరణ ప్రభావ అంచనా ఉండాలి. మూడవది, నగరాల్లో కనీస పచ్చప్రాంతాల నిబంధనలు కఠినంగా అమలు చేయాలి. నాలుగవది, పాత భవనాల పునర్వినియోగం, రీనోవేషన్‌కు ప్రోత్సాహకాలు ఇవ్వాలి; కూల్చి మళ్లీ కట్టడం మాత్రమే అభివృద్ధి కాదు. ఐదవది, ప్రజా రవాణా కేంద్రంగా నగర ప్రణాళిక చేయాలి.

**కార్పొరేట్ వర్గాలు కూడా బాధ్యత వహించాలి:**

(ఈ.ఎస్.జీ) నివేదికలు కాగితాలకే పరిమితం కాకూడదు. ప్రతి నిర్మాణ కంపెనీ తన కార్బన్ ఫుట్‌ప్రింట్ ప్రకటించాలి. సిమెంట్‌కు ప్రత్యామ్నాయ పదార్థాలు, రీసైకిల్ స్టీల్, ప్రీఫ్యాబ్ టెక్నాలజీలు వినియోగించాలి.

ప్రజలకూ బాధ్యత ఉంది. "ఎంత పెద్ద ఇల్లు?" కంటే "ఎంత స్థిరమైన ఇల్లు?" అని అడిగే సమయం వచ్చింది. ప్రకృతి నాశనం చేసి నిర్మించిన లగ్జరీ ఫ్లాట్‌లో జీవించడం చివరికి కాలుష్యంతో, నీటి కొరతతో, వేడితో బాధపడటమే.

చివరిగా... ఆకాశహర్మ్యాలు అభివృద్ధి ప్రతీకలు కావచ్చు. కానీ అవి భూమి ఊపిరిని ఆపేస్తే ఆ అభివృద్ధి శ్మశాన నిశ్శబ్దమే. కాంక్రీట్ అడవులు కాదు, సజీవ నగరాలు నిర్మించడం నిజమైన నాగరికత. భవిష్యత్తు ప్రశ్నిస్తోంది... మనకు ఎత్తైన భవనాలే కావాలా? లేక నివసించదగిన భూమా?



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496.**

# జ్ఞాన విప్లవానికి నాంది పుస్తకం

**(ఏప్రిల్ 23-ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా)**



"ఒక మంచి పుస్తకాన్ని తెరవడం అంటే.. ఒక కొత్త ప్రపంచానికి తలుపులు తీయడమే! అజ్ఞానమనే చీకటిని చీల్చుకుంటూ, జ్ఞానమనే వెలుగును ప్రసాదించే అద్భుత ఆయుధం 'పుస్తకం'. నాగరికత పుట్టిన పుటి నుండి మనిషి తన అనుభవాలను, ఆవిష్కరణలను, కలలను తరతరాలకు అందించడానికి ఎంచుకున్న ఏకైక వారధి అక్షరం.

'పుస్తకాలు లేని ఇల్లు.. కిటికీలు లేని గది వంటిది' అన్న డా. బి.ఆర్. అంబేద్కర్ మాటలు అక్షర సత్యాలు. మనం ఒంటరిగా ఉన్నప్పుడు ఒక పుస్తకం తోడుంటే, అది వంద మంది మేధావులతో సంభాషించడంతో సమానం. ఒక పుస్తకాన్ని తెరవడం అంటే ఒక కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టడమే. మనం కూర్చున్న చోటు నుండి కదలకుండానే హిమాలయ శిఖరాలను అధిరోహించాలన్నా, సముద్ర గర్భంలోని రహస్యాలను శోధించాలన్నా, చారిత్రక వీరులతో సంభాషించాలన్నా అది ఒక్క 'పుస్తకం' వల్లనే సాధ్యం. స్మార్ట్‌ఫోన్ల వేగంలో, డిజిటల్ తెరల వెలుగులో మనం పుస్తక పఠనాన్ని మరిచిపోతున్నామా? అక్షరాల వాసనను, కాగితాల స్పర్శను దూరం చేసుకుంటున్నామా?

ప్రతి ఏటా ఏప్రిల్ 23న జరుపుకునే 'ప్రపంచ పుస్తక దినోత్సవం' కేవలం రచయితలను స్మరించుకునే రోజు మాత్రమే కాదు; అది మనలో నిదురిస్తున్న ఆలోచనలను మేల్కొలిపే రోజు. ఒక పుస్తకం మనల్ని చరిత్రలోకి తీసుకెళ్లగలదు, భవిష్యత్తును ఊహించేలా చేయగలదు, అన్నింటికంటే మిన్నగా మనల్ని మనం తెలుసుకునేలా చేయగలదు. పుస్తకాలు కేవలం కాగితాల కట్టలు కావు; అవి సంస్కృతులకు వారధి. ఒక తరం తాలూకు జ్ఞానాన్ని, అనుభవాలను తర్వాతి తరానికి అందించే శక్తివంతమైన ఆయుధాలు. నేటి డిజిటల్ యుగంలో సెల్‌ఫోన్‌ల మోజులో పడి పుస్తకాలను దూరం చేసుకుంటున్న తరుణంలో, ఈ రోజు మనకు మళ్ళీ అక్షర సాన్నిహిత్యాన్ని గుర్తు చేస్తుంది.

**నేపథ్యం మరియు చరిత్ర**

- ప్రతి ఏటా ఏప్రిల్ 23న యునెస్కో ఆధ్వర్యంలో ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము.
- 1995లో పారిస్‌లో జరిగిన యునెస్కో జనరల్ కాన్ఫరెన్స్‌లో పుస్తకాలను చదవడం, ప్రచురించడం మరియు కాపీరైట్ పట్ల అవగాహన కల్పించడానికి ఈ రోజును కేటాయించారు.

**నిశ్శబ్ద గురువు**

- పుస్తకం మాట్లాడదు, కానీ మనల్ని మాట్లాడిస్తుంది. పుస్తకం నడవదు, కానీ మనల్ని ప్రపంచమంతా చుట్టి వచ్చేలా చేస్తుంది.
- **జ్ఞాన నిధి:** వేల ఏళ్ల చరిత్రను, శాస్త్ర సాంకేతిక విషయాలను కేవలం కొన్ని పేజీల్లో ఇముడ్చుకోగల శక్తి పుస్తకానికే ఉంది.

**సృజనాత్మకత :** పుస్తకాలు మన ఊహాశక్తికి పదును పెడతాయి. టీవీ చూస్తున్నప్పుడు బొమ్మలు మనకు కనిపిస్తాయి, కానీ పుస్తకం చదువుతున్నప్పుడు ఆ బొమ్మలను మనమే మన మనసులో సృష్టించుకుంటాం. ఒక కథ చదువుతున్నప్పుడు మన మనస్సులో ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించుకుంటాం. ఇది మనిషి సృజనాత్మకతను పెంచుతుంది.

**ఒంటరితనానికి మందు:** మనిషి ఒంటరిగా ఉన్నప్పుడు ఒక మంచి పుస్తకం తోడుంటే, అది వంద మంది మిత్రులతో సమానం.

**డిజిటల్ యుగంలో పుస్తకం:**

నేడు స్మార్ట్‌ఫోన్‌లు, కిండిల్ మరియు ఆడియో బుక్స్ అందుబాటులోకి వచ్చాయి. అయితే, భౌతికమైన పుస్తకాన్ని చేతితో పట్టుకుని, ఆ కాగితం వాసన చూస్తూ చదవడంలో ఉండే అనుభూతి వర్ణనాతీతం.

డిజిటల్ తెరలపై చదవడం వల్ల కళ్లకు అలసట రావచ్చు, కానీ పుస్తకం చదవడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుంది.

**ఏకాగ్రత:** ఇంటర్నెట్‌లో చదివేటప్పుడు నోటిఫికేషన్లు మనల్ని పక్కదారి పట్టిస్తాయి. కానీ పుస్తకం చదివేటప్పుడు మనం ఆ అక్షరాల ప్రపంచంలో లీనమైపోతాం. గుర్తుంచుకోండి... మనం ఎక్కడికి వెళ్లినా, ఎంత ఎత్తుకు ఎదిగినా మన వెంట వచ్చే నిజమైన ఆస్తి మన 'జ్ఞానం'. ఆ జ్ఞానానికి మూలం మనం చదివే పుస్తకాలే. డిజిటల్ యుగంలో సమాచారం వేగంగా దొరకవచ్చు, కానీ సంస్కారాన్ని, విజ్ఞానాన్ని ఇచ్చేది మాత్రం పుస్తకమే. పుస్తకం మనిషిని కేవలం విద్యావంతుడిగా మాత్రమే కాదు, ఒక పరిపూర్ణ మానవుడిగా తీర్చిదిద్దుతుంది.

మనం మన పిల్లలకు ఖరీదైన గ్యాడ్జెట్లు, వస్తువులు బహుమతిగా ఇవ్వవచ్చు. కానీ, వారికి ఒక మంచి 'పుస్తకాన్ని' బహుమతిగా ఇవ్వడం అంటే.. వారి జీవితాంతం తోడుండే ఒక గొప్ప మిత్రుడిని పరిచయం చేయడమే. పుస్తకాన్ని తెరిస్తే.. నీ మేధస్సు పెరుగుతుంది. పుస్తకాన్ని ప్రేమిస్తే.. నీ భవిష్యత్తు వెలుగుతుంది. జ్ఞాన భాండాగారం ఈ పుస్తకం. మానవ వికాసానికి అదియే మూలస్తంభం. పుస్తక పఠనం ఆగిపోయిన చోట ఆలోచన ఆగిపోతుంది, ఆలోచన ఆగిపోయిన చోట ఎదుగుదల ఆగిపోతుంది. కాబట్టి, నేడే ఒక సంకల్పం చేద్దాం.

ఈ ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా, రోజుకు కనీసం అర గంటైనా పుస్తక పఠనానికి కేటాయిద్దాం. మన ఇంట్లో ఒక చిన్న గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకుందాం. అక్షరం ఎన్నటికీ అమరం

మనుషులు వెళ్ళిపోతారు, కానీ వారు రాసిన అక్షరాలు శాశ్వతంగా నిలిచి ఉంటాయి. వివేకానందుడు, అంబేద్కర్, వంటి గొప్ప వ్యక్తుల ఆలోచనలు నేటికీ మనకు అందుబాటులో ఉన్నాయంటే అది పుస్తకాల పుణ్యమే.

ఈ ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా మనమందరం ఒక ప్రతిజ్ఞ చేద్దాం."ప్రతిరోజూ కొంత సమయం చదువుదాం.. జ్ఞానాన్ని పంచుదాం." పుస్తకం మనల్ని ఎన్నడూ మోసం చేయదు. అది మనల్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతుంది. అక్షరాల సాక్షిగా అజ్ఞానాన్ని తరిమికొడదాం.

'నేటి పాఠకులే.. రేపటి నాయకులు'. అక్షరం మన శ్వాస కావాలి, పుస్తకం మన నేస్తం కావాలి. అప్పుడే మన సమాజం జ్ఞానవంతమైన బాటలో పయనిస్తుంది.



**వ్యాసకర్త : పోగు అశోక్,**
**సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్**
**9391117100.**

| | | | |
|---|---|---|---|
| **రిక్కలు** | భగభగల కాలం | సత్యవచనం | నిజాల శ్రమ |
| పలురోగాలు | మనిషి వికార | కాయమంతా స్వార్థం | చలనాలు |
| మందులు మనీ నిల్లు | దుమారం | కూలడం నిజం | జీవిత నిస్వార్థ |
| హాటు పే బిల్లు | ప్రకృతి విధ్వంసం | కోరికల గుర్రాలు | వచనాలు |
| పేదరికం గ్రిల్లు | విశ్వ పతనం | కాకుంటె గొర్రెలు | దుఃఖాలు దూరాలు |
| సూఫర్ | మీసాల నేత | ఆశలన్నీ పున్నాలు | **రేడియమ్** |
| ఎల్ నినో | కవిచౌడప్ప పద్యం | కాకుంటే సున్నాలు | **9291527757** |

# అక్షర యజ్ఞం - పుస్తక హృదయం!!



"చిరిగిన చొక్కా అయినా తొడుక్కో.. కానీ, ఒక మంచి పుస్తకం కొనుక్కో" అన్నారు కందుకూరి వీరేశలింగం పంతులు. ఈ ఒక్క మాట పుస్తకం యొక్క ప్రాముఖ్యతను ఎంతలా చాటుతుందో వేరే చెప్పక్కర్లేదు. పుస్తకం కేవలం కాగితాల కట్ట కాదు, అదొక జ్ఞాన నిధి, ఒక మంచి నేస్తం, ఒక ఉత్తమ మార్గదర్శి. ఏప్రిల్ 23న ప్రపంచవ్యాప్తంగా 'ప్రపంచ పుస్తక దినోత్సవం' జరుపుకుంటాం. యునెస్కో 1995 నుండి ఈ రోజును పుస్తక పఠనం, ప్రచురణ మరియు కాపీరైట్లను ప్రోత్సహించడానికి, రచయితలను గౌరవించడానికి నిర్ణయించింది. పుస్తకం - జ్ఞాన ఖని పుస్తకం మనలో అజ్ఞానాన్ని తొలగించి జ్ఞాన దీపాలను వెలిగిస్తుంది. ప్రపంచంలో ఎక్కడో జరిగిన సంఘటనలు, ఎప్పుడో జీవించిన మహానుభావుల ఆలోచనలు, వేలాది సంవత్సరాల చరిత్ర... అన్నీ పుస్తకాల ద్వారా మన ముందుకు వస్తాయి. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పుస్తక ప్రేమికులై, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ లైబ్రరీలో రోజుకు 21 గంటలు పుస్తకాలు చదివిన దీక్ష, వారిని ప్రపంచ మేధావిని చేసింది. పుస్తకాలు మానవ అనుభవ వైవిధ్యానికి స్వరం ఇస్తాయి. మంచి నేస్తం, మార్గదర్శి

ఒక పుస్తకాన్ని చదవడం అంటే ఒక కొత్త స్నేహితుణ్ణి సంపాదించుకోవడమే. ఒంటరితనంలో పుస్తకం ఒక ఉత్తమ తోడుగా ఉంటుంది. ఆందోళన, ఒత్తిడితో సతమతమయ్యే మనసుకు పుస్తక పఠనం ఎంతో ప్రశాంతతను ఇస్తుంది. నిద్రలేమితో బాధపడేవారికి పుస్తక పఠనం ఒక చక్కటి ఔషధంలా పనిచేస్తుంది. వ్యక్తిత్వ వికాసం - పఠన ప్రభావం పుస్తకాలు చదవడం వల్ల పదజాలం పెరుగుతుంది, భాషా నైపుణ్యాలు మెరుగుపడతాయి. కొత్త విషయాలను నేర్చుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. త్రివిక్రమ్ శ్రీనివాస్ అన్నట్లు, "పుస్తకం చదవడం ఓ కళ.. రాయి లాంటి మనిషిని శిల్పంలా మారుస్తుంది". రాయిని శిల్పంగా మార్చే ఉలిలా, మనిషిని ఉన్నత వ్యక్తిగా మలిచే సామర్థ్యం పుస్తకానికి ఉంది. డిజిటల్ యుగంలో పుస్తకం నేటి తరం స్మార్ట్‌ఫోన్, సోషల్ మీడియాకు బానిసలై నిజపుస్తకాన్ని మరిచిపోతున్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు సమాచారాన్ని ఇస్తాయేమో కానీ, పుస్తకం చదివినప్పుడు కలిగే అనుభూతిని, ఏకాగ్రతను అవి ఇవ్వలేవు. "పుస్తకం లేని ఇల్లు ఆత్మలేని శరీరం వంటిది".

మానవ నాగరికత పరిణామ క్రమంలో మనిషి సాధించిన అత్యంత గొప్ప ఆవిష్కారం 'పుస్తకం'. కాలం వెనక్కి వెళ్లలేము కానీ, ఒక పుస్తకాన్ని తెరిస్తే గతంలోకి వెళ్ళవచ్చు. అక్షరాలు కేవలం సిరా చుక్కలు కావు, అవి ఒక మేధావి మెదడులోని ఆలోచనలకు సజీవ రూపాలు. ప్రపంచ పుస్తక దినోత్సవం (ఏప్రిల్ 23) సందర్భంగా, పుస్తకం యొక్క ప్రాముఖ్యతను మననం చేసుకోవడం మన బాధ్యత. అక్షరమనే ఒక అద్భుత ప్రయాణం పుస్తకం ఒక మాయా పేటిక. దాన్ని తెరిచిన ప్రతిసారీ ఒక కొత్త ప్రపంచం పలకరిస్తుంది. ఇంట్లో కూర్చునే మనం హిమాలయాల ఎత్తును కొలవాలన్నా, సముద్ర గర్భంలోని రహస్యాలను తెలుసుకోవాలన్నా పుస్తకం ఒక్కటే మార్గం. ఒక్కో పేజీ తిప్పుతుంటే, మనం మన ప్రపంచాన్ని వదిలి రచయిత సృష్టించిన అద్భుత లోకంలోకి ప్రవేశిస్తాము.

జ్ఞానానికి నిఘంటువు.. ఆలోచనలకు పదును

జ్ఞాన సముపార్జన: అనుభవం నేర్పే పాఠాల కంటే, వేల ఏళ్ల అనుభవాలను పుస్తకాలు మనకు కొన్ని గంటల్లోనే అందిస్తాయి.

మానసిక వికాసం: నిత్యం పుస్తకాలు చదివే వారిలో సృజనాత్మకత, విశ్లేషణాత్మక శక్తి పెరుగుతుంది.

ఏకాంతానికి తోడు: మనిషి ఒంటరివాడు కావచ్చు, కానీ పుస్తకం చేతిలో ఉంటే అతను ఎప్పటికీ ఒంటరి కాడు. అది ఒక నిశ్శబ్ద స్నేహితుడిలా మనల్ని ఓదారుస్తుంది, ఉత్తేజపరుస్తుంది. మార్పుకు మూలం.. చైతన్యానికి కేతనం ప్రపంచాన్ని మార్చిన గొప్ప విప్లవాలన్నీ ఒక పుస్తకం వెనుక ఉన్న ఆలోచన నుండే పుట్టాయి. భగవద్గీత, బైబిల్, ఖురాన్ వంటి గ్రంథాలు జీవన మార్గాన్ని చూపిస్తే.. అంబేద్కర్, గాంధీజీ, వివేకానందుల రచనలు సమాజంలో చైతన్యాన్ని నింపాయి. ఒక మంచి పుస్తకం వందమంది స్నేహితులతో సమానం అంటారు, అది అక్షర సత్యం. డిజిటల్ యుగంలో పుస్తకం నేటి కాలంలో స్మార్ట్‌ఫోన్లు, ఈ-బుక్స్ అందుబాటులోకి వచ్చినా, ఒక కొత్త పుస్తకాన్ని చేతిలోకి తీసుకున్నప్పుడు వచ్చే ఆ కాగితపు వాసన, పేజీలు తిప్పేటప్పుడు వచ్చే చప్పుడు ఇచ్చే అనుభూతి వర్ణనాతీతం. పుస్తకం మన కళ్ళకు శ్రమను తగ్గించి, మన హృదయానికి హాయినిస్తుంది.

ఈ ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా, మనం రోజుకు కొంత సమయమైనా పుస్తక పఠనానికి కేటాయించుకుందాం. పిల్లలకు పుస్తకాలను బహుమతులుగా ఇద్దాం. ఇంటింటా చిన్న లైబ్రరీని ఏర్పాటు చేసుకుందాం. పుస్తక పఠనాన్ని ఒక ఉద్యమంగా మార్చి, విజ్ఞాన కుసుమాలను విరబూయిద్దాం!

పుస్తకాలు అల్మారాలో దాచుకునే వస్తువులు కావు, గుండెల్లో పదిలపరుచుకోవాల్సిన ఆభరణాలు. చదవడం అంటే కేవలం అక్షరాలను గుర్తించడం కాదు, ఒక కొత్త జీవితాన్ని దర్శించడం. ఈ ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా మనం ఒక ప్రతిజ్ఞ చేద్దాం.. మన ఇంట్లో ఒక చిన్న గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకుందాం. పిల్లలకు బొమ్మలతో పాటు పుస్తకాలను బహుమతిగా ఇద్దాం. ఎందుకంటే, ఒక పుస్తకం తెరిచిన ప్రతిసారీ ఒక కొత్త జీవితం ప్రారంభమవుతుంది.

చదువుదాం.. ఎదుగుదాం.. అక్షర వెలుగులో ప్రపంచాన్ని చూద్దాం!

(నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం)

**- జటావత్ రాజు**
**(యువ కవి, రచయిత)**
**తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్**
**9347196264.**

## పుస్తకం ఓ నిశ్శబ్ద విజ్ఞాన విస్ఫోటనం

పుస్తకం ఓమంచి నేస్తం
అమ్మలా లాలిస్తుంది
నాన్నలా ఆదరిస్తుంది
గురువులా బోధిస్తుంది
పుస్తకం ఒంటరితనాన్ని తుంచి
అక్కున చేర్చుకుంటుంది
బాధపడే వారిని ఓదార్చుతుంది
అలసిన మనసుకు సేద తీర్చుతు
పుస్తకాలు జ్ఞాన నిలయాలు
అజ్ఞానాన్నిపారదోలే
విజ్ఞాన విపంచులు వివేకం విచక్షణ
విశ్లేషణా సామర్థ్యాల వికాస కేంద్రాలు
అన్ని వయసుల వారికి
పుస్తకం ఆత్మీయనేస్తం
మేధోమధనానికి వేదిక
సృజనకు సాన పెట్టేది
శాస్త్రీయ ఆలోచనకు
బీజం వేసేది చర్చలకు వేదికై
విజ్ఞాన విపంచియై
వర్ధిల్లేవి పుస్తకాలే
పుస్తకాలు సకల
సమగ్ర సమాచార
నిధి చరిత్ర సంస్కృతి
నాగరికత వారసత్వానికి వారధి
విజ్ఞాన వికాస సారథి
పుస్తక పఠనం
అజ్ఞానాన్ని పారద్రోలి
విజ్ఞాన వికాసానికి
దోహదం చేస్తుంది
పుస్తకాలు విశ్వంలోని
సమాచారాన్ని
ముంగిట్లోకి చేర్చి
విశ్వ విజేతలుగా
ఎదగడానికి బాట
చూపుతాయి
పుస్తకం ఓనిశ్శబ్ద
విజ్ఞాన విస్ఫోటనం
పుస్తకం హస్తభూషణమే కాదు
మస్తిస్కవికాస సాధనం
సృజన విశ్లేషణ సామర్థ్యాల
నైపుణ్యాల మెరుగుదలకు
సహాయపడుతుంది
చదవడం వల్ల మనోవిస్తృతి
పెరుగుతుంది
ఆత్మవిశ్వాసం పెరుగుతుంది
పుస్తకాలు మానవునికి దశ దిశ
నిర్దేశకత్వశీలో
మార్గదర్శిగా నిలుస్తాయి
2026 వరల్డ్ బుక్ కాపీరైట్
దినోత్సవం థీమ్ ఐరాస
సుస్థిరాభివృద్ధి లక్ష్యాల
సాధనలో సాహిత్యం పాత్ర
అనే అంశంపై ప్రచారం నిర్వహణ
కార్యాచరణనుఅమలుచేయడం
జీవన సాఫల్యతకు దిక్సూచి పఠనం
భారతీయ సంస్కృతి
చాటేది పుస్తకం పఠనంతో
పదజాలం పఠనం ప్రపంచ
దేశాల సంభందాల వారధి
పఠనంతో ప్రగతి పురోగతి

**నేదునూరి కనకయ్య**
**అధ్యక్షులు**
**తెలంగాణ ఎడుకేషన్ ఫోరం**
**తెలంగాణ వికాస వేదిక**
**తెలంగాణ ఎకనామిక్ ఫోరం**
**9440245771**

## అంకుర ఆసుపత్రిలో 8 ఏళ్ల బాలుడికి అరుదైన శస్త్రచికిత్స



**ఖైరతాబాద్, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** అంకుర ఆసుపత్రిలో 8 ఏళ్ల బాలుడికి అరుదైన శస్త్రచికిత్స నిర్వహించినట్లు అంకుర హాస్పిటల్ ఫర్ ఉమెన్, చిల్డ్రన్‌కు చెందిన కన్సల్టెంట్ పీడియాట్రిక్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, హెపటాలజిస్ట్ డాక్టర్ పరిజాత రామ్ త్రిపాఠి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నా రు. హాస్పిటల్ కన్సల్టెంట్ పీడియాట్రిక్ ఇమ్యూనా లజిస్ట్ ‌ రుమటాలజిస్ట్ డాక్టర్ అంజనీ తోకలసి ఆమె మాట్లాడుతూ ఏళ్ల తరబడి సమస్యలతో బాధపడిన 8 ఏళ్ల బాలుడు సాధారణ జీవితానికి తిరిగి వచ్చాడని తెలిపారు. అంకుర మహిళా, బాలల ఆసుపత్రి, ఒక అరుదైన, సంక్లిష్టమైన బాలల కేసును విజయవంతంగా చికిత్స చేసిందన్నారు. దీనితో, చిన్నతనం నుండి పునరావృతమయ్యే, ప్రాణాంతకమైన ప్రేగు సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 8 ఏళ్ల బాలుడు తిరిగి ఆరోగ్యకర మైన, చురుకైన జీవితాన్ని గడిపేందుకు వీలు కలి గిందన్నారు. ఆ బాలుడికి కేవలం ఒక సంవత్సరం వయస్సులో ఉన్నప్పుడు, అకస్మాత్తుగా ప్రేగులకు రంధ్రం పడటంతో అతని వైద్య ప్రయాణం ప్రారం భమైందని, దీనికి అత్యవసర శస్త్రచికిత్స అవసరమైందని తెలిపారు.

## గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**మొయినాబాద్, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తామని గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధికి సహకరిస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని మోత్కుపల్లి, బాకారం జాగీర్, ఖాసీంబౌలి, నక్కలపల్లి, కనకమామిడి, గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వ నిధులతో సిసి రోడ్లు, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు కోసం వివిధ గ్రామాల సర్పంచులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యంగా ముందుకు వెళు న్నామని, ప్రతి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# సమ్మె బాట పట్టిన ఆర్టీసీ కార్మికులు

- డిపోలకే పరిమితమైన బస్సులు
- నామమాత్రంగా 73 బస్సులను తిప్పిన ఆర్టిసి
- తాండూర్ ఒక బస్సు వికారాబాద్‌లో ఏడు బస్సులు మాత్రమే తిప్పిన ఆర్టీసీ
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 637 బస్సులకు గాను 73 బస్సుల్లో మాత్రమే ప్రయాణం
- రోజు రెండు లక్షల ప్రయాణికులను చేరవేసే ఆర్టీసీ
- బస్సులు లేక రైళ్లలో కిక్కిరిసిన ప్రయాణికులు
- బోసిపోయిన ఆర్టీసీ బస్టాండ్‌లు
- ప్రభుత్వంతో చర్చలు విఫలం రెండో రోజు సమ్మె సాగే అవకాశం
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ఆర్టీసీ అధికారుల దృష్టి



**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** దీర్ఘకాలికంగా అసంపూర్తిగా ఉన్న సమస్యలను సాధించుకోవడానికి ఆర్టీసీ కార్మికులు అర్ధరాత్రి నుంచి సమ్మె సైరన్ మోగించారు. బుధవారం తెల్లవారుజాము నుంచి ఆర్టీసీ డిపోల ముందు జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్నారు. పోలీస్ బందోబస్తుతో ఆర్టీసీ బస్సులను తిప్పడానికి అధికారుల ప్రయత్నిస్తే ఆర్టీసీ కార్మికులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు ఆర్టీసీ కార్మికుల మధ్య వాగ్వివాదంతో పాటు తోపులాట జరిగింది. దీంతో కొన్ని డిపోల దగ్గర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆర్టీసీ కార్మికుల సమ్మె కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వికారాబాద్ అడిషనల్ ఎస్పీ రాములు నాయక్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు. ఆర్టీసీ సమ్మె కారణంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 637 బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. రోజు ఈ బస్సులు రెండు లక్షల మంది ప్రయాణికులను గమ్యానికి క్షేమంగా చేరవేస్తాయి. కానీ ఆర్టీసీ కార్మికుల సమ్మె కారణంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని అన్ని బస్సు డిపోలను కలిపి కేవలం 73 బస్సులను మాత్రమే పోలీస్ బందోబస్తు మధ్య ఆర్టిసి ప్రైవేట్ బస్సులను నడపగలిగింది. వికారాబాద్ తాండూర్ పరిగి డిపోల్లో కేవలం పది బస్సులు మాత్రమే తిరిగాయి. వికారాబాద్ లో ఆరు తాండూరులో ఒక్క బస్సు మాత్రమే డిపో నుంచి బయటికి వచ్చి ప్రయాణికులను చేరవేసింది. పరిగి తాండూర్ వికారాబాద్ బస్ డిపోలో చెందిన బస్సులు దాదాపు 280 వరకు రోజు ప్రయాణికులను చేరవేయవలసి ఉంటుంది. ఆర్టీసీ జేఏసీతో పాటు వివిధ సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. మరో నాలుగు వారాలపాటు గడువు కావాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కోరడాన్ని ఆర్టీసీ సంఘాలు తప్పుపట్టాయి. 42 రోజుల క్రితం ఆర్టీసీ కార్మికులు సమ్మెకు నోటీస్ ఇచ్చారని అప్పటినుంచి ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించకుండా కాలయాపన చేసిందని ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. ఆర్టీసీ కార్మికులంతా సమ్మెబాట పట్టగానే మరో నాలుగు వారాలు పాటు గడువు రావాలని రాష్ట్ర ప్రభుత్వం కోరడం విడ్డూరంగా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల న్యాయమైన కోరికలు ఆమోదించే వరకు సమ్మెబాట పడతామని తెలియజేశారు. ఇప్పటివరకు ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలమయ్యాయని నాలుగు ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం పక్కన పెట్టిందని వారు ఆరోపించారు. కాబట్టి హక్కుల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు ఉద్యమించక తప్పడం లేదని ప్రయాణికులను ఇబ్బంది పెట్టడం తమ అభిప్రాయం కాదని తెలియజేశారు. దీంతో రెండవ రోజు ఆర్టిసి సమ్మె కొనసాగే అవకాశం ఉన్నందున ఆర్టీసీ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించారు. డిగ్రీలు పీజీలు చేసి ఉద్యోగాలు రాక కడుపు నింపుకోవడానికి తప్పనిసరి పరిస్థితుల్లో విధిలేక ఆర్టీసీ ఉద్యోగంలో చేరామని ప్రభుత్వం తమ కడుపు నింపడానికి చర్యలు తీసుకోకపోతే ఎలా అని ప్రశ్నించారు. కార్మికుల కడుపునింపవలసిన ప్రభుత్వం వారి కడుపు కాలుస్తుందని మహిళ ఉద్యోగులు కన్నీరు పెట్టుకున్నారు. ఉన్నత చదువులు చదివిన ప్రయాణికులు తమపై చిన్న చూపు చూసిన రాత్రింబవళ్లు కష్టపడి పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఆర్టిసి యూనియన్ల మద్దతు లేకుండా స్వచ్ఛందంగా వివిధ డిపోల్లో పనిచేస్తున్న ఆర్టీసీ కార్మికులంతా సమ్మెబాట పట్టినట్లు తెలియజేశారు. కడుపు కాలి రోడ్డు పైకి వచ్చానే తప్ప ప్రయాణికులను ఇబ్బంది పెట్టడానికి కాదని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీని కడుపులో పెట్టుకొని చూసుకుంటానని హామీ ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు ఆర్టీసీని కాళ్ళ కింద తొక్కి పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం సొంతం బస్సులు నడపడం వంటి ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించాలని వారు డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా బిజెపి నాయకులు మద్దతు పలికి సంఘీభావం తెలియజేశారు. ఆర్టీసీ సమ్మె కారణంగా రైళ్లన్నీ కిక్కిరిసిపోయాయి. ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు రైళ్లల్లో అధికంగా ప్రయాణించారు. రైలు అందుబాటులో లేని ప్రాంతాల్లో ప్రజలు ప్రైవేట్ వాహనాల్లో గమ్యానికి చేరే ప్రయత్నం చేశారు. సమ్మె కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆర్టీసీ బస్టాండ్ లని బోసిపోయాయి. ఉద్యోగస్తులు ప్రజలు రైతులు చిన్నచిన్న వ్యాపారస్తులు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# విద్యార్థుల ప్రతిభకు వేదికగా చదువుల పండుగ

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** విద్యార్థుల ప్రతిభకు చదువుల పండగ కార్యక్రమం ఒక వేదికగా నిలిచిందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నా రు.నారాయణపేట జిల్లాలో ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ అమలులో మంచి పురోగతి సాధిస్తున్నాయని,ఈ నవక ల్పనలు రాష్ట్ర విద్యాశాఖకు దిక్సూచిగా మారాలని ఆయన ఆకాంక్షించారు. నారాయణపేట జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వ ర్యంలో బుధవారం. జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన “చదువుల పండుగ 2.0” కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథిగా హాజరై సరస్వతీ మాత చిత్రపటానికి పూజలు నిర్వహించి, జ్యోతి ప్రజ్వలన తో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ రెండు మూడేళ్ల కృషికి ఫలితం ఈ చదువుల పండగ 2.0. కార్యక్రమం అన్నారు. తాను రంగారెడ్డి జిల్లాలో ఉన్నప్పుడు నారా యణ పేట జిల్లాలో కొనసాగే విద్యా అభివృద్ధికి చేసున్న వినూత్న కార్యక్రమాల గురించి విన్నానని, తర్వాత కలెక్టర్లు కోయ శ్రీహర్ష, సిక్తా పట్నాయక్ లు జిల్లాలో విద్యాభివృద్ధికి చేసిన కృషిని ఆయన గుర్తు చేశారు. విద్యార్థులు తలచుకుంటే ఏదైనా సాధించగలరని ఆయన తెలిపారు. భవిష్యత్తు విద్యార్థులది అన్నారు. కొత్త కొత్త ఆలోచనలతో జిల్లా, రాష్ట్రం, దేశానికి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు.



### రాష్ట్రంలోనే మొదటిసారి వినూత్న పోటీలు

విద్యార్థులు ఎఫ్ఎల్ఎన్ సామర్థ్యాలకు అదనంగా ఎల్బీ రీడింగ్, కాంప్రహెన్షన్, రైటింగ్, మెమరీ టెక్నిక్స్, వేదిక్ మ్యాథమెటిక్స్ వంటి అంశాలపై పోటీలను నిర్వహించడం రాష్ట్రంలోనే ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థలు తమ విద్యా కార్యక్రమాలను ప్రదర్శిస్తూ ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశాయి. బోష్ సంస్థ సి ఎస్ ఆర్ సహకారంతో అమలు చేస్తున్న కార్యక్రమాలు ప్రదర్శించబడ్డాయి. స్వతః ఫౌండేషన్ వారు ఆర్థిక అవగాహన కార్యక్రమాలను, ఇంక్వి-ల్యాబ్ సంస్థ ద్వారా విద్యార్థుల ఆవిష్కరణలను ప్రదర్శించింది. డిజిటల్ ఈక్విటీ సంస్థ డిజిటల్ లిటరసీ కార్యక్రమాలను, ఫ్యూచర్‌డాట్స్ సంస్థ కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలను పరిచయం చేసింది. ఆలోకిట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన యంగ్ ఒరేటర్స్ క్లబ్ ప్రదర్శనలో విద్యార్థులు తమ ఆంగ్ల నైపుణ్యాలను అద్భుతంగా చూపించారు. జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ విద్యాసాగర్, సెక్టోరియల్ అధికారులు నాగార్జున, శ్రీనివాస్, సైన్స్ అధికారి భాను ప్రకాష్, తదితరులు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సెక్టోరల్ అధికారులు, మరియు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాల నియంత్రణపై కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** జిల్లాలో నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా అన్నారు. కలెక్టర్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన విత్తనాల విక్రయదారులు, మండల వ్యవసాయ, పోలీస్ శాఖ అధికారుల అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నకిలీ, నాణ్యతలేని, గడువు ముగిసిన, చట్టవిరుద్ధంగా తయారు చేసి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. విత్తన వ్యాపారులు తమ స్టాక్‌లకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. గడువు ముగిసిన విత్తనాలను దుకాణాలు మరియు గోదాముల నుంచి తక్షణమే తొలగించాలని ఆదేశించారు. సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలలో నకిలీ విత్తనాల విక్రయదారులపై అనేక కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గత సంవత్సరం భూత్‌పూర్‌లో 1,343 గడువు ముగిసిన విత్తన సంచులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. జడ్చర్లలో కూడా నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.వెంకటేష్, జిల్లా రవాణా శాఖ అధికారి రఘు, సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు, విత్తన డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల శ్రేయస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి



**మెదక్, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** రైతులకు మేలు చేకూర్చే దిశగా మెదక్ మండలం పేరూరు గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కమలమ్మ ప్రారంభించి, రైతులు తమ పంటలను నేరుగా కేంద్రానికి తీసుకువచ్చి సరైన ధర పొందాలని సూచించారు. ఉప సర్పంచ్ అనిల్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా సెంటర్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎస్ సి ఎస్ సీనియర్ పెంటయ్య వార్డు సభ్యులు యాదగిరి, రాములు, ఆశయ్య, గ్రామ పెద్దలు శ్రీనివాస్ రెడ్డి, బీరయ్య, దుర్గయ్య, యాదగిరి, విఠల్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కొనుగోలు కేంద్రం ప్రారంభాన్ని స్వాగతించారు.

## లచ్చంపేట్ టూ లాల్ పహాడ్

- అధికార గర్వంతో సర్పంచ్ భర్త పెత్తనం
- ప్రభుత్వ ట్రాక్టర్ ప్రయివేటు పనులకు వాడకం
- లచ్చంపేట్ సర్పంచ్ భర్త తీరుపై వెలువెత్తుతున్న విమర్శలు



**జిల్లేడ్ చౌదరి గూడ, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** అధికారం సర్పంచ్‌ది అయితే.. పెత్తనం మాత్రం ఆమె భర్తది అన్నట్లుగా తయారైంది ఆ గ్రామం పరిస్థితి. ప్రజా సేవ కోసం ఉపయోగించాల్సిన గ్రామ పంచాయతీ వనరులను, తన సొంత లాభం కోసం వాడుకుంటూ బరితెగిస్తున్నాడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరి గూడ మండలం లచ్చంపేట్ గ్రామంలో సర్పంచ్ వడ్డేగారి సునీత భర్త రాములు తీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రైవేటు పనులకు గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌ను గ్రామంలో పారిశుధ్య పనులకు, మొక్కలకు నీళ్లు పోయడానికి ఉపయోగించాల్సి ఉండగా, సర్పంచ్ భర్త రాములు మాత్రం దీన్ని ప్రైవేటు పనులకు వాడుకుకోవటంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లాల్ పహాడ్‌లో ప్రైవేటు వ్యక్తులు నిర్మించుకుంటున్న భవణం స్లాబ్ పనులకు నీటిని సరఫరా చేసేందుకు ఈ ప్రభుత్వ ట్రాక్టర్‌ను ఉపయోగించారు ప్రభుత్వ డీజిల్, ప్రభుత్వ వాహనం వాడుకుంటూ వ్యక్తిగత పనులకు నీటిని సరఫరా చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ భర్త పెత్తనం మితిమీరిపోతోందని, అడిగేవారు లేరన్న ధీమాతో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాభివృద్ధిని గాలికొదిలేసి, ప్రభుత్వ ఆస్తులను స్వలాభానికి వాడుకోవడంపై ఉన్నతాధికారులు స్పందించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ మరియు పంచాయతీ రాజ్ అధికారులు జోక్యం చేసుకుని, సర్పంచ్ భర్త ఆగడాలను అరికట్టి, దుర్వినియోగమైన నిధులపై విచారణ జరపాలని లాచ్చంపేట్ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీ మల్లు రవి

**వనపర్తి బ్యూరో, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** వనపర్తి, నాగర్ కర్నూలు జిల్లాల్లో లీడ్ బ్యాంకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలు ప్రశంసనీయం అని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి ప్రశంసించారు. బుధవారం గోపాల్పేట మండల పరిధిలోని గ్రామంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన బ్రాంచ్ ను ఎంపీ మల్లు రవి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వీరితోపాటు అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిజిఎం రవీంద్రబాబు, మాజీ ఆర్ఎం సత్యనారాయణ, నూతన ఆర్ఎం వెంకటేశ్వర్లు ఉన్నారు. ప్రారంభోత్సవం అనంతరం ఎంపీ మల్లురవి మాట్లాడుతూ బుద్ధారం గ్రామంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 694వ బ్రాంచ్ ను ప్రారంభించడం అభినందనీయమని తెలిపారు. బ్యాంకులు రైతులకు, ఎంఎస్ఎమ్ఈలకు ప్రాధాన్యతగా రుణాలు ఇవ్వాలని తద్వారా ఎంతమందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. బ్యాంకులో నుంచి రుణాలు పొందిన వారు కూడా సకాలంలో వాటిని తిరిగి చెల్లించి బ్యాంకుల అభివృద్ధికి కూడా సహకరించాలని సూచించారు. ఇక వనపర్తి, నాగర్ కర్నూల్ గద్వాల్ జిల్లాలలో లీడ్ బ్యాంక్ అయిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చేస్తున్న సేవలు ఎంతో ప్రశంసనీయమని కొనియాడారు. సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద చర్యలు తీసుకుంటుందన్నారు. అదేవిధంగా యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించే విధంగా గ్రామీణ స్వయం ఉపాధి కేంద్రాలను కూడా అన్నారు. ఇన్ని సేవలు చేయడం అభినందనీయమని కొనియాడారు. నాగర్ కర్నూల్ రైల్వే లైన్ కోసం తాను పార్లమెంటులో ఎంతగానో కృషి చేస్తున్నానని ఈ సందర్భంగా ఎంపీ తెలియజేశారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ బుద్ధారం గ్రామంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ప్రారంభించడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రజలు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి నూతనంగా ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



### గోపాల్పేటలో సైన్స్ ల్యాబ్ ప్రారంభం

గోపాల్పేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో పీఎం శ్రీ పథకం కింద రూ. 13.50 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన సైన్స్ ల్యాబ్ ను ఎంపీ మల్లు రవి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అదేవిధంగా గోపాల్పేట మండల కేంద్రంలో రూ. 4 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. అంతకుముందు బుద్ధారం గ్రామ శివారులో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఎంపీ మల్లురవి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, లీడ్ బ్యాంకు మేనేజర్ శివకుమార్, స్థానికులు అచ్యుత రామారావు, బుద్ధారం సర్పంచ్ శేఖర్, ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు చర్చకు పిలిచి డిమాండ్లు పరిష్కరించాలి

- రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య



**ముషీరాబాద్, ఏప్రిల్ 20 (జనం సాక్షి) :** ఆర్టీసీ కార్మికుల సమ్మె వల్ల ప్రజా జీవితం స్తంభించిపోతుందని, బీదవర్గాలకు ఇబ్బంది ఎదురవుతుందని, ప్రభుత్వం ప్రతిష్టకు పోకుండా కార్మికులతో చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య సూచించారు. ఈ మేరకు బుధవారం ఆర్టీసీ జేఏసీ నాయకులు బీసీ భవన్ లో ఆర్ కృష్ణయ్య ను కలిసి సమ్మెకు మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య కార్మికుల నిర్వహిస్తున్న సమ్మెకు పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ సమ్మె చేస్తున్న కార్మికుల డిమాండ్ లు న్యాయమైనవని, వారు కొత్త డిమాండ్ లు ఏమి కోరడం లేదని అన్నారు. ఎన్నికల వాగ్దానం ప్రకారం ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరుతున్నారని, సమస్యలపై దశలవారీగా ఉద్యమాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వ యాజమాన్యాల నుండి నేటి వరకు ఎలాంటి స్పందన రాలేదని ఈ కారణంగానే కార్మికులు సమ్మెకు వెళ్లారని అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కార్మిక సంఘాలతో చర్చలు జరిపి, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ వెంకన్న, థామస్ రెడ్డి, మౌలాన, కే యాదయ్య, ఎస్ సురేష్, బి యాదగిరి, అనంతయ్య, పర్లగొర్ల మోడీ రాందేవ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
23 ఏప్రిల్ 2026

# ప్రజా ప్రభుత్వంలో రైతులకు, మహిళలకు సమున్నత స్థానం

- పార్లమెంట్ సభ్యులు మల్లు రవి

**వనపర్తి బ్యూరో, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** ప్రజా ప్రభుత్వం రైతులకు, మహిళలకు సమున్నత స్థానం కల్పిస్తోందని, సన్నారకం వరి ధాన్యానికి బోనస్ కల్పించి రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి పేర్కొన్నారు.బుధవారం పార్లమెంటు సభ్యులు మల్లు రవి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి పెద్దమందడి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా వీరు ఐకెపి ఆధ్వర్యంలో పెద్దమందడి మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రం, వెల్టూరు గ్రామంలో ఏర్పాటుచేసిన రెండు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం వడ్ల సంచిని తూకంపై పెట్టి కాంటా చేసి కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం రైతులకు, మహిళలకు సమున్నత స్థానం కల్పిస్తోందని,



సన్నారకం వరి ధాన్యానికి బోనస్ కల్పించి రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. వరి ధాన్యం అమ్మకానికి వచ్చిన రైతులకు తేమ శాతం వచ్చిన వెంటనే కొనుగోలు చేసి టాబ్ ఎంట్రీ పూర్తి చేయాలన్నారు.రైతులకు వారం రోజుల్లో నగదు పడే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సన్న రకం వరి ధాన్యానికి బోనస్ ఇచ్చి రైతులకు అండగా ప్రభుత్వం నిలుస్తోందని తెలిపారు. రైతులు ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ**

వెల్టూరు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు ఎంపికైన పలువురు లబ్ధిదారులకు ఎంపీ, ఎమ్మెల్యే చేతుల మీదుగా మంజూరు పత్రాలు అందజేశారు. ఇల్లు లేని నిరుపేదలను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని, అందుకే రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తూ లబ్ధిదారులకు ఇల్లు కట్టుకోవడానికి రూ. 5 లక్షలు ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, మాజీ డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, డి ఆర్ డి ఓ ఉమాదేవి, డి సి ఎస్ ఓ కాశీ విశ్వనాథ్, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## 46 ఏళ్ల వయోపరిమితి జీవో పునరుద్ధరించాలి



**నారాయణపేట, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ పడే నిరుద్యోగుల 46 ఏళ్ల వయోపరిమితి జీవో ను పునరుద్ధరించాలని నిరుద్యోగులు హెచ్. నర్సింహా, రాధ కిషన్, నరేష్, రాహుల్, శివ అమర్ తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ 46 ఏళ్ల వరకు అవకాశం ఇస్తూ గతంలో జారీ చేసిన జీవో ఫిబ్రవరి 8 తేదిన ముగి సిందని తెలిపారు. ఒకవేళ 46 ఏళ్ల వయోపరిమితి జీవో పునరుద్ధరణ చేయకపోతే రాష్ట్రంలో లక్షలాది నిరుద్యో గులకు నష్టం కల్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గత 20 సంవత్సరాల నుండి సకాలంలో నోటిఫికేషన్స్ వేయక, వేసిన నోటిఫికేషన్స్ ద్వారా వ్రాత పరీక్షలు నిర్వ హించి ఉద్యోగాలు సకాలం లో భర్తీ చేయకపోవడం వలన వేలాది నిరుద్యోగులు ఉద్యోగాలు కోల్పోయారు అని ఆవేదన వ్యక్తం చేశారు.

## విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా వసతులు

- జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు



**గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** సంక్షేమ వసతి గృహాల్లో ఉండి చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పిస్తున్నట్లు అదనపు కలెక్టర్ నర్సింగరావు తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల్లో బుధవారం ఎర్రవల్లి మండలం వల్లూరు గ్రామంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో మైనర్ రిపైర్స్ గురించి అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. వసతి గృహంలో డ్రైనేజీ నీటిని బయటకు పంపించే మురుగు కాలువ దెబ్బతినడంతో ఇంకుడు గుంత నిర్మించేందుకు ప్రతిపాదనలు చేయాలన్నారు. సెప్టిక్ ట్యాంక్ కుంగి పోవడంతో, ప్రహరీ గోడ పాక్షికంగా కూలిపోవడంతో మరమ్మత్తులు చేయిస్తామన్నారు. జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలతో పాటు గురుకుల, కస్తూర్బా విద్యాలయాల్లోనూ అవసరమైన మైనర్ రిపైర్స్ చేయించేందుకు సంబంధిత వార్డెన్స్, ఇంజనీరింగ్ అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరుగుతుందన్నారు. సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 26 వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని సౌకర్యాలపై అక్కడి విద్యార్థులతో అధికారులు మాట్లాడారు. అనంతరం అదనపు కలెక్టర్, ఇతర అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.ఈ పర్యటనలో గ్రామ సర్పంచ్ రవి ప్రకాష్,ఉప సర్పంచ్ కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా, ఎంపీడీవో అజహార్ మొహిద్దిన్, పంచాయతీరాజ్ ఏఈ భరత్ కుమార్ రెడ్డి, వార్డెన్ నరేష్, తదితరులున్నారు.

# కదలని బస్సు చక్రాలు

- డిపోలకే పరిమితమైన బస్సులు
- ఆర్టీసీ కార్మికుల సమ్మె సమరం
- ప్రభుత్వం వెంటనే ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి
- మ్యానిఫెస్టోలో పెట్టిన సమస్యలే ప్రభుత్వం అమలు చేయాలి
- సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మె విరమించం
- ప్రైవేటు బస్సులను అడ్డుకున్న ఆర్టీసీ కార్మికులు
- బస్సులు లేక ప్రయాణికులకు ఇబ్బందులు
- సంగారెడ్డి బస్ డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులు సమ్మె


**సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో ఆర్టీసీ కార్మికులు సమ్మె సమరానికి సిద్ధమై బుధవారం ఉదయం నుండే సమ్మెను కొనసాగించి బస్సులను డిపోలకే పరిమితం చేశారు ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఎన్నికల సమయంలో పెట్టిన మ్యానిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి కొన్ని బస్సులు ప్రైవేట్ బస్సులు నవ్పించేందుకు పోలీసులు ప్రయత్నం చేయగా ఆర్టీసీ కార్మికులు అడ్డుకొని బస్సులను వెనక్కి తరిమినారు పోలీసుల మధ్య కార్మికుల మధ్య కాస్త ఉద్రిత చోటుచేసుకుంది సంగారెడ్డి బస్టాండ్ ఎదురుగా ఆర్టీసీ కార్మికులు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయమని న్యాయబద్ధంగా ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నామని అన్నారు. ఆర్టీసీ కార్మికులకు ఎన్నికల




సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయాలని వారన్నారు ప్రధానమైన డిమాండ్లు ఆర్టీసీ కార్మికుల లేవని ప్రభుత్వం చెప్పిన హామీలనే అమలు చేయాలని అన్నారు. హామీలను అమలు చేసేంతవరకు ఆర్టీసీ కార్మికుల సమ్మెలో విరమించబోమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ప్రధాన కీలకమైన ఆర్టీసీ కార్మికులను వారు గుర్తు చేశారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వాలు మోసం చేయడం సరికాదని వారు ధ్వజమెత్తారు. ఆర్టీసీ బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## ఇది మాటల ప్రభుత్వం...చేతల ప్రభుత్వం కాదు

- ఆర్టీసీ కార్మికులకు అండగా బిజెపి
- బిజెపి రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ



**నారాయణపేట, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** రాష్ట్రంలో ఉన్నది చేతల ప్రభుత్వం కాదు కేవలం మాటల ప్రభుత్వం అని బిజెపి రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ,జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్ అన్నా రు.బుధవారం నారాయణ పేట డిపో ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఉద్యమిస్తే తప్పా ఏది అమలుకు నోచు కొదని అన్నారు.ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ఆర్టీసీ కార్మికుల కు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రెండున్నర ఏళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నదని అన్నారు. ఆర్టీసీ కార్మికులవి గొంతెమ్మ కోరికలు కావని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్నారని అన్నారు.గత ప్రభుత్వంలోనే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని చట్టం చేయడం జరిగిందన్నారు.చట్టాన్ని అమలు చేయడంలో ఈ ప్రభుత్వానికి వచ్చిన నష్టమే మని ప్రశ్నించారు.అలాగే కార్మికుల సంఘాలను పునరుద్ధరిస్తే వచ్చే నష్టం ఏమిటనిఅన్నారు.ఉద్యమిస్తేనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిందని, ఉద్య మిస్తేనే నారాయణపేట జిల్లా ఏర్పడిందని,ఉద్యమిస్తేనే 69 జి ఓ అమలు అవుతున్నదని అన్నారు.కార్మికులు సంఘటి తంగా ఉద్యమిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు.మీ పోరాటానికి బిజెపి వెంట ఉంటుందని సంపూర్ణ మద్దతు ప్రకటించా రు.కాగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్క రించాలని డిమాండ్ చేశా రు.మద్దతు తెలిపిన వారిలో బిజెపి పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్,బిజెపి నాయ కులు జి.ఆర్ రెడ్డి,కౌన్సిలర్ సత్య రఘుపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం కేసులో న్యాయం గెలిచింది

**మెదక్, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ నివేదికకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తాజా తీర్పును మాజీ డిప్యూటీ స్పీకర్, మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు యం.పద్మ దేవేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు



ఆదేశించడం న్యాయం గెలిచినట్లేనని పేర్కొన్నారు. కమిషన్ విచారణలో ప్రాథమిక న్యాయ నిబంధనలు పాటించలేదని కోర్టు స్పష్టం చేయడం ద్వారా ఆ నివేదికకు చట్టపరమైన బలం లేదని తేలిందన్నారు. ముఖ్యంగా సెక్షన్ 8 కింద సంబంధిత వ్యక్తులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఆరోపణలు చేయడం సరికాదని కోర్టు వ్యాఖ్యానించడం అత్యంత కీలక పరిణామమని తెలిపారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గారు, మాజీ మంత్రి హరీష్ రావుపై రాజకీయ ఒత్తిడి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కమిషన్‌లను అడ్డంపెట్టుకుని వేధింపులకు పాల్పడిందని విమర్శించారు. అయితే న్యాయస్థానాలపై నమ్మకంతో పోరాడగా చివరకు నిజం గెలిచిందని అన్నారు. తెలంగాణ జీవధారగా భావించే కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ పార్టీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు మరియు మాజీ మంత్రి హరీష్ రావు ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కక్షపూరితంగా వ్యవహరించాయని ఆరోపించారు. ప్రాజెక్టు మరమ్మతులను సకాలంలో చేపట్టకుండా దాదాపు రెండున్నరేళ్లు ఆలస్యం చేశారని, గత్యంతరం లేక ఇప్పుడు పనులు ప్రారంభిస్తున్నారని విమర్శించారు.కాళేశ్వరం అంశంలో కేసీఆర్ గారిపై చేసిన ఆరోపణలు నిరాధారమని ఈ తీర్పుతో స్పష్టమైందని, కాంగ్రెస్ మరియు బీజేపీ పార్టీలకు ఈ తీర్పుతో కనువిప్పు కలగాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ వేధింపులను పక్కన పెట్టి పాలనపై దృష్టి సారించి, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. న్యాయం ఎప్పటికైనా గెలుస్తుందనే విశ్వాసానికి ఈ హైకోర్టు తీర్పు నిదర్శనమని తెలిపారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- జెడ్పీ సీఈఓ వెంకట్ రెడ్డి

**జడ్చర్ల, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా పరిషత్ సీఈఓ ఎస్. వెంకట్ రెడ్డి బుధవారం జడ్చర్ల మండలంలో విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా ఆయన కొత్తతండ, పోచమ్మగడ్డ తండ గ్రామాల్లోని మైనారిటీ ఎస్టీ గిరిజన గురుకుల బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగది, భోజనశాల, మరుగుదొడ్లు, పారిశుధ్య సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులందరికీ ప్రతిరోజూ అత్యంత పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం సీఈఓ చర్లపల్లి, నస్రుల్లాబాద్ గ్రామాలను సందర్శించి అక్కడ జరుగుతున్న ఉపాధి హామీ పనులు, నర్సరీలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ప్రతి గ్రామంలో కనీసం 100 మంది కూలీలు ఉపాధి పొందేలా చర్యలు తీసుకోవాలని, పని ప్రదేశంలో ఎండ తీవ్రత దృష్ట్యా కూలీల కోసం త్రాగునీరు, షెడ్ నెట్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు తమ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకునేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. నర్సరీలలో మొక్కలు ఆరోగ్యంగా మొలకెత్తేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, గ్రామాల్లోని వీధులను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని, ప్రకృతి వనాల్లో



ఎండిపోయిన మొక్కలను వెంటనే తొలగించి, ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయాలని స్పష్టం చేశారు. పర్యటనలో మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల వసతులు, విద్యా ప్రమాణాల బలోపేతంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**తెలకపల్లి, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య అందించడం ద్వారా వారి భవిష్యత్తును బలోపేతం చేయడం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని కేజీబీవీలు, ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థుల సమగ్ర అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో సంక్షేమ వారోత్సవాల సందర్భంగా బుధవారం నాగర్ కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని రాకోండ గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం రూ. 1 కోటి 54 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదులు ఆధునిక సౌకర్యాలతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూగ్రామీణ మరియు పేద వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందన్నారు. కేజీబీవీలు, గురుకులాలు వంటి సంస్థలను బలోపేతం చేయడం ద్వారా సమాన విద్యా అవకాశాలు కల్పించడమే లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్



రెడ్డి సారథ్యంలో ప్రతి నియోజకవర్గంలో ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నెలకొల్పి, అన్ని కులాల, అందరూ విద్యార్థులకు సమాన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు నిర్వహించేలా కృషి చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ తరగతి గదుల ద్వారా విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యా వాతావరణం కలుగుతుందని, విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల భాగంగా విద్యార్థులకు అవసరమైన మూలిక వసతులపై దృష్టి పెట్టినట్లు, జిల్లా యంత్రాంగం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అవసరమైన అందుకు అవసరమైన సదుపాయాలను సమకూర్చనున్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదవకాశాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థానంలోకి రావాలని విద్యార్థులు మరిన్ని ఉన్నత చదువులు అధిరోహించి ఉన్నత స్థానంలోకి రాణించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో 1000 మార్కులకు గాను 990 మార్కులు సాధించిన విద్యార్థిని అనిషాను కలెక్టర్, ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. అనంతరం గ్రామ పరిధిలోని ఇందిరమ్మ లబ్ధిదారుల కోసం నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మరియు కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్ల ద్వారా సొంత ఇల్లు కల సాధనలో ప్రభుత్వం సహకారం అందిస్తోందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్, మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంపీ ఓ వెంకట్, మాజీ వైస్ ఎంపీపీ నరేందర్ గౌడ్, కేజీబీవీ ప్రత్యేక అధికారి హసీనా, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**ఝరాసంగం, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** మహిళలు, యువత చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సంగారెడ్డి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య అన్నారు. బుధవారం ఝరాసంగం మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో నిర్వహించిన చట్టాలపై అవగాహన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్బంగా జడ్జి మాట్లాడుతూ




సమాజంలో మహిళలు, చిన్న పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను చట్టరిత్యా ఎదుర్కోవడంలో కొందరు అవగాహన లేక లేదా ఆర్థికలేమితో ఎవరకి చెప్పుకోలేక మదనపడుతున్నారని అలాంటి వారకి ఉచిత న్యాయం అందించడానికి జిల్లా న్యాయాధికార సంస్థ పనిచేస్తుందన్నారు. గ్రామాలలో ప్యారాలీగల్? వాలీంటీర్లను నియమించుకుని వారి ద్వారా కేసులు పరిష్కరిస్తుందన్నారు. చిన్న పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలన్నారు. వారి పట్ల ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే అలాంటి వారిపై ఫోక్సో చట్టం కట్టి శిక్షించవచ్చన్నారు. బాల్యవివాహాలు చేయడం నేరమే కాకుండా వాటి వల్ల ఎన్నో అనర్ధాలు తలెత్తుతాయని ఆమె తెలిపారు. గర్భంలో ఉన్నప్పుడే లింగ నిర్ధారణ పరీక్షలు చేయించున్నవారు, చేసిన వారిపై నేరం మోపబడుతుందన్నారు. బడికి వెళ్ళాల్సిన పిల్లలను పనిలో పెట్టినా చైల్డ్? లేబర్? చట్టం కింద వారిపై చర్యలు తీసుకోవచ్చన్నారు.వార్తా పత్రికలలో వచ్చిన కథనాలను పరిగణలోకి తీసుకుని సుమోటోగా కేసులు కట్టి విచారణ చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మంజుల, సీడీపీఓ సుశీల, డిప్యూటీ తహసీల్దార్? రాజు, ఏపీఎం బాగయ్య,ఎస్?ఐ పాటిల్ క్రాంతికుమార్?, మాజీ ఎంపీటీసీ రజినీప్రియ, అంగన్?వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ధరిత్రి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హనుమకొండ ప్రతినిధి, ఏప్రిల్ 22 (జనంసాక్షి) : భూమిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పేర్కొన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్, కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా రూపొందించిన ఇంటర్నేషనల్ మదర్ ఎర్త్ ఫోర్ట్‌నైట్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పెరుగుతున్న వాతావరణ, భూ కాలుష్యాన్ని నియంత్రించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పనిలో పర్యావరణ స్పృహ కలిగి ఉండాలని సూచించారు. పక్షం రోజుల పాటు నిర్వహిస్తున్న మదర్ ఎర్త్ ఉత్సవాల సందర్భంగా విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు మొక్కల నాటకం చేపట్టాలని పిలుపునిచ్చారు. అలాగే ఏక వినియోగ ప్లాస్టిక్‌ను నివారించడం, గుడ్డ సంచుల వినియోగాన్ని ప్రోత్సహించడం, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం, పర్యావరణహిత కార్యక్రమాలపై అవగాహన పెంపొందించడం వంటి చర్యలు తీసుకోవాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం సైకిల్ ర్యాలీలు, ఉదయ నడకలు వంటి కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. వెంకట గిరిరాజ్ గౌడ్, డిపిఆర్ఓ ఆయూబ్ అలీ, కుడా ప్లానింగ్ అధికారి అజిత్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మరియు ఎన్‌జీసీ కన్వీనర్ ఎస్. శ్రీనివాస స్వామి, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## తిట్టించడానికే మీటింగ్ పెట్టించిన శ్రీధర్ బాబు

- సీఎం మాటలు విని సమాజమంతా అసహించుకుంటున్నరు
- ముఖ్యమంత్రి వస్తే ఈ ప్రాంతానికి అభివృద్ధి బాటలు పడాలె
- కాళేశ్వరం కూలిందన్న సీఎం కాన్వాయ్‌లో ఎలా వెళ్లిండో చెప్పాలె
- ప్రెస్‌మీట్‌లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



కాటారం ఏప్రిల్ 22 (జనంసాక్షి) : తెలంగాణ ఉద్యమనేత మాజీ సీఎం కేసీఆర్‌ను తిట్టించడానికే కాటారం మండలంలో మీటింగ్ పెట్టి సీఎం రేవంత్‌రెడ్డిని తీసుకువచ్చాడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. బుధవారం కాటారం మండల కేంద్రంలో భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణీ రాకేష్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నస్తూరిపల్లిలో కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన పేరుతో నిర్వహించిన మీటింగ్ కాటారం మండలాన్నే అపవిత్రం చేసిందన్నారు. రేవంత్‌రెడ్డి గొంతెత్తి మాట్లాడితే గొప్పగా అనుకుంటున్నాడేమో గానీ ఆయన మాటలు విని సమాజమంతా అసహించుకుందని అన్నారు. ముఖ్యమంత్రి అనే విషయాన్ని మర్చిపోయి మురికినోటితో నోటికచ్చినట్లు మాట్లాడాడని, ఒక మాజీ ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్‌ను చెట్టుకు కట్టేసి కొడుతామంటాడా అని అగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి బుద్ది లేకుండా మట్లాడుతుంటే పక్కనే ఉన్న మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు నిలువరించాలి కదా అన్నారు. అంటే కావాలనే కేసీఆర్‌ను తిట్టించడం కోసమే ఇక్కడ మీటింగ్ పెట్టించాడని అర్థం అవుతుందన్నారు. ఆనాడు పీవీ నర్సింహరావు నాలుగు సార్లు మంథనికి ప్రాతినిధ్యం వహించారని, ఆయనకు ఓట్లు వేసి గెలిపించుకున్న గడ్డ మంథని అని ఆయన గుర్తు చేశారు. ప్రజాపాలన ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిందని గొప్పలు చెప్పుకుంటున్నారని, ఆరు గ్యారెంటీలు, 420హామీల్లో ఎన్ని అమలు చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. సన్నబియ్యం, ఉచిత బస్సు, ఉచిత కరెంటు, గ్యాస్ సబ్సీడీల గురించి చెప్పి భుజాలు చరుసుకుంటున్నారని, ఇచ్చిన హామీలేన్నీ అనే విషయాన్ని ఎందుకు చెప్పడం లేదన్నారు. మానీఫెస్టో కమిటి చైర్మన్ మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు రాసిన గ్యారెంటీ కార్డులో నాలుగే ఉన్నయా అని ప్రశ్నించారు. అందులో మహిళలకు 2500, రైతులకు 15వేలు, కౌలు రైతులకు ఇస్తమన్నవి ఏవీ అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆనాడు ఉద్యమకారులను తుపాకులతో బెదిరించిన విషయం ఇంకా ప్రజలు మర్చిపోలేదన్నారు. కాళేశ్వరం కూలిపోయిందని ఇక పనికిరాదని మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి నిన్న అదే కాళేశ్వరం మీదుగా కాన్వాయ్‌లో ఎలా వెళ్లావని ప్రశ్నించారు. ఒక ముఖ్యమంత్రి ఒక ప్రాంతంలో జరిగే మీటింగ్ వస్తున్నాడంటే ఆ ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించడమో, ఏదైనా పరిశ్రమను తీసుకురావడమో జరుగుతుంది కానీ ఇక్కడ మాత్రం కేవలం కేసీఆర్‌ను తిట్టాలనే ఆలోచనతోనే మీటింగ్ పెట్టారన్నారు. నియోజకవర్గంలో అనేక వనరులు ఉన్నాయని, వాటిని ఉపయోగించుకుని పరిశ్రమనో, ఫ్యాక్టరీనో తీసుకువచ్చి ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకశాలు కల్పించాలని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ ఆలోచన చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆరెండ మానేరుపై వంతెనకు ముఖ్యమంత్రి శంఖుస్థాపన చేశాడని, ఆ పనులు ఎన్నడు మొదలు పెడుతారో అర్థం కావడం లేదన్నారు. డిసెంబర్ 04న మంథని గోదావరినదిపై వంతెనకు శిలాఫలకం వేశాడని, కానీ రెండున్నర ఏండ్ల క్రితమే వంతెనకు జీఓ వచ్చిందని, శిలాఫలకం వేసి ఏడాది కాబోతుందని ఇప్పటి వరకు పనులు ముందుకు సాగడంలేదన్నారు. కేవలం అభివృద్ది పనులు కాగితాలకే పరిమితం చేస్తారని, అబద్దాలతోనే అధికారం నడిపిస్తారని ఆయన ఎద్దేవా చేశారు. ఆనాడు కేసీఆర్ తెలంగాణను సాధించకపోతే ఈనాడు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేవాడా దుద్దిళ్ల శ్రీధర్ మంత్రిగా ఉండేవాడా అని ప్రశ్నించారు. మీ మాటలు, మీ అబ్దాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, రేవంత్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌లను చింతబరిగెలతో కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఆయన హితవు పలికారు.

## హత్య కేసులో నిందితుడు అరెస్ట్



మొగుళ్ళపల్లి ఏప్రిల్ 22 (జనంసాక్షి) : భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన చిలువేరు పోశయ్య (66) పై పాత కక్షల నేపథ్యంలో 04.04.2026న ఇనుగాల కుమారస్వామి కర్రతో దాడి చేయగా, తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ 18.04.2026న వరంగల్‌లోని ఎంజిఎం ఆసుపత్రిలో మృతి చెందారు. మృతుని భార్య ఫిర్యాదు ఆధారంగా దీమీా సెక్షన్ 103 కింద కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు, నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా చిట్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ మల్లేశ్ , ఎస్.ఐ ముప్పు సురేష్ సిబ్బందితో కలిసి 22.04.2026 ఉదయం 11:10 గంటలకు మొగుళ్లపల్లి పెద్దమ్మ తల్లి గుడి సమీపంలో నిందితుడు ఇనుగాల కుమారస్వామిని అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని రిమాండ్‌కు తరలించారు.

## రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

- సీతారాంపురం వద్ద ఆగివున్న లారీని ఢీకొన్న బైక్



దేవరుప్పుల, ఏప్రిల్ 22 (జనంసాక్షి) : మండలంలోని సీతారాంపురం గ్రామ శివారులో నేషనల్ హైవే 365దీ పై బుధవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ముత్యం మహేష్ (26) తండ్రి సోమయ్య గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మహేష్ తన అమ్మమ్మ ఊరైన తిరుమలగిరి నుండి సొంత గ్రామానికి పల్సర్ బైక్‌పై వెళుతుండగా, తెల్లవారుజామున 2:45 గంటల సమయంలో సీతారాంపురం సమీపంలోని ఎంఎన్ఆర్ గార్డెన్ దాటాక హైవేపై ఒక లారీ మెకానికల్ సమస్యతో నిలిపివేసి ఉంది. చీకటిలో ఆ లారీని గమనించని మహేష్, బైక్‌తో వెనుక నుండి బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన మహేష్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. హైవేపై లారీని నిర్లక్ష్యంగా, ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా ఆపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని మృతుడి అన్న ముత్యం గోపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దేవరుప్పుల ఎస్సై సృజన్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్ ప్రారంభం



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22(జనంసాక్షి): ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం గోండు గూడలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు 'ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్'ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన మంత్రి జూపల్లికి సుగుణక్క ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ అనిల్ కుమార్, ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ తదితరులతో కలిసి కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ అడవుల్లో నివసిస్తున్న అనేక మంది ఆదివాసీలకు బయటి ప్రపంచంపై సరైన అవగాహన లేదని, కొంతమందికి జిల్లా కేంద్రం ఎక్కడుందో కూడా తెలియని పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు.

## ఉపాధి వేతన లక్ష్యాలను చేరుకోవాలి

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ ప్రతినిధి, ఏప్రిల్ 22(జనంసాక్షి): జిల్లాలోని అన్ని మండలాల్లో, గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పని కల్పించి, దినసరి వేతనం అందేలా చూడాలని, నిర్దేశించిన లక్ష్యాలను తప్పకుండా చేరుకోవాల్సిందేనని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (వీ+చీ=జు+ూ) పనుల పురోగతి, నిర్వహణపై జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా 12 మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపిఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్మా ట్లాడుతూ..... పనుల కొలతలు పూర్తి చేసిన తర్వాత 72 గంటల్లోనే రికార్డు బుక్ లలో నమోదు చేయాలని, ఫీల్డ్ అసిస్టెంట్లు క్షేత్ర స్థాయిలో పనులను తరచుగా పరిశీలించాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు వారానికి ఒకసారి పనుల పురోగతిని తనిఖీ చేసి, నివేదిక సమర్పించాలని పేర్కొన్నారు. ఎంపీడీవోలు మండల స్థాయి పనితీరుకు బాధ్యత వహించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఇంచార్జి డీఆర్డీఓ నూరుద్దీన్, అడిషనల్ డీఆర్డీఓ చంద్రశేఖర్, అన్ని మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్ లు, ఫీల్డ్ అసిస్టెంట్ లు, తదితరులు పాల్గొన్నారు.

## పైరవిదారులకే గోనె సంచులు ఇస్తున్నారు

- గోనె సంచులు ఇవ్వాలని 365 జాతీయ రహదారిపై రైతుల రాస్తారోకో



గూడూరు, ఏప్రిల్22 (జనంసాక్షి): పైరవిదారులకే గోనె సంచులు ఇస్తున్నారని రైతులు మండి పడుతూ,అయ్యా కాళ్ళు మొక్కుతాం గోనె సంచులు ఇప్పించండి అంటూ రోజుల తరబడి ఎండలో ఎండుతూ మండుతూ ఉన్నాం గోనెసంచులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం మీరైనా గోనెసంచులు ఇప్పించండి అంటూ ఓ రైతు ఎస్ఐ గిరిధర్ రెడ్డి కాళ్ళ మీద పడ్డారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో 365జాతీయ రహదారిపై మొక్కజొన్నలను కొనుగోలు చేయాలంటూ మక్క రైతులు ఆందోళన నిర్వహించారు. రోజుల తరబడి కొనుగోలు కేంద్రంలోనే మక్కలు ఉంటూన్నాయని, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ పైరవిదారులకే గోనె సంచులు ఇస్తున్నారంటూ రైతులు మండిపడ్డారు. అహర్నిశలు కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకు వస్తే, గోనె సంచులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ, తక్షణమే గోనె సంచులు ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎస్సై గిరిధర్ రెడ్డి అక్కడకు చేరుకొని రైతులతో మాట్లాడి గోనెసంచులు రైతులందరికి వచ్చే విధంగా హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. అనంతరం పోలీసులతో కలిసి రైతులు సొసైటీ కార్యాలయానికి తరలి వెళ్లారు. గోనె సంచుల విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈకార్యక్రమంలో పోలీస్ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.



## కేరళ సంస్కృతి సందడి

### ఆకట్టుకున్న 'ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్'.

గూడూరు, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :గూడూరు మండలం లక్ష్మీపురం పాఠశాలలో బుధవారం నిర్వహించిన 'ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్' కార్యక్రమం విద్యార్థుల ప్రతిభతో కళకళలాడింది. ఈ సందర్భంగా విద్యార్థులు కేరళ రాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబించే సంప్రదాయ వస్త్రాలను ధరించి అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో భాగంగా కేరళకు చెందిన ప్రఖ్యాత నృత్యాలు అయిన మోహినీయాటం, కథకళి ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ప్రదర్శనలు తల్లిదండ్రులను అబ్బురపరి చాయి. వారి ప్రతిభకు అందరూ ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు షాహిన్ సుల్తాన ఉపాధ్యాయులు నిఖిల్,ఉమ,భారతి పాల్గొన్నారు.

## సింగరేణి బకాయిలపై చలో విద్యుత్ సౌధ



రామకృష్ణాపూర్, ఏప్రిల్ 22(జనంసాక్షి): సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈనెల 28న నిర్వహించనున్న చలో విద్యుత్ సౌధ కార్యక్రమ సంబంధిత వాల్ పోస్టర్‌ను సీఐటీయూ డిప్యూటీ జనరల్ సెక్రటరీ అల్లి రాజేందర్, బ్రాంచి అధ్యక్షులు సాంబారు వెంకటస్వామి నాయకులు ఆవిష్కరించారు. కార్మికులకు సరైన సౌకర్యాలు, వైద్య సేవలు అందడం లేదని, మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిట్ సెక్రటరీ బుద్దే సురేష్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ నామాని సురేష్, ధనిశెట్టి సురేష్, షిఫ్ట్ ఇంచార్జులు, గని కార్మికులు పాల్గొన్నారు

## ఎండల తీవ్రతకు ముందస్తు చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద..



వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 22 (జనం సాక్షి) : జిల్లాలో పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని హీట్ వేవ్ ప్రభావాన్ని తగ్గించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొని వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. వేసవి కాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా తాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చూడాలని సంబంధిత మున్సిపల్, ఇరిగేషన్ మరియు రూరల్ వాటర్ సప్లై అధికారులను ఆదేశించారు. అవసరమైతే వాటర్ ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పబ్లిక్ ప్రదేశాల్లో షేడ్‌లు, తాగునీటి సదుపాయాలు కల్పించడంతో పాటు, వడ దెబ్బ కేసులకు తక్షణ వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, ఐవీ ఫ్లూయిడ్స్ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వ్యవసాయ, పశుసంవర్ధక, అగ్నిమాపక, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, సంక్షేమ, మునిసిపల్, గ్రామీణ అభివృద్ధి, విద్య, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ హీట్ వేవ్ ప్రభావాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వేడి తీవ్రత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చైతన్యం కల్పించాలని, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, కార్మికులు జాగ్రత్తగా ఉండేలా సూచనలు ఇవ్వాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వై వి గణేష్, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, డిఆర్వో విజయ లక్ష్మీ, సంబంధిత శాఖల ఎంపీడీవో లు తాసిల్దారులు అధికారులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు మొక్కజొన్న పంట దగ్ధం

- కాలి బూడిదైన వ్యవసాయ పరికరాలు...
- రూ. లక్ష 80 వేల నష్టం...





చెన్నారావుపేట, ఏప్రిల్ 22 (జనంసాక్షి) : ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో మొక్కజొన్న పంట చేనుతోపాటు, వ్యవసాయ పరికరాలు దగ్ధమైన సంఘటన మండలంలోని ధర్మ తండా గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. తండా వాసుల కథనం ప్రకారం... ఇదే తండాకు చెందిన భూక్య రామోజీ అనే రైతుకు చెందిన మొక్కజొన్న పంట చేను ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి చేనులో ఉన్న మొక్కజొన్న కంకులు మొత్తం కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో రూ. 80 వేల నష్టం జరిగిందని బాధిత రైతు భూక్య రామోజీ ఆవేదన వ్యక్తం చేశాడు. అలాగే పక్కనే ఉన్న భూక్య పూల్ సింగ్ అనే రైతుకు చెందిన విద్యుత్ మోటార్, వైర్లు, కోసి పెట్టిన టేకు కర్రలు, డ్రిప్పు పైపులు, వాటర్ పైపులు, ఇతర వ్యవసాయ పరికరాలు మొత్తం కాలిపోయాయి. రూ. 1 లక్ష నష్టం వాటిల్లిందని బాధిత రైతు తన గోడును వెళ్ళబోసుకున్నాడు. వెంటనే మంటలు వ్యాపిస్తున్నాయన్న సమాచారాన్ని తండావాసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్ తో వచ్చి మంటలను ఆర్పివేశారు. మొక్కజొన్న పంట నష్టం జరిగిన, వ్యవసాయ పరికరాలు కాలిపోయి తీవ్ర నష్టం జరిగిన తమ కుటుంబాలను ఆదుకోవాలని బాధిత రైతులు భూక్య రామోజీ, భూక్య పూల్ సింగ్ లు ప్రభుత్వాన్ని కోరారు.

### ఉప్పరపల్లిలోనూ మొక్కజొన్న పంట దగ్ధం

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో మొక్కజొన్న పంట చేను కాలిపోయిన సంఘటన మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఇదే గ్రామానికి చెందిన రైతు మహమ్మద్ భాషమియాకు చెందిన మొక్కజొన్న పంట చేనులో విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి ఎండిపోయిన మొక్కజొన్న పంట చేనుపై పడడంతో మంటలు వ్యాపించి చేతికి అంది వచ్చిన రెండు ఎకరాల మొక్కజొన్న పంట చేను మొత్తం కాలిపోయింది. చుట్టుపక్కల రైతులు గమనించి మంటలు ఆర్పి వేసినప్పటికీ తీవ్ర నష్టం జరిగిందని రైతు భాషమియా ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ప్రమాదంలో రూ. 2 లక్షల నష్టం జరిగిందని రైతు ఆందోళన వ్యక్తం చేశాడు. విద్యుత్ తీగలు లూజ్ లైన్ల కనెక్షన్ల మూలంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగిందని వెంటనే ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని రైతు భాషమియా కోరాడు.

## వడ్ల కొనుగోలు సెంటర్లను ప్రారంభించిన ప్రభుత్వ విప్



**తుర్కపల్లి, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. బుధవారం తుర్కపల్లి మండలం పెద్దతండ ,పల్లె పహాడ్ గ్రామాల్లో పిఎసిఎస్ ఆధ్వర్యంలో మాదాపూర్ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. దాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని అమ్మాలని ,దళారులను నమ్మి మోసపోవద్దని అన్నారు. రైతులకు రెండు విడతలుగా ప్రభుత్వం రైతుబంధు నిధులను విడుదల చేసిందని అన్నారు. దాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని అమ్మి సరసమైన ధరను పొందాలని అన్నారు. దాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా నిర్వాహకులు చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్రెడ్డి, తాసిల్దార్ పి. రవికుమార్, ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్ మహిళా మండల అధ్యక్షురాలు తుమ్మల మమతా తిరుపతిరెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ధనావత్ భాస్కర్ నాయక్, సర్పంచులు భూక్య రాజారాం నాయక్, పాంగల పవనీత బాలకృష్ణ, ధరావత్ రమేష్ నాయక్, బానోతు సతీష్ నాయక్, ధరావత్ కమిలి సురేష్, సీత రాజు, సోమల వెంకటేశం, ఏపీఎం రమణ, పిఎసిఎస్ సీఈఓ లు నారా రమేష్, బోరేడ్డి జనార్దన్ రెడ్డి, శ్రీరామ్ మూర్తి ,బాలు యాదవ్, నాయకులు, రైతులు ,అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎలక్ట్రిక్ వెహికల్స్, సోలార్ పవర్ ఆవిష్కరణలు అవసరం

- **ఎస్కీ ధరిత్రీ దినోత్సవంలో మంత్రి వివేక్ వెంకట స్వామి**

**ఖైరతాబాద్, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** పెట్రోల్, డీజిల్ కు ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రిక్ వెహికల్స్, సోలార్ పవర్ ఆవిష్కరణల అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, మైన్స్ అండ్ మినరల్స్ శాఖా మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకట స్వామి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థికాభివృద్ధి 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్లకు చేర్చా లనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తున్నదని, ఇందు కోసం ఇప్పటికే ఏడు లక్షల కోట్ల పెట్టుబడులు వ చ్చాయని, గ్రౌండ్ లెవల్ లో పనులు జరగాలంటే నై పుణ్యమున్న సిబ్బంది అవసరం కాబట్టి ప్రభుత్వం 65 అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటుచే సిందని, వచ్చే రెండు మూడేళ్ళలో వీటి సంఖ్యను 120 కు పెంచి, ఏటా 25 వేల మంది యువతకు శిక్షణ ఇవ్వడం వలన రాష్ట్ర ఆర్థిక ప్రగతి వేగం పుం జుకుంటుందని పేర్కొన్నారు. ప్రపంచ ధరిత్రీ దినో త్సవం సందర్భంగా ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా బుధవారం ఏర్పాటు చేసిన రేర్ ఎర్త్ అండ్ ఎలిక్ట్రిక్ వెహికల్స్ జాతీయ సమావేశంలో మంత్రి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఎలక్ట్రిక్ వె హికల్స్ బ్యాటరీ సస్టైనబిలిటీ ఇంజనీర్ కోర్సును



దేశంలో మొదటిసారిగా ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియాలో ప్రవేశపెట్టి యువతకు శిక్షణ ఇ వ్వడం సంతోషంగా ఉందని, తమ శాఖా ద్వారా నిర్వహిస్తున్న అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్ లో కూడా ఈ కోర్సుని ప్రవేశపెట్టడం కోసం ఎస్కీ తో కలిసి పనిచేస్తామని మంత్రి అన్నారు. సమావేశ ప్రారంభంలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండి యా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు మాట్లాడు తూ ధరిత్రిని కాలుష్య నివారణ నుండి కాపాడుకో వాల్సిన అవసరం ఉందన్నారు.ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా మేనేజ్ మెంట్ కమిటీ చైర్మె న్ పి.సూర్య ప్రకాష్, గవర్నింగ్ కౌన్సిల్ చైర్మెన్ డాక్టర్ రఘుపాత్రుని భీంరావు మాట్లాడుతూ రేర్ ఎర్త్ మినరల్స్ వినియోగం, వాటి వెలికితీతపై ఇలాంటి జాతీయ సమావేశాల్లో పలు సూచనలు వస్తాయ న్నారు. ఎస్కీ మైనింగ్ హెడ్ కె.జె.అమర్ నాథ్ సభి కులకు స్వాగతం పలికారు. తమిళనాడు, కేరళ, ఒడిశా, కలకత్తా కు చెందిన ప్రముఖులు రాసిన పేపర్లతో ప్రచురించిన సావనీర్ ను ఈ సందర్భంగా మంత్రి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో భువ నేశ్వర్ లోని సి.ఎస్.ఐ.ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మి నరల్స్ అండ్ మెటీరియల్ టెక్నాలజీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ కాళీ సంజయ్, సి.ఈశ్వరయ్య, డా.రఘుపా త్రుని భీంరావు, కేరళ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా మాజీ ఛైర్మెన్ బాలకృష్ణ నాయర్, బిట్స్ పిలానీ శ్రావ్య భల్ల, తమిళనాడు పొట్టపాలయం డాక్టర్ ఉదయ్ కుమార్, అనురాగ్ యూనివర్సిటీ జె.మరియా శాంతి, వాసవీ మోటార్స్ ఫౌండర్ డాక్టర్ పి.వెంకటేశం రేర్ ఎర్త్ ఎలెమెంట్స్ పై ప్రెసెం టేషన్స్ ఇచ్చారు. సమావేశంలో వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన డెలిగేట్స్, నగరంలోని వివిధ కాలే జీలకు చెందిన విద్యార్థులు, ఎస్కీ సిబ్బంది పాల్గొ న్నారు. సమావేశం ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ సెల్ హెడ్ పి.సాయి కిశోర్ ఆధ్వర్యంలో జరిగింది. జూని యర్ ఫ్యాకల్టీ బి.మోహన్, ప్రోగ్రాం అధికారి, పి.సన్వేశ్ కుమార్ పాల్గొన్నారు.

# నాణ్యతతో కూడిన రహదారులు నిర్మించి ప్రజలకు అందిస్తాం

**ఖమ్మం రూరల్, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** ప్రభుత్వ పనుల్లో కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని, నాణ్యతతో కూడిన రహదారులను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని చింతపల్లి నుంచి ముత్తగూడెం వరకు రూ. 6.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు.

### గడువులోగా పనులు పూర్తి కావాలి

శంకుస్థాపన అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈ లోపే రహదారి పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ



పడకూడదని స్థానిక ప్రజాప్రతినిధులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. గతంలోనే ముత్తగూడెం అభివృద్ధి కోసం రూ. 16.70 కోట్లు మంజూరు చేశామని, త్వరలోనే మున్సిపాలిటీ వ్యాప్తంగా మరిన్ని సీసీ రోడ్లు, డ్రైన్ల పనులు చేపడతామని హామీ ఇచ్చారు.

### అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

తమ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమాంతరంగా అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్ వంటి పథకాలతో ప్రజలకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందజేస్తామని, త్వరలోనే రెండో విడత పంపిణీ ప్రక్రియను ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, స్థానిక కౌన్సిలర్లు,ప్రత్యేక అధికారి రమేష్, ఆర్‌డబి ఎస్‌ఈ యాకోబు, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో గొర్రెలు మృతి



**బీబీనగర్, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** మండల పరిధిలోని జైనపల్లిలో గ్రామంలో వీధి కుక్కలు గొర్రెల పై దాడి చేయడంతో 13 గొర్రెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన దేవతల శ్రీశైలం గొర్రెల దొడ్డిపై మంగళవారం అర్ధరాత్రి కుక్కలు దాడి చేశాయి. బుధవారం ఉదయం దొడ్డి వద్దకు శ్రీశైలం వెళ్లి చూడగా దాడి సంఘటన వెలుగులోకి వచ్చింది. సర్పంచ్ నక్కిర్తి హేమలత గణేష్ మాట్లాడుతూ సుమారు లక్షన్నర రూపాయలకు పైగా నష్టం వాటిల్లిందని బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

## నల్గొండలో అంతర్జాతీయ మాతృభూమి దినోత్సవం

- **ప్లాస్టిక్ నిషేధంపై కలెక్టర్ పిలుపు**



**నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల భూమి మరియు ప్రకృతి తీవ్ర ప్రమాదంలో పడుతున్నాయని, దీన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం అంతర్జాతీయ మాతృభూమి దినోత్సవం సందర్భంగా జిల్లా యువజన సర్వీసులు, క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నల్గొండలో నిర్వహించిన సైకిల్ ర్యాలీని ఆయన ప్రారంభించారు.నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని కేంద్రీయ విద్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించిన ఈ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, మీడియాను ఉద్దేశించి మాట్లాడుతూ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కారణంగా వాతావరణం, జలాలు, భూమి కాలుష్యం చెందుతున్నాయని తెలిపారు. మానవ తప్పిదాల వల్ల జంతుజాలానికి కూడా ప్రమాదం ఏర్పడుతోందని పేర్కొన్నారు.ప్లాస్టిక్ వ్యర్థాలను సరిగా డీకంపోస్టు చేయకపోవడం వల్ల ప్రకృతి నాశనం అవుతోందని, దీని నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, అవసరమైతే తిరిగి వినియోగించడం, రీసైక్లింగ్ పై దృష్టి పెట్టాలని తెలిపారు.మార్కెట్‌కు వెళ్లేటప్పుడు కాటన్ చేతి సంచులు ఉపయోగించడం, ప్లాస్టిక్ బాటిళ్లకు బదులుగా స్టీల్ లేదా మట్టి బాటిళ్లను వినియోగించడం వంటి అలవాట్లు అలవరుచుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని అన్నారు.ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న వారందరితో అంతర్జాతీయ మాతృభూమి దినోత్సవం ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ఈ దినోత్సవంపై రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు, అధికారులు కలిసి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ రాజశేఖర్, జిల్లా యువజన మరియు క్రీడల అభివృద్ధి శాఖ అధికారి మహమ్మద్ అక్బర్ అలీ, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, జిల్లా సైన్స్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

# ఇందుగుల ధాన్యం కేంద్రంలో అన్నదాతల ఆవేదన

**మాడుగులపల్లి, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** అన్నదాత సుఖీభవ అని నినదించే ప్రభుత్వ మాటలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న చేతలకు పొంతన లేకుండా పోయింది మాడుగులపల్లి మండలం ఇందుగుల గ్రామంలో ఏర్పాటు చేసిన తిప్పర్తి పిఏసిఎస్ (రాజూ) ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రస్తుతం అక్రమాలకు, రాజకీయ పెత్తనానికి నిలయంగా మారింది నిబంధనల ప్రకారం కేంద్రం నిర్వహించాల్సిన అధికారులు గైర్హాజరు కావడంతో, అక్కడ అధికార పార్టీ నాయకులే అధికారులై అరాచకం సాగిస్తున్నారు. కేంద్రం ప్రారంభించిన నాటి నుండి నేటి వరకు ఒక్క పిఏసిఎస్ ఉద్యోగి కూడా అక్కడ సరిగ్గా విధుల్లో ఉన్న దాఖలాలు లేవు అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కరువవడంతో, స్థానిక అధికార పార్టీ నాయకులు అక్కడ తిష్టవేసి కొనుగోలు ప్రక్రియను తమ గుప్పిట్లోకి తీసుకున్నారు రైతుల వివరాల నమోదు నుండి తూకం వరకు అంతా వారి కనుసన్నల్లోనే జరుగుతోంది అసలు ఇది ప్రభుత్వ కొనుగోలు కేంద్రమా లేక రాజకీయ నాయకుల ప్రైవేట్ అడ్డానా అని రైతులు నిప్పులు చెరుగుతున్నారు. తరుగు పేరుతో రైతుల రక్తాన్ని పిండుకుంటున్న వైనం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది ఒక్కో క్వింటాకు ఏకంగా 4 నుంచి 6 కిలోలు ధాన్యాన్ని కోత విధిస్తూ రైతుల పొట్ట కొడుతున్నారు ఆరుగాలం శ్రమించి, అప్పులు తెచ్చి పండించిన పంటను అమ్ముకోవడానికి వస్తే ఇలా నిలువు



దోపిడీకి పాల్పడుతుండటంతో బాధితులు కన్నీరు మున్నీరవుతున్నారు. అధికారులకు మొరపెట్టుకున్నా, తమ ఆవేదనను వినిపించినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు అధికారుల మౌనం చూస్తుంటే వారు కూడా ఈ దోపిడీలో భాగస్వాములేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాధితులు వేడుకుంటున్నా స్పందించని అధికారుల తీరుపై మండల వ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతోంది ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, ఇందుగుల కేంద్రంలో రాజకీయ నాయకుల జోక్యాన్ని అరికట్టి, విధులకు గైర్హాజరవుతున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు తక్షణమే తూకంలో కోతలను అరికట్టి రైతులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

## అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**వెల్దండ, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** వెల్దండ మండలంలోని పోతేపల్లి గ్రామంలో బుధవారం నాగర్ కర్నూల్ జిల్లా అదనపు లికలెక్టర్ జీవి శ్యాం ప్రసాద్ లాల్లి ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. కూలీలకు పని ప్రదేశంలో త్రాగునీరు, మెడికల్ కిట్టులు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సందర్భంగా లిసర్పంచ్ తగుళ్ల కొండల్ యాదవ్‌లి అదనపు కలెక్టర్ మరియు ఎంపీడీవోలను శాలువాలతో ఘనంగా సత్కరించి సన్మానించారు.అనంతరం గ్రామంలోని లిప్రభుత్వ



ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి, పాఠశాల భవనంలో ఒక గది ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలో ఉండటంపై అదనపు కలెక్టర్ ఆరా తీశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి త్వరలో గృహప్రవేశాలు నిర్వహించేలా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఈసం కృష్ణయ్య, ఎంపీఓ లక్ష్మణ్, ఏపీవో ఈశ్వర్ జీ, పంచాయతీ కార్యదర్శి రూప్సింగ్, టెక్నికల్ అసిస్టెంట్స్, క్షేత్ర సహాయకులు, ఉపాధి హామీ కూలీలు మరియు గ్రామస్తులులి పాల్గొన్నారు.

## భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి

- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట ప్రతినిధి, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి తిరు కల్యాణ మహోత్సవాలు ఈ నెల 29 నుండి వచ్చే నెల 4 వరకు నిర్వహించుటకు గాను ముందస్తు ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్ నుండి బుధవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వెబెక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఉత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కళ్యాణ మహోత్సవానికి వచ్చే వేలాది మంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మిషన్ భగీరథ శాఖ నిరంతరం నీటి సరఫరా చేయాలని, పోలీస్ శాఖ వారిని పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని, వైద్య ఆరోగ్య శాఖ మెడికల్ క్యాంపు ఒక అంబులెన్స్ అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలన్నారు.ఆర్టీసీ వారు అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని,విద్యుత్ శాఖ నిరంతరం సరఫరా ఉండే విధంగా చూడాలని అన్నారు.సాగర్ సిమెంట్, నాగార్జున సిమెంట్ వారి సహకారంతో భక్తులకు స్నాక్స్ అందించుట, దేవస్థానం వారు క్యూలైన్స్ ఏర్పాటు, పార్కింగ్ స్థలంలో సీసీ కెమెరా ఏర్పాటు, వృద్ధులకు, దివ్యాంగులకు ఉచిత ఆటో ఏర్పాట్లు చేయాలని సూచనలు చేశారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త చెన్నూరు మట్టపల్లి రావు మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు వారి యొక్క సహాయ సహకారాలు సేవా దృక్పథంతో అందించి స్వామివారి తిరు కళ్యాణ మహోత్సవాలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, జడ్పీ సీఈఓ డి శిరీష,ఆర్డిఓ వి.శ్రీనివాసులు,దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ భాస్కర్,దేవస్థాన అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు, విజయకుమార్, దేవస్థాన కార్యనిర్వహణాధికారి బి.జ్యోతి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.50 కోట్లు




**టేకులపల్లి, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటిడిఏ పీవో రాహుల్ తదితరులు పాల్గొన్నారు.పర్యటనలో భాగంగా మంత్రి ఇల్లందు 10వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తడికమల్ల భాగ్యమ్మ, కోడిమల్ల లక్ష్మి గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని, పూజలు నిర్వహించి లబ్ధిదారులతో కలిసి గృహాలను ప్రారంభించారు. అనంతరం ఇల్లందు మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన చైర్‌పర్సన్ గది ప్రారంభించి, చైర్‌పర్సన్ కిరణ్ మిత్రకు శుభాకాంక్షలు తెలిపారు. ఆపై మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇల్లందు పట్టణ అభివృద్ధికి ప్రత్యేక మున్సిపల్ సమావేశం ఏర్పాటు చేసి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చుతామని అన్నారు. ఇల్లందు అభివృద్ధికి రూ.50 కోట్లు మంజూరు చేస్తామని ఇచ్చిన మాట ప్రకారం, త్వరలో రెండు విడతల్లో నిధులు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రాజకీయాలకు అతీతంగా అందరికీ సమానంగా అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేయాలని సూచించారు. వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ప్రతిరోజూ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలతో నిత్యం సంబంధం పెంచుకుంటూ ఉదయం, సాయంత్రం సమయం కేటాయిస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు.ప్రజా ప్రభుత్వం నిరంతరం ప్రజల కోసం పని చేస్తుందని, ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యతగా ప్రజలకు సేవ చేయాలని మంత్రి కోరారు. కొత్తగా ఎన్నికైన సభ్యులు అనుభవం లేదని భావించకుండా అధికారులతో సమన్వయం చేసుకొని సమస్యలను పరిష్కరించాలని సూచించారు.ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ మంత్రి పొంగులేటి నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో 200 నుంచి 700 ఓట్ల మెజారిటీతో గెలుపొందారున్నారు. కొత్తగా వార్డు కౌన్సిలర్లు ప్రతి వార్డులో సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల్లో పారిశుద్ధ్యం, లైటింగ్, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. వేసవిలో నీటి సమస్యలు లేకుండా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని, వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేస్తూ సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నామని వివరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, గృహ నిర్మాణ శాఖ ఫీడింగ్ రవీందర్ నాథ్, తాసిల్దార్ ఎంపీడీవో ధన్సింగ్,మున్సిపల్ వైస్ చైర్మన్ రాజు, మున్సిపల్ కమిషనర్ సంబంధిత శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రధాన రహదారి వెంట షాపుల నిర్వాకులకు నోటీసులు అందజేత



**కల్లూరు, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** కల్లూరు మునిసిపాలిటీ లో ప్రధాన రహదారి వెంట డ్రైన్ దాటి రోడ్డు మీదికి ఏర్పాటు చేసిన రేకుల షేడ్స్, తోపుడు బండ్లు, ప్రచార బోర్డ్ లను స్వచ్ఛందంగా తొలగించి పాదాచారులకు నడవడానికి ఇబ్బంది కలగ కుండా చూడాలని దుకాణ యజములకు కల్లూరు టౌన్ ప్లానింగ్ అధికారి ఇటికాల భాస్కర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రధాన రహదారి వెంట ప్రయాణికులకు బాటసారిలకు ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా రోడ్డు ఆక్రమించి వివిధ రకాల వ్యాపారాలు నిర్వహించే షాపు నిర్వాహకులకు మున్సిపాలిటీ అధికారులు నోటీసులు అందజేశారు. ఇప్పటివరకు 200 మంది షాప్ యజమానులకు స్వచ్ఛందంగా రోడ్లపై ఏర్పాటుచేసిన షాపులను తొలగించుకోవాలని నోటీస్లు నోటీసులు ఇచ్చి తెలియజేసినట్లు తెలిపారు.నోటీస్ అందిన 7 రోజుల్లో స్వయంగా ఆక్రమణలను తొలగించుకొని ట్రాఫిక్‌కి ఇబ్బంది లేకుండా చూడాలని మున్సిపల్ మేనేజర్ నాగేశ్వర్ రావు కోరారు. అదేవిధంగా ప్రకటనల బోర్డు లకు అనుమతి తీసుకోవాలని లేని యెడల మున్సిపాల్టీ సిబ్బంది చే వాటిని తొలగించి ఫైన్ వెయ్యటం తో పాడు మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకో బడతాయి అని తెలిపారు.

# విపణి

## హెచ్‌సీఎల్ టెక్ లాభం రూ.4,488 కోట్లు

దిల్లీ: ఐటీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్, 2025-26 జనవరి-మార్చి త్రైమాసికంలో రూ.4,488 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.4307 కోట్లతో పోలిస్తే ఇది 4.2% అధికం. ఏఐ (కృత్రిమమేధ) ఆధారిత సేవలకు గిరాకీ భారీగా పెరగడం ఇందుకు దోహదం చేసింది. కార్యకలాపాల ఆదాయం రూ.30,246 కోట్ల నుంచి 12.34% పెరిగి రూ.33,981 కోట్లకు చేరింది. త్రైమాసికం వారీగా చూస్తే లాభం 10.10%, ఆదాయం 0.32% పెరిగాయి. 2025-26 పూర్తి ఆర్థిక సంవత్సరానికి కంపెనీ రూ.16,642 కోట్ల లాభాన్ని ఆర్జించింది. 2024-25 లాభం రూ.17,390 కోట్ల కంటే ఇది 4.35% తక్కువ. 2025-26 మొత్తానికి ఆదాయం 11.18% వృద్ధితో రూ.1,30,144 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరమంతా అనిశ్చిత గిరాకీ వాతావరణం కనిపించిందని హెచ్‌సీఎల్ టెక్ సీఈఓ, ఎండీ సి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. 'సమీక్షా త్రైమాసికంలో మా పనితీరు అంచనాల కంటే తక్కువగా నమోదైంది. మా వ్యాపారంలో కొన్ని విభాగాలు కాస్త వెనకడుగు వేశాయి. క్లయింట్ల వ్యయాలు తగ్గడం, నిర్ణయాలు ఆలస్యంగా తీసుకోవడం ఇందుకు కారణం. ఏఐ ఆధారిత సేవలు మాత్రం పుంజుకున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏఐ అవకాశాల నుంచి ప్రయోజనాలు పొంది, కంపెనీ మంచి స్థానంలో నిలబడగలద'ని ఆయన ధీమా వ్యక్తం చేశారు. విభాగాల వారీగా చూస్తే.. సమీక్షా త్రైమాసికంలో ఐటీ, బిజినెస్ సర్వీసెస్ విభాగం 4.3%, ఇంజినీరింగ్-ఆర్ అండ్ డీ సర్వీసెస్ (ఈఆర్ అండ్ డీ) 3.8% వృద్ధిని సాధించాయి.

# ఐటీ షాక్..

## మూడు రోజుల వరుస లాభాలకు బ్రేక్




ముంబయి: దేశీయ స్టాక్ మార్కె?ట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ప్రకటించినప్పటికీ.. శాంతి చర్చల అంశం ఇంకా కొలిక్కి రాకపోవడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీనికితోడు గరిష్ఠ స్థాయిలో క్రూడాయిల్ ధరలు కొనసాగుతుండడం, ఇటీవల లాభాల నేపథ్యంలో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం వంటివి ప్రభావం చూపాయి. ముఖ్యంగా ఐటీ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి సూచీలను పడేశాయి. దీంతో సెన్సెక్స్ 750 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 24,400 దిగువకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 79,019.34 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 79,273.33) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల బాటలోనే పయనించింది. ఇంట్రాడేలో 78,442.30 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 756.84 పాయింట్ల నష్టంతో 78,516.49 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 198.50 పాయింట్ల నష్టంతో 24,378.10 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 37 పైసలు క్షీణించి 93.81గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 10 శాతం మేర నష్టపోయింది. ఇన్ఫోసిస్, మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్, టెక్ మహీంద్రా స్టాక్స్ కూడా నష్టాలు చవిచూశాయి. హిందుస్థాన్ యూనిలీవర్, ఎన్టీపీసీ, ఎటర్నల్, ట్రెంట్, అల్ట్రాటెక్ సిమెంట్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 99 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం 4754 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఐటీ స్టాక్స్ ధమాల్: ఐటీ స్టాక్స్‌లో అమ్మకాలతో నేడు నిఫ్టీ ఐటీ ఇండెక్స్ దాదాపు 4 శాతం మేర నష్టపోయింది. నిన్న నిరుత్సాహకర క్యూ4 ఫలితాలతో పాటు బలహీన భవిష్యత్ అంచనాలను హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వెలువరించడం ఇందుకు కారణమైంది. దీంతో హెచ్‌సీఎల్ స్టాక్ దాదాపు 11 శాతం మేర పతనం కాగా.. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టీసీఎస్ స్టాక్స్ కూడా నష్టాలు చవిచూశాయి. దీంతో సూచీలపై ఒత్తిడి పడింది.

**గృహ విక్రయాలపై ఐటీ రంగం ఎఫెక్ట్..**

కృత్రిమ మేధ అన్ని రంగాలకు వేగంగా విస్తరిస్తుండటంతో అంతర్జాతీయంగా పలు కంపెనీలు లేఆఫ్‌లు ప్రకటిస్తున్నాయి. ముఖ్యంగా ఐటీ రంగానికి చెందిన వారిపై ఈ ఎఫెక్ట్ ఎక్కువగా ఉంటోంది. ఇంకోపక్క ఐటీ నియామకాల్లో మందగమనమూ కొనసాగుతోంది. ఇవన్నీ భారత్‌లో గృహ విక్రయాలపై ప్రభావం చూపిస్తున్నాయి. దాంతో ఇళ్లు కొనుగోలు చేసేవారు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఐటీ హబ్‌లుగా పేరున్న హైదరాబాద్, బెంగళూరు, పుణెలో ఈ ప్రభావం ఉందని నైట్ ఫ్రాంక్ ఇండియా తాజాగా గణాంకాలను వెల్లడించింది. 2026 మొదటి త్రైమాసికం (గతేడాది ఇదే సమయంతో పోలిస్తే)లో ప్రధాన ఎనిమిది నగరాల్లో అమ్మకాలు నాలుగు శాతం తగ్గాయి. కొత్తగా నిర్మాణం పూర్తయిన ఇళ్ల అమ్మకాలు రెండు శాతం తగ్గి, 94,855కి చేరాయి. కొవిడ్ మహమ్మారి తర్వాత పుంజుకున్న ఈ రంగం మళ్లీ ఇప్పుడు మందగమనాన్ని చూస్తోందని ఈ గణాంకాలను బట్టి తెలుస్తోంది. నేషనల్ క్యాపిటల్ రీజియన్, పుణెలో మార్కెట్ మరీ బలహీనంగా ఉంది. ఐటీ ఉద్యోగాల్లో కోతలు (మి ఒజీఎనీటటబ), నియామకాల్లో అనిశ్చితి, ఆ ఆర్థిక భారాన్ని భరించగలమో లేదోనన్న ఆందోళన, అంతర్జాతీయ పరిణామాలు కొనుగోలుదారుల సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలను ఈ అంశాలు ప్రధానంగా ప్రభావితం చేస్తున్నాయని నైట్ ఫ్రాంక్ ఇండియా లెక్కలు వెల్లడిస్తున్నాయి. వరుసగా ఐదేళ్ల వృద్ధి తర్వాత ఇలాంటి అనూహ్య పరిణామాలు అనివార్యమేనని ఆ సంస్థ నేషనల్ డైరెక్టర్ అంకితా సూద్ పేర్కొన్నారు. పరిమాణం పరంగా చూసుకుంటే తక్కువే అయినా.. విలువ పరంగా పెరుగుదల ఉందని పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. లావాదేవీల విలువ ప్రతి ఏడాది ఐదు నుంచి ఆరు శాతం పెరుగుతోందని గుర్తుచేశాయి.





# ఎవరీ జాన్ టర్నెస్..

**ఖాళీగా లింక్డ్‌ఇన్ ప్రొఫైల్..!**

ఉద్యోగాలు మారుతూ వేగంగా కెరీర్‌లో మెట్లు పైకెక్కాలని ఎవరికైనా ఉంటుంది. దానికితగ్గట్లే లింక్డిన్ ప్రొఫైల్‌ను అన్ని హంగులతో తీర్చిదిద్దుకొంటారు. కానీ, ఓ వ్యక్తి తాను చేరిన తొలి ఉద్యోగంలోనే 25 ఏళ్లు కొనసాగి.. మరో కంపెనీ మారే ఉద్దేశమే లేదన్నట్లు లింక్డిన్ ప్రొఫైల్‌నే బ్లాంక్‌గా వదిలేశాడు. కానీ, కెరీర్‌లో శరవేగంగా ఎదిగి.. ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత విలువైన రెండో కంపెనీకి సీఈవోగా ఎంపికయ్యాడు. అతడి పేరు జాన్ టర్నెస్..! ప్రపంచవ్యాప్తంగా జాన్ వివరాలు తెలుసుకొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. 15 ఏళ్లు యాపిల్‌కు సేవలు అందించిన టిమ్ ఇప్పుడు సీఈవో స్థానం వీడి.. ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. దీంతో హార్డ్‌వేర్ విభాగం నుంచి వచ్చిన జాన్‌ను సీఈవో పదవి వరించింది. ప్రస్తుతం ఆయన కంపెనీలో హార్డ్‌వేర్ విభాగంలో వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నారు. 2001లో యాపిల్‌లో చేరారు. యాపిల్ మ్యాక్, ఐపాడ్స్, ఎయిర్ పాడ్స్ తయారీలో జాన్ సైంటిఫిక్ బ్రెయిన్ ఉంది. తాను కంపెనీలో చేరి 25 ఏళ్లు పూర్తికానున్నట్లు జాన్ లింక్డిన్ ప్రొఫైల్ చెబుతోంది. అంతకుమించి దానిలో ఏ పోస్టు లేదు. కనీసం ప్రొఫైల్ పిక్చర్ కూడా పెట్టలేదు. యాపిల్‌కు 80% ఆదాయం తీసుకొచ్చే పరికరాలు మొత్తం టర్నెస్ పర్యవేక్షణలోనే తయారవుతాయి. మ్యాక్‌లలో యాపిల్ తన చిప్‌లను అనుసంధానం చేయడంలో టర్నెస్ కీలక పాత్ర పోషించారని చెబుతారు. ఆ తర్వాత మ్యాక్‌ల విక్రయాలు మళ్లీ పుంజుకొన్నాయి. ప్రస్తుతం టర్నెస్ వయసు 50 ఏళ్లు. కంపెనీలో చాలామంది సీనియర్ ఎగ్జిక్యూటీవ్‌ల కన్నా చాలా చిన్నవాడు. టిమ్ కుక్ కూడా సీఈవోగా బాధ్యతలు చేపట్టే నాటికి దాదాపు టర్నెస్ వయసులోనే ఉండేవారు.

**టిమ్ కుక్ ముందుగానే సిగ్నల్స్:** సాధారణంగా కొన్ని నెలల ముందునుంచే యాపిల్ సీఈవోగా టర్నెస్‌ను సిద్ధం చేస్తూ వస్తోంది. కొన్నాళ్లుగా టిమ్ రిటైర్మెంట్‌పై ప్రచారం జోరందుకొంది. అదే సమయంలో టర్నెస్ కంపెనీలోని ఇతర కీలక ఎగ్జిక్యూటివ్‌లతో కలిసి విదేశాల్లో ఆఫీస్‌లకు వెళ్లడం.. అక్కడి బృందాలతో చర్చలు జరపడం మొదలుపెట్టారు. దీంతోపాటు ఐఫోన్17 విడుదల వేళ కూడా ఐఫోన్ ఎయిర్‌ను టర్నెస్ పరిచయం చేశారు. దీంతోపాటు మ్యాక్‌బుక్ నియో కూడా ప్రదర్శించారు. ఇది కూడా టర్నెస్ పర్యవేక్షణలోనే తయారవుతోంది. సాధారణంగా ఇవన్నీ సీఈవో హోదాలో టిమ్ కోసం రిజర్వ్ చేసిన ఈవెంట్లు. కానీ, టర్నెస్ హాజరుతో కంపెనీ ఆయనపై విశ్వాసం ఉంచినట్లు సంకేతాలిచ్చినట్లైంది.

హార్డ్‌వేర్ రేసులో యాపిల్..

టర్నెస్ నియామకంతో యాపిల్ హార్డ్‌వేర్ రంగంపై దృష్టిపెట్టినట్లు సంకేతాలిచ్చింది. వాస్తవానికి స్టీవ్ జాబ్స్‌తో పోలిస్తే కుక్ నాయకత్వంలో కంపెనీ సృజనాత్మకత దెబ్బతిందన్న విమర్శలున్నాయి. వాస్తవానికి కుక్ కొత్త ఉత్పత్తుల రూపకల్పనపై చురుగ్గా వ్యవహరించలేదని విమర్శకులు అంటారు. కానీ, టర్నెస్ మాత్రం స్టీవ్ జాబ్స్ స్థాయిలో కొత్త ఉత్పత్తుల తయారీలో భాగస్వామి అవుతాడని భావిస్తున్నారు. ఆయన బృందం ఐఫోన్17 డిజైన్, అల్ట్రాస్లిమ్ ఐఫోన్ ఎయిర్‌లో పనిచేసింది. ఇక ఫోల్డబుల్ ఫోన్‌ను ఈ టెక్ దిగ్గజం తీసుకురానున్నారన్న ప్రచారం ఇప్పటికే జోరందుకొంది. అదే జరిగితే.. 2007 తర్వాత యాపిల్ తీసుకొచ్చిన అతిపెద్ద మార్పుగా నిలుస్తుంది. 50 వసంతాలు పూర్తి చేసుకొన్న యాపిల్.. ఈ మార్పులతో ఏఐ వంటి కొత్త టెక్నాలజీలపై దృష్టిపెట్టనుందని ఇన్వెస్టర్లు అంచనా వేస్తున్నారు.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.25 | ₹ 5.27 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,42,800 (22 క్యారెట్లు) | ₹ 1,55,780 (24 క్యారెట్లు) |
|---|---|

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,80,000

# ఒక యుద్ధం.. పెనుభారం..

## అమెరికాకు గల్ఫ్‌దేశాల బెయిలవుట్ డిమాండ్
## ట్రంప్ నిష్క్రమణ మార్గంతో ఉక్కిరిబిక్కిరి
## అగ్రరాజ్యంపై ఆర్థిక ఒత్తిడి



**వాషింగ్టన్:** ఇరాన్ యుద్ధం.. అమెరికాపై ముప్పేట భారం మోపేలా కనిపిస్తోంది. ఈ యుద్ధం కారణంగా జరిగిన నష్టాన్ని భరించాలని ఆ దేశంపై ఒత్తిడి వస్తోంది. ఇప్పటికే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) బెయిలవుట్ ప్యాకేజీ డిమాండు చేయగా గల్ఫ్ దేశాలు ఆ బాటలోనే పయనించేందుకు సిద్ధమవుతున్నాయి. మరోవైపు తమ దేశంలో జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని ఇరాన్ డిమాండు చేస్తోంది. ఇక యుద్ధం నుంచి నిష్క్రమణ మార్గం మరింత వ్యయంతో కూడుకున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే యుద్ధం కోసం భారీగా ఖర్చు పెట్టిన అమెరికా.. ఈ డిమాండ్లతో ఇబ్బంది పడాల్సి వస్తుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. యుద్ధానికి సాయం చేయాల్సిందిగా గల్ఫ్ దేశాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కోరతారని వార్తలు వస్తున్న నేపథ్యంలో అవే తిరిగి సాయం కోరడం సంచలన విషయమే. ఈ యుద్ధంవల్ల గల్ఫ్ దేశాల్లో ఒకటైన యూఏఈ తీవ్రంగా నష్టపోయింది. ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులవల్ల దుబాయ్‌లోని ప్రఖ్యాత కట్టడాలతోపాటు, కీలకమైన ఇంధన మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా రోజూ మిలియన్ బ్యారెళ్ల చమురును ఎగుమతి చేసే 'ఫజైరా ఆయిల్ టెర్మినల్' ధ్వంసమైంది. అంతేకాకుండా అమెజాన్ డేటా సెంటర్లపై దాడులు జరగడంతో బ్యాంకింగ్ సేవలు, క్లౌడ్ కంప్యూటింగ్ కార్యకలాపాలు ప్రభావితమయ్యాయి. ఈ నష్టాలతోపాటు యుద్ధం ఎంతకాలం కొనసాగు తుందో అనిశ్చితి నెలకొనడంతో పునర్నిర్మాణానికి సాయం చేయాల్సిందిగా అమెరికాతో యూఏఈ చర్చలు ప్రారంభించింది. యూఏఈ సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ ఖలీద్ మహమ్మద్ బలామా.. అమెరికా ఫెడరల్ రిజర్వుతో 'కరెన్సీ స్వాప్' ఒప్పందం కోసం చర్చలు జరుపుతున్నారు. అంటే అమెరికా.. డాలర్లలో రుణం ఇస్తే యూఏఈ తన సొంత కరెన్సీ దిర్హమ్‌లలో తిరిగి చెల్లిస్తుంది. ఇదే సమయంలో, చమురు లావాదేవీల కోసం డాలర్లకు బదులుగా చైనా కరెన్సీ 'యువాన్'వైపు మళ్లుతామని యూఏఈ సంకేతాలిచ్చింది. ఇది అమెరికాకు పెద్ద తలనొప్పిగా మారింది. ఇదే జరిగితే అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ తన ప్రాముఖ్యతను కోల్పోయే ప్రమాదం ఉంది.

భారీగా అవసరం: యుద్ధం ముగిశాక పౌర భవనాలను, ఇంధన వసతులను పునర్నిర్మించాలంటే భారీగా వ్యయం చేయాల్సి ఉంటుంది. సౌదీ అరేబియా 60 బిలియన్ డాలర్లను ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇందులో చమురు మౌలిక వసతులను పునరుద్ధరించడానికే 50 బిలియన్ డాలర్లను వ్యయం చేయాలి.

**ఇరాన్ డిమాండ్**

అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి గల్ఫ్ దేశాలైన యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఖతార్, జోర్డాన్ యుద్ధంలో పాల్గొన్నాయని ఇరాన్ ఆరోపిస్తోంది. దీనికి పరిహారంగా 270 బిలియన్ డాలర్లు చెల్లించాలని డిమాండు చేస్తోంది. ఇది హర్మూజ్‌లో వసూలు చేసే టోల్‌కు అదనం.

# అధ్యక్షుడిని పక్కనపెట్టి..

## ఖమేనీ చుట్టూ వలయంగా ఏర్పడి..!

టెహ్రాన్: అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో అయతుల్లా ఖమేనీ మృతి చెందగా.. ఆయన కుమారుడు, కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ తీవ్రంగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో యుద్ధరంగంలో పోరాడుతోన్న ఇరాన్‌ను ఎవరు నడిపిస్తున్నారనే ప్రశ్న ఎదురవుతోంది. ఆ దేశానికి అధ్యక్షుడిగా పెజెష్కియాన్ ఉన్నా.. ఆయన చేతుల్లో అధికారం లేదని తెలుస్తోంది. అత్యంత శక్తిమంతమైన ఐఆర్‌జీసీనే పాలన మొత్తాన్ని తన చేతుల్లోకి తీసుకుందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇరాన్‌లో పాలనకు సంబంధించిన కీలక నిర్ణయాలను ఐఆర్‌జీసీ నియంత్రిస్తోందట. అధ్యక్షుడు పెజెష్కియాన్ చేపట్టిన నియామకాలను ఐఆర్‌జీసీ అడ్డుకుంటోందని ఆ కథనాలు రాసుకొచ్చాయి. ఐఆర్‌జీసీ మేజర్ జనరల్ అహ్మద్ వహీద్ ఒత్తిడి కారణంగా నిఘా మంత్రిని నియమించేందుకు అధ్యక్షుడు చేసిన ప్రయత్నం విఫలమైందని పేర్కొన్నాయి. యుద్ధ సమయంలో అన్ని కీలక పదవులకు వ్యక్తులను తామే నిర్ణయిస్తామని వహీద్ పట్టుబడుతున్నారని వెల్లడించాయి. దీంతో ఇరువర్గాల మధ్య రాజకీయ ప్రతిష్ఠంభన నెలకొందని తెలిపాయి. దీంతోపాటు మొజ్తాబా ఖమేనీ చుట్టూ ఈ సైనిక వ్యవస్థ ఒక వలయంలా ఏర్పడిందనే వార్తలు స్థానికంగా కలవరం రేపుతున్నాయి. ఖమేనీని కలిసే మార్గాన్ని కూడా వీరు నియంత్రిస్తున్నారట.

రణమా.. విరమణా?..అమెరికా, ఇరాన్ దారెటు?

ఖమేనీకి చేరాల్సిన ప్రభుత్వ నివేదికల విషయంలోనూ ఐఆర్‌జీసీ తన పట్టు ప్రదర్శిస్తోందని, ఎన్నికైన ప్రభుత్వం నుంచి ఆయన్ను ఏకాకిని చేస్తోందనే వార్తలు వస్తున్నాయి. పెజెష్కియాన్ అత్యవసర సమావేశం కోసం ప్రయత్నించినా.. అది సాధ్యం కాలేదని సమాచారం. అయితే ఈ పరిణామాలను ఆకస్మిక స్వాధీనంగా చూడొద్దని, ఇదొక తిరుగుబాటు అని భావించడం కూడా తప్పే అవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇరాన్ అధికారిక స్వరూపంలో క్రమంగా జరుగుతోన్న మార్పు అని పేర్కొన్నారు. అయితే అతివాదుల నాయకత్వంలోని ఐఆర్‌జీసీ విదేశాంగ విధానంలో కఠినవైఖరి అవలంబించొచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. దాంతో చర్చల్లో పట్టువిడుపులు ప్రదర్శించకపోవచ్చని, సైనిక ఘర్షణలకే మొగ్గుచూపొచ్చనే అభిప్రాయం ఉంది. అదే జరిగితే యుద్ధం ముగింపు ఛాయలు ఇప్పట్లో ఉండకపోవచ్చు..!

**మా శత్రువులకు సాయం చేస్తే ఖబడ్దార్: ఐఆర్‌జీసీ**

తమ శత్రువులకు సహాయం చేసేవారు(గల్ఫ్ దేశాలను ఉద్దేశించి) ఇకపై చమురు ఉత్పత్తి చేయలేనివిధంగా వారిపై దాడులు చేస్తామని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. ఇరాన్‌పై దాడికి అమెరికా, ఇజ్రాయెల్‌కు గల్ఫ్ దేశాలు సహకరిస్తుండటంతోనే ఈ హెచ్చరికలు వచ్చినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.

# మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్‌రావు మృతి

**చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన నేత**

హైదరాబాద్(జనంసాక్షి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు (90) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భాస్కర్ రావు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. 1935 జూన్ 23న గుంటూరులో జన్మించిన నాదెండ్ల భాస్కర్ రావు 1978లో విజయవాడ ఈస్ట్ నుంచి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1978 నుంచి 1989 వరకు ఎమ్మెల్యేగా కొనసాగారు. 1986 ఆగస్ట్ 16 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను పదవీచ్యుతిడిని చేసిన నాదెండ్ల నెలరోజులపాటు సిఎంగా కొనసాగారు. నాదెండ్ల భాస్కర్ రావు మృతిపట్ల సినీ, రాజకీయ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నాదెండ్ల భాస్కర్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ సంతాపం తెలియజేశారు. నాదెండ్ల భాస్కర్ రావు కుమారుడు నాదెండ్ల మనోహర్ ప్రస్తుతం జనసేన పార్టీ తరపున ఏపీ మంత్రిగా సేవలందిస్తున్నారని తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం నాదెండ్ల భాస్కర రావు(90) కన్నుమూశారు. గత నెల రోజులుగా  నాదెండ్ల భాస్కరావు మృతి పట్ల మంత్రి కందుల దుర్గేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'భాస్కరరావు మృతి రాజకీయ రంగానికి తీరని లోటు. ఎంతోమంది నేతలకు రాజకీయ ఓనమాలు నేర్పిన గొప్ప మార్గదర్శి నాదెండ్ల భాస్కర్ రావు. ప్రజా ప్రతినిధిగా భాస్కరరావు చేసిన సేవలు చిరస్మరణీయం.

# ప్రధాని మోదీపై వ్యాఖ్యలు..
## ఖర్గేకు ఈసీ నోటీసులు

న్యూఢిల్లీ(జనంసాక్షి): ప్రధాని మోదీ ఉగ్రవాది అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలను ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించింది. ఈ వ్యాఖ్యలపై 24 గంటల్లో వివరణ ఇవ్వాలని పేర్కొంటూ నోటీసులు జారీ చేసింది. కాంగ్రెస్ నేత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు కేంద్ర మంత్రులు ఫిర్యాదు చేసిన కొన్ని గంటల్లోనే ఎన్నికల సంఘం నుంచి ఈ స్పందన వచ్చింది. తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో గురువారం పోలింగ్ జరగనున్న వేళ కాంగ్రెస్ అధ్యక్షుడికి నోటీసులు రావడం గమనార్హం.

# గేమింగ్ రూల్స్ మే 1 నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ(జనంసాక్షి): నగదుతో ముడిపడిన ఆన్‌లైన్‌గేమ్‌లను నిషేధిస్తూ చట్టం తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం.. తాజాగా నిబంధనలను నోటిఫై చేసింది. గతేడాది పార్లమెంట్ ఆమోదం పొందిన ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్‌ను అమలు చేయడానికి అవసరమైన నిబంధనలను కేంద్రం నోటిఫై చేసింది. ఇవి మే 1 నుంచి అమల్లోకి రానున్నాయి. దీంతో పాటు ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీని ఏర్పాటుచేస్తూ కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. ఏ గేమ్ చట్టబద్ధమైనదో, ఏది కాదో నిర్ణయించే అధికారం ఈ అథారిటీకి ఉంటుంది. రియల్ మనీ గేములు కాకపోతే చాలా వరకు గేములకు తప్పనిసరి రిజిస్ట్రేషన్ చేయాల్సిన అవసరం లేదని ఐటీ సెక్రటరీ ఎస్.కృష్ణన్ తెలిపారు. అయితే, ఈస్పోర్ట్స్ గేములు మాత్రం చట్టంలో పేర్కొన్న ప్రకారం రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఆన్‌లైన్ మనీ గేమా? సోషల్ గేమా, ఈ-స్పోర్ట్సా అని నిర్ధారించుకోవడం అనేది పూర్తిగా ఐచ్ఛికమని పేర్కొన్నారు.

# హోటల్‌లో వస్తువులు దొంగిలిస్తూ..
## బాలిలో పట్టుబడిన భారతీయ టూరిస్టులు

**బాలి:** ఇండోనేసియా బాలిలో ఓ విచిత్ర సంఘటన చోటుచేసుకుంది. ఓ రిసార్టులో పలువురు భారతీయ టూరిస్టులు.. హోటల్ ఖాళీ చేసే సమయంలో అక్కడి వస్తువులను తస్కరించినట్లు తెలిసింది. అనుమానించిన సిబ్బంది.. వారి బ్యాగేజీ తనిఖీ చేయగా వాటిలో హోటల్ గదిలో ఉండే హెయిర్ డ్రైయర్, డోర్‌మ్యాట్, టీవీ రిమోట్, తదితర వస్తువులు లభించడం గమనార్హం. ఇందుకు సంబంధించిన ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

భారత్‌కు చెందిన నలుగురు టూరిస్టులు ఇటీవల బాలిలో గియాన్యర్ ప్రాంతంలో ఉన్న ఓ హోటల్‌లో దిగారు. రెండు, మూడు రోజులు అక్కడే ఉన్న అనంతరం ఏప్రిల్ 19వ తేదీ ఉదయం ఖాళీ చేసేందుకు సిద్ధమయ్యారు. బ్యాగులు సర్దుకొని బయటకు వచ్చేశారు. అదే సమయంలో రూమ్‌లను సిబ్బంది తనిఖీ చేయగా కొన్ని వస్తువులు కనిపించలేదు. వెంటనే అనుమానం వచ్చి.. కారులో నుంచి వీరి బ్యాగులు తీసి తనిఖీ చేయగా బండారం బయటపడింది.

చమురే ఖర్గ్ ద్వీపాన్ని ముంచేస్తుంది.. అమెరికా మంత్రి హెచ్చరికలు

ఆ బ్యాగుల్లో హోటల్‌కు చెందిన టవల్స్, హెయిర్ డ్రైయర్, డోర్ మ్యాట్, డైనింగ్ సామగ్రి, టీవీ రిమోట్ తదితర వస్తువులు చూసి సిబ్బంది కంగుతిన్నారు. ఈ వ్యవహారం యాజమాన్యం దృష్టికి వెళ్లగా.. దీన్ని సామరస్యంగా పరిష్కరించుకునేందుకు మొగ్గు చూపినట్లు తెలిసింది. ఆ వస్తువులను వెనక్కి ఇచ్చిన తర్వాత భారత టూరిస్టులను వెళ్లిపోయేందుకు అంగీకరించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. హోటల్ యాజమాన్యం కూడా పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలిపింది.



# పట్లోళ్ల ఇంద్రారెడ్డి సేవలు ఎప్పటికీ మరువలేనివి

### ఇంద్రారెడ్డి వర్ధంతి బీఆర్ఎస్ నివాళులు, ఆర్టీసీ సమ్మెకు మద్దతు



**రాజేంద్రనగర్, ఏప్రిల్22 (జనంసాక్షి) :** స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రారెడ్డి సేవలు ఎప్పటికీ మరువలేనివని, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ఆయన ఆశయాలను కొనసాగించడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని టిఆర్ఎస్ నాయకుడు సీతారాం దూళిపాల పేర్కొన్నారు. ఇంద్రారెడ్డి 68వ వర్ధంతి సందర్భంగా మణికొండ బీఆర్ఎస్ పార్టీ నాయకులు కౌకుంట్లకు బయలుదేరే ముందు నెక్నంపూర్ పాతశాల వద్ద ఆయన ఆత్మశాంతికై ఒక నిమిషం మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కౌకుంట్ల గ్రామంలోని సమాధి వద్ద నివాళులు అర్పించారు.
ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ఆర్టీసీ ఉద్యోగుల సమ్మెకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. విలీనం, సమాన వేతనాలు, కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, రిటైర్మెంట్ ప్రయోజనాలు, ప్రైవేటీకరణ లేకుండా చర్యలు, కొత్త నియామకాలు వంటి అంశాల్లో పురోగతి లేదని పేర్కొన్నారు. సమ్మె నోటీసు ఇచ్చినా ప్రభుత్వం, లేబర్ కమిషనర్ చర్చలకు ముందుకు రాకపోవడం నిర్లక్ష్యమని, కమిటీ పేరుతో కాలయాపన జరుగుతోందని ఆరోపించారు. గండిపేట ప్రాంతంలోని ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, వారికి బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సీతారం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాద్ రెడ్డి, అందె లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, యాలాల కిరణ్, భాను చందర్, జైరామ్, షేక్ ఆరిఫ్ మొహమ్మద్, సుమనళిని, బాబు రావు, శ్రీనివాస్, శివ, తిరుపతి, నూకల మంజు, శ్యామలేట్ రేఖ, శ్రీను పాల్గొన్నారు. రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి పరిధిలోని బండ్లగూడ జాగీర్ కిస్మత్పూర్ దర్గా కాలేజ్ వద్ద టిఆర్ఎస్ అధ్యక్షుడు రావుల కోళ్ళ నాగరాజు ఆధ్వర్యంలో స్వర్గీయ ఇంద్రారెడ్డి 68వ వర్ధంతి సందర్భంగా టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లలో కార్తీక్ రెడ్డి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు మద్దెల ప్రేమ్ గౌడ్, రవీందర్ రెడ్డి, తలారి పాండు, టింకు రెడ్డి తదితరులు పాల్గొని వర్ధంతి నివాళుల అర్పించారు.

# నూత్‌పల్లి జ్యోతిబాపూలే పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్



**నిజామాబాద్ సిటీ ఏప్రిల్ 22 (జనంసాక్షి) :**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా డొంకేశ్వర్ మండలం నూత్ పల్లి గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం సందర్శించారు. స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్, డార్మెటరీ, తరగతి గదులు తదితర వాటిని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని పరిశీలన జరిపారు. మౌలిక వసతులు, అందుబాటులో ఉన్న సదుపాయాల గురించి ఆరా తీశారు. స్థానికంగా విద్యార్థులకు పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఈ పాఠశాలను ఆర్మూర్ పట్టణానికి తరలించే ప్రతిపాదనకు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి కూడా ఆమోదం ఉందని నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో కలెక్టర్ ఆర్మూర్ పట్టణంలోని ప్రతిపాదిత భవనాన్ని సైతం క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలన చేశారు. ప్రస్తుతం నూత్ పల్లిలో ఉన్న భవనం కంటే ఇది సౌకర్యవంతంగా ఉంటుందని అధికారులు తెలుపగా, అవసరమైన మరమ్మతులు జరిపించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఆర్మూర్ లోని నూతన భవనంలో పాఠశాలను మారుస్తున్న విషయం గురించి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తెలియజేస్తూ, వచ్చే విద్యా సంవత్సరంలో పూర్తి స్థాయిలో ప్రవేశాలు జరిగేలా చొరవ చూపాలని అన్నారు. అంతకు ముందు కలెక్టర్ 5వ తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో భేటీ అయ్యారు. ఆంగ్లం, గణితం, తెలుగు సబ్జెక్టులపై ప్రశ్నలు వేసి, విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేశారు. చక్కగా సమాధానాలు చెప్పిన విద్యార్థులకు బహుమతులు, చాక్లెట్లు అందించారు. అల్పాహారం, భోజనం రుచికరంగా ఉంటోందా? అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. చక్కగా చదువుకోవాలని హితవు పలికారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ఆర్.సీ.ఓ సత్యనాథ్ రెడ్డి, ఆర్మూర్ తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

# వేసవి వేడిని తట్టుకునేందుకు ప్రత్యేక కిట్స్ పంపిణీ

### పోలీసుల సేవలను కొనియాడిన డీఎస్పీ నర్సింగ్ యాదయ్య

**తాండూరు ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** వేసవి కాలంలో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని విధుల్లో నిమగ్నమైన ఉన్న ట్రాఫిక్ పోలీసులకు లయన్స్ క్లబ్ తాండూర్ ఆధ్వర్యంతమైన సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ తాండూర్ అధ్యక్షులు ఆర్. శరత్ బసప్ప ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి టెంపరేచర్ వాటర్ బాటిల్స్, కూలింగ్ గ్లాసెస్, క్యాప్స్ వంటి అవసరమైన వస్తువులతో కూడిన కిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ నర్సింగ్ యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై లయన్స్ క్లబ్ సభ్యుల సేవా భావాన్ని ప్రశంసిస్తూ, ఎండలో పనిచేస్తున్న పోలీసులకు ఈ కిట్స్ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రజల భద్రత కోసం కష్టపడుతున్న సిబ్బందిని గుర్తించి సహాయం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పట్టణ సీఐ పరమేశ్వర గౌడ్, రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, వివిధ మండలాల ఎసిఐలు, లయన్స్ క్లబ్ తాండూర్ అధ్యక్షులు ఆర్. శరత్ బసప్ప, కోశాధికారి గౌరీ శంకర్, సభ్యులు సల్ల దామోదర్, ఓం ప్రకాష్ సోమని, వై. బసప్ప, గులి శివకుమార్, సంగప్ప తదితరులు పాల్గొన్నారు. ఈ సేవా కార్యక్రమం ద్వారా లయన్స్ క్లబ్ తాండూర్ సమాజానికి తమ బాధ్యతను మరోకసారి చాటిచెప్పింది



# వడ్లు అమ్మి వస్తుండగా మృత్యువు కబళించిన వైనం

### నల్లగొండ రోడ్డుపై నెత్తురోడిన రహదారి: ముగ్గురు మృతి, ముగ్గురికి గాయాలు

**గుర్రంపోడ్, ఏప్రిల్ 22: (జనంసాక్షి) :** గుర్రంపోడు మండల పరిధిలోని శాంతినగర్ సమీపంలో బుధవారం చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఈ ఘటనలో మరో ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. సంఘటన వివరాలు: పోలీసుల కథనం ప్రకారం.. కనగల్ మండల కేంద్రానికి చెందిన నర్సింగ్ మధుబాబు (38), నర్సింగ్ ధనంజయ (55)లు మల్లెపల్లి మండలం గుమ్మడవెల్లి మిల్లులో వడ్లు అమ్ముకుని, ఆ సొమ్ముతో బైక్‌పై తిరిగి వస్తున్నారు. అదే సమయంలో శాంతినగర్ గ్రామానికి చెందిన మారెడ్డి బాల్ రెడ్డి (65), తన భార్య హలియమ్మ మరియు ఇతర బంధువులతో కలిసి నల్లగొండలో ఒక శుభకార్యానికి వెళ్లి కారులో తిరిగి వస్తున్నారు. శాంతినగర్ సమీపానికి చేరుకోగానే, అతివేగంగా వచ్చిన కారు ఎదురుగా వస్తున్న బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు బైక్‌పై ఉన్న మధుబాబు, ధనంజయలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారులో ప్రయాణిస్తున్న బాల్ రెడ్డి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. కారులో డ్రైవర్‌తో పాటు ప్రయాణిస్తున్న హలియమ్మ, వెంకమ్మ, మంజులకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే కారు డ్రైవర్ జైపాల్ రెడ్డి అక్కడి నుండి పరారయ్యాడు. ఎస్ఐ ఎన్. వెంకన్న సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు.

# కరీంనగర్‌లో బీఆర్ఎస్ శ్రేణుల సంబరాలు

### హైకోర్టు తీర్పుకు స్వాగతం



**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన జస్టిస్ పీసీ ఘోష్ నివేదికపై హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ కరీంనగర్‌లో బీఆర్ఎస్ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. నగరంలోని తెలంగాణ చౌక్ వద్ద కార్యకర్తలు టపాసులు కాల్చి, ఒకరికొకరు స్వీట్లు పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై తీర్పును స్వాగతిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన బీఆర్ఎస్ నేతలు, హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటి దని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాజకీయ కుట్ర పూరితంగా జస్టిస్ పీసీ ఘోష్ కమిటీని ఏర్పాటు చేసిందని ఆరోపించారు. ఆ నివేదిక పూర్తిగా తప్పుల తడకగా ఉందని, కోర్టు కూడా అదే విషయాన్ని గుర్తించిందని తెలిపారు. అలాగే తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు స్పష్టం చేయడం సత్యానికి గెలుపు అని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అనవసర ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరిగిందని అన్నారు. హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చే అవకాశముందని భావించి, గత రెండున్నరేళ్లుగా కాళేశ్వరం ప్రాజెక్టును పట్టించుకోకుండా, రిపేరింగ్ పేరుతో ప్రభుత్వం హడావుడి సృష్టించిందని విమర్శించారు. ఈ తీర్పుతో నిజం బయటపడిందని, బీఆర్ఎస్ నాయకత్వంపై ప్రజలకు మరింత నమ్మకం పెరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు

# మద్యానికి బానిసై యువకుని ఆత్మహత్య

**చిగురుమామిడి ఏప్రిల్22 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో యువకుని ఆత్మహత్య పోలీసుల కథనం ప్రకారం చొప్పదండి అభిలాష్ o/శీ చక్రపాణి,అనే యువకుడు వయస్సు 22 సంవత్సరాలు, చిరుగుమామిడి నివాసి.అనే వ్యక్తి ఇంటర్ మొదటి సంవత్సర చదివి ఇంటి వద్దే ఉంటూ వెల్డింగ్ పనులకు వెళ్తుండేవాడు.నెల రోజులుగా ఎలాంటి పనులు చేయకుండా తిరుగుతూ మద్యపానం చేయడం అలవాటు చేసుకున్నాడు.కుటుంబ సభ్యులు మందలించినప్పటికీ తన ప్రవర్తనలో మార్పు రాలేదు.మంగళవారం రాత్రి 8:00 గంటల సమయంలో మద్యం సేవించి ఇంటికి వచ్చాడు.ఈ సందర్భంగా అతని తండ్రి ఎందుకు అధికంగా మద్యం సేవిస్తున్నావని మందలించగా, దానిని మనసులో పెట్టుకుని క్షణిక ఆవేశంలో మద్యానికి బానిస అయిన అతడు జీవితంపై విరక్తి చెంది, మంగళవారం రాత్రి 8:00 బుధవారం ఉదయం సుమారు 5:00 గంటల మధ్యకాలంలో గొల్లపల్లి తిరుపతయ్య,చింతి రెడ్డి రాజశేఖర్ రెడ్డి వారి పొలం గట్టు పై ఉన్న వేప చెట్టుకు చీరతో ఉరి వేసుకుని మరణించాడు.మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయబడిందని ఎస్ఐ పృథ్వీధర్ తెలిపారు.

# పాత పెన్షన్ విధానం కొనసాగించాలి



పెన్షనర్స్ అసోసియేషన్స్

**ముషీరాబాద్, ఏప్రిల్ 22 (జనం సాక్షి):** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వాల్యుయేషన్ బిల్లుతో భవిష్యత్తులో పెన్షన్ పెరుగుదలకు అడ్డంకులు ఏర్పడే అవకాశం ఉందని, 2026 తర్వాత పెన్షన్ వ్యవస్థను విభజించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ పాత పెన్షన్ విధానాన్నే కొనసాగిం చాలని నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్, ఫోరమ్ ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమయ్య అధ్యక్షతన నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్, ఫోరమ్ ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర పెన్షనర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంఎన్ రెడ్డి, సోమయ్య, జనార్దన్ రెడ్డి, పాలకుర్తి కృష్ణమూర్తి, కే. సత్యనారాయణ, ముత్తన్న తదితరులు పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా పెన్షన్ హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పెన్షన్ ఆక్టిపై ప్రమాదకరమైన ధ్రువీకరణ నిబంధనలను తొలగించాలని, కొత్త పెన్షన్ విధానాలను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈపీఎస్-95 పెన్షన్‌ను కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల తరహాలో సవరించాలని, నాలుగు లేబర్ కోడ్లను ఎత్తివేయాలని, ఎనిమిదవ వేతన సంఘం తిరోగమన నిబంధనలను సవరించాలని, బ్యాంకు పెన్షనర్ల పెన్షన్‌ను అప్డేట్ చేయాలని కోరారు. అలాగే పెన్షన్ కమ్యూటేషన్ రికవరీ కాలాన్ని 10 సంవత్సరాల 8 నెలలకు తగ్గించాలని, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సుల ప్రకారం అదనపు పెన్షన్ మంజూరు చేయాలని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలకు సమస్యలను తెలియజేస్తున్నామని తెలిపారు.

# ఆర్టీసీ సమ్మె సమయంలో హింసకు పాల్పడితే కఠిన చర్యలు

- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ
- ఉద్యోగానికి వచ్చే డ్రైవర్లు, కండక్టర్లకు పూర్తి భద్రత

**గోదావరిఖని, జనంసాక్షి :** తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి మంచిర్యాల జోన్ పరిధిలో శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా దాడులు, బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమ్మె సమయంలో విధుల్లో చేరేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న ప్రైవేట్ డ్రైవర్లు, కండక్టర్లు, అలాగే బస్సుల యజమానులను లక్ష్యంగా చేసుకుని కొందరు వ్యక్తులు దాడులు చేయడం, బెదిరింపులకు పాల్పడడం, ఇళ్లపై దౌర్జన్యాలకు దిగడం వంటి ఘటనలను పోలీసులు అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి చర్యలు చట్ట విరుద్ధమని, పాల్గొన్న ప్రతి ఒక్కరిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించబడతారని హెచ్చరించారు. ప్రజలు ఎవరూ భయపడకుండా తమ విధులు నిర్వర్తించాలనీ, ఉద్యోగం కోసం వచ్చే వారికి పూర్తి రక్షణ కల్పిస్తామని పోలీసులు భరోసా ఇచ్చారు. ఎవరైనా బెదిరింపులు, దాడులకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర సహాయం కోసం రామగుండం పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్: 87126 56597, డయల్ 100 కాల్ చేయండి అని తెలిపారు. పోలీసులు ఎల్లప్పుడూ ప్రజల రక్షణ కోసం సిద్ధంగా ఉన్నారని, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే వారిని ఏమాత్రం ఉపేక్షించబోమని కమిషనర్ తెలిపారు.

# కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి

**ముషీరాబాద్, ఏప్రిల్ 22 (జనం సాక్షి):**
కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని మరోసారి బట్టబయలు చేసిందనీ, భారీ అవినీతి జరిగినట్లు ఆధారాలు ఉన్నప్పటికీ వాటిని చట్టపరంగా సమర్థవంతంగా కోర్టు ముందు ప్రవేశపెట్టడంలో రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందనీ కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా తగిన ఆధారాలను సమర్పించలేకపోవడం వల్ల, కమిషన్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యల విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వ నిర్లక్ష్యానికి, అసమర్థతకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీ మాటల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదని మరోసారి నిరూపితమైంద న్నారు. రాష్ట్ర హైకోర్టు తీర్పు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటి దనీ చెప్పారు. అధికారంలోకి రాగానే.. కేసీఆర్, వారి కుటుంబ సభ్యులు, మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన అవినీతిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి పెద్ద పెద్ద హామీలు ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తికావొ స్తున్నా.. ఏ ఒక్క అవినీతి, అవకతవకలపై సమగ్ర దర్యాప్తు చేపట్టలేదు, చర్యలు తీసుకోలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం వెంటనే.. అవినీతి కేసుల్లో చట్టబద్ధమైన, పారదర్శకమైన చర్యలను ప్రారంభించాలనీ, హైకోర్టు తీర్పు నేపథ్యంలో.. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఎన్నికల హామీలు ఎందుకు అమలు కాలేదు? అవినీతి కేసుల్లో చర్యలు ఎందుకు ఆలస్యమవుతున్నాయి? లేక మీ పార్టీ ప్రభుత్వం, బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి ప్రభుత్వాలే కాబట్టి.. దొంగలు, దొంగలు కలిసి తెలంగాణను దోచుకోవడం లో పోటీపడుతూ.. రాష్ట్రాన్ని నాశనం చేయాలని అనుకుంటున్నారా? అనే అంశాలపై ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంతవరకు.. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో వేల కోట్ల రూపాయల అవినీతి, ఫార్ములా వన్ రేస్ పేరుతో జరిగిన ఖర్చులు, డ్రగ్స్ కేసు, భూఆక్రమణలు, భూకేటాయింపులు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలలో అవినీతి, అక్రమాలు జరిగాయని.. అవినీతి సొమ్మును కక్కిస్తానని పదే పదే సీఎం ప్రకటించినప్పటికీ వాటిపై ఒక్కటంటే ఒక్క చర్యకూడా తీసుకోలేదనీ అన్నారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులపై.. రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోకపోవడానికి కారణం, రెండు పార్టీల మధ్య ఉన్న దోస్తీయేనన్నారు. ప్రజాక్షేత్రంలో ఈ రెండు పార్టీలు 'డూప్ ఫైటింగ్' చేస్తూ.. 'నేను గిచ్చినట్లు చేస్తా, నువ్వు ఏడ్చినట్లు చెయ్యి' అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయన్నారు. తెలంగాణ ప్రజలను రెండు పార్టీలు మోసం చేస్తున్నాయి. తెలంగాణ ప్రజలు కేసీఆర్ అవినీతి పాలన నుంచి విముక్తి కోసం.. మార్పు కావాలని ఓటేశారు. కానీ రేవంత్ సర్కార్.. హామీలను మాటలకే పరిమితం చేస్తూ.. అవినీతికి పాల్పడిన వ్యక్తులను వదిలేస్తున్నారు. గత రెండున్నరేళ్లుగా రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నకాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ.. తెలంగాణ ప్రజాధనాన్ని అడ్డగోలుగా దోచుకు ంటోంది కాబట్టి.. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అక్రమాలపై చర్యలకు వెనుకాడుతోంది. ఇది రేవంత్ రెడ్డి పరిపాలనా వైఫల్యం, ఇచ్చిన హామీలను విస్మరించి తెలంగాణ ప్రజలకు చేస్తున్న రాజకీయ ద్రోహం అని అన్నారు.

# దళారి వ్యవస్థను నిర్మూలించేందుకే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు..

**చిగురుమామిడి ఏప్రిల్ 22(జనంసాక్షి):** ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులు దళారీల బారినపడి నష్టపోవద్దనే లక్ష్యంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని,కొనుగోలు సెంటర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంతోపాటు 8గ్రామాల్లో బుధవారం సింగిల్ విండో సొసైటీ,ఐకెపి,డీసీఎంస్ ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన,వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పండుగ వాతావరణంలో ఆయా గ్రామాల సర్పంచులతో కలిసి చైర్మన్ తిరుపతిరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర 2389రూపాయలను పొందాలని వారు కోరారు. సుందరగిరి, ఓగులాపూర్, గాగిరెడ్డిపల్లె, ఉల్లంపల్లి, సీతారాంపూర్,చిగురుమామిడి, రేకొండ, నవాబుపేట, తదితర గ్రామాల్లో సెంటర్లను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్ విజయ్ కుమార్,సింగిల్ విండో ఇంచార్జ్ వనజ,వ్యవసాయ శాఖ మండల అధికారి తాటిపెల్లి పున్నం చందర్ రెడ్డి,సర్పంచులు జంగ శిరీష వెంకటరమణారెడ్డి,అకవరం భవాని,గోగురి లక్ష్మీ మురహరిరెడ్డి,సన్నీళ్ళ కవిత వెంకటేశం,అలువాల శంకర్, గడ్డం రమాదేవి శ్రీనివాస్ రెడ్డి, గూళ్ల రాజు రజిత,అల్లెపు సంపత్,డైరెక్టర్ ఓరుగంటి భారతీదేవి,కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గీకురు రవీందర్, జిల్లా కార్యదర్శి సాంబారి బాబు,చిట్టుమల్ల రవీందర్,ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి,పోటు మల్లారెడ్డి,బొమ్మగాని వెంకటేశం గౌడ్,సెంటర్ ఇన్చార్జీలు గట్టు ప్రశాంత్,మాజీసర్పంచ్ శ్రీమూర్తి రమేష్, పాల్గొన్నారు.

# ఆహార కల్తీపై సైబరాబాద్ ఎన్ఫోర్స్మెంట్ వింగ్ దాడులు



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :**
ఆహార కల్తీపై దేశం అట్టుడుకుతున్న సమయంలో ఎట్టకేలకు సైబరాబాద్ విజిలెన్స్ అధికారులు కళ్ళు తెరిచారు. భారతదేశంలోనే అత్యధిక ఆహార కల్తీ జరుగుతున్న రాష్ట్రంగా పేరుగాంచిన తెలంగాణలో తీరా తెల్లారాక కళ్ళు తెరిచినట్టుంది వ్యవహారం. మొత్తానికి లేటుగానైనా అధికారులు ముసుగుదుప్పటిని పక్కన పెట్టి కల్తీ ఆహారం విషయంలో కొంత ముందడుగు వేయడం మంచిదే. ఈ క్రమంలో కమిషనరేట్ పరిధిలో ఆహార కల్తీ మరియు అక్రమ ఆహార తయారీ కార్యకలాపాలను అరికట్టడానికి, సైబరాబాద్ ఎన్ఫోర్స్మెంట్ వింగ్ ఈ ఏడాది జనవరినుండి మంగళవారంవరకు పలు ప్రాంతాలలో కొంతమేర దాడులు నిర్వహించింది. ఈ ఆపరేషన్లలో భాగంగా ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు కలిగించే వివిధ నేరాలకు పాల్పడిన వ్యక్తులపై 22 కేసులు నమోదు చేసి 28 మందిని ఎన్ఫోర్స్మెంట్ వింగ్ అదుపులోకి తీసుకోవడం జరిగింది. బేకరీ ఉత్పత్తులు, స్వీట్లు, నమ్కీన్ తదితర తినుబండారాలు, వంట నూనెలు, గోధుమ పిండి, అల్లం-వెల్లుల్లి పేస్ట్, మాంసం ఉత్పత్తులు, ఐస్ క్రీములు, సాస్‌లు, వంట నూనెను మార్చిమార్చి అక్రమంగా పునర్వినియోగించడం వంటి వాటిపై సైబరాబాద్ కమిషనరేట్ ఇన్ ఫోర్స్ వింగ్ ప్రత్యేక దృష్టిని సారించినట్లు విశ్వాసనీయ సమాచారం. దాడులు కొనసాగించిన ప్రతి ప్రాంతంలో ఎన్నో ఉత్పత్తులు గడువు ముగిసిన తర్వాతసైతం సింథటిక్ ఫుడ్ కలర్స్, మరియు అసురక్షిత రసాయనాలను ఉపయోగిస్తున్నట్లు తమ విచారణలో తేలిందని విజిలెన్స్ అధికారులు వివరిస్తున్నారు. చాలా సందర్భా లలో సరైన ఎఫ్ఎస్ఎస్ఏఐ లేదా వాణిజ్య లైసెన్సులు లేకుండా అత్యంత అపరిశుభ్రమైన పరిస్థితులలో ఆహార పదార్థాలను తయారుచేసి నిల్వ చేయడం జరుగుతుంద ని, ఇది నిజంగా ఆందోళన కలిగించే అంశమని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు.. నిల్వ చేస్తున్నారు. వంట నూనె మరియు గోధుమ పిండిలో భారీ స్థాయిలో కల్తీకి సంబంధించిన ఒక కీలక కేసులో 5 వేల 26 లీటర్లకు పైగా నూనె, 5 వేల 192 కిలోగ్రాముల గోధుమ పిండిని జప్తు చేయడం జరిగిందన్నారు. హానికరమైన నిల్వచేసే పదార్థాలు, నకిలీ బ్రాండింగ్‌ను ఉపయోగించి అల్లం-వెల్లుల్లి పేస్ట్‌ను ఉత్పత్తి చేస్తున్న అక్రమ తయారీ యూనిట్లనుకూడా తాము స్పష్టంగా గుర్తించడం జరిగిందని, వారి పైన కూడా అత్యంత కఠినమైన చర్యలకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ వింగ్ దాడులలో భాగంగా దాదాపు 64.07 లక్షల విలువైన కల్తీ ఆహార పదార్థాలు, యంత్రాలు మరియు వాహనాలను తమ స్వాధీనంలోకి తీసుకోవడం జరిగిందని అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా అధికారులు ప్రజలకు పలు సూచనలను చేస్తూ ఆహార పదార్థాలను లైసెన్స్ ఉన్న విక్రేతల నుండి మాత్రమే కొనుగోలు చేయాలని, గడువు తేదీలను తనిఖీ చేయాలని, మరియు ఏదైనా అనుమానాస్పద కార్యకలాపా లను పోలీసులకు మరియు ఆహార భద్రతా విభాగానికి చేరవేయాలని కోరారు. సైబరాబాద్ పోలీసులు ఆహార భద్రతను నిర్ధారించడానికి మరియు ప్రజారోగ్యాన్ని పరిరక్షించడానికి తాము కట్టుబడి ఉన్నామని, ఆహార కల్తీకి పాల్పడే దుర్మార్గులపై కఠిన చర్యలు చేపట్టడంలో వెనుకాడే ప్రసక్తే లేదని వివరించారు. కొనసాగుతాయి.

# మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సిఎస్ఆర్ స్కాలర్‌షిప్స్



### ప్రారంభించిన ఐటీ శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు

**ముషీరాబాద్, ఏప్రిల్ 22 (జనం సాక్షి):** విజయం సాధించగల సామర్థ్యం ఉండి తమ చదువులను కొనసాగించడానికి ఆర్థిక సహాయం అవసరమైన విద్యార్థు లకు మద్దతు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్న మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సిఎస్ఆర్ స్కాలర్షిప్స్ కార్యక్ర మాన్ని కొనసాగిస్తుంది. ఈ మేరకు బుధవారం ఆర్టిసి కళాభవన్లో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ యొక్క సిఎస్ఆర్ స్కాలర్షి ప్స్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు హాజరై ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు ఆవిష్కరణల ఆధారిత రంగాలలో తెలంగాణ పురోగమిస్తున్న తరుణంలో పురోగతికి తోడ్పడే విద్యా పునాదుని బలోపేతం చేయడం కూడా ముఖ్యమన్నారు. ఇటువంటి ప్రయత్నాలు రాష్ట్రం యొక్క విస్తృత అభివృద్ధి ప్రయాణంలో ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా చేయ డం ద్వారా సమ్మిళిత అభివృద్ధికి పరిస్థితులు కల్పించడంలో సహాయపడతా యన్నారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ సంస్థ ఇండియా ఆపరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆషర్, రిటైల్ హెడ్ సిరాజ్, జోనల్ హెడ్ షరీజ్ లు మాట్లాడుతూ.. సంస్థ ప్రకటించిన 200 కోట్ల సిఎస్ఆర్ నిధులు కేటాయింపు లో భాగంగా తెలంగాణలోని 550 మంది విద్యార్థులకు 2026 27 సంవత్సరానికి గాను 4.55 కోట్ల విలువైన స్కాలర్షిప్లను పంపిణీ చేస్తుందన్నారు. ఈ సంస్థకు ఉన్న దీర్ఘకాలిక దృష్టి ద్వారా ఇప్పటికే 18 లక్షల మందికి ప్రయోజనం చేకూర్చిందని గత కొన్నేళ్లుగా 1.15 లక్షల మందికి పైగా విద్యార్థులకు 100 కోట్లకు పైగా స్కాలర్షిప్ సహాయం అందించిందని దేశ వ్యాప్తంగా 33000 మంది బాలిక విద్యార్థులకు స్కాలర్షిప్లను కేటాయి ంచిందన్నారు.
సంస్థ లక్ష మందికి పైగా విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో ఈ నెట్వర్క్ ను 2500 కేంద్రాలకు విస్తరించాలని యోచిస్తోందనీ చెప్పారు. ఆరోగ్యం మహిళా సాధికారత విద్యా పర్యావరణ రంగాల్లో ఈ సంస్థ చేపట్టిన విస్తృత సిఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా థనల్, ప్రతం వంటి సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకొని ఈ కార్యక్రమాలను అమలు చేస్తుందనీ చెప్పారు. హైదరాబాద్లోని తెలంగాణ స్కాలర్షిప్ కార్యక్రమం తో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రాంతీయ మార్కెట్లో విద్యపై దృష్టి సాధించి తమ సిఎస్ఆర్ ప్రయత్నాలను బలోపేతం చేస్తున్న ఉందని విద్యార్థులకు నిర్మాణాత్మక స్థిరమైన మద్దతును అందిస్తోందన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
23 ఏప్రిల్ 2026



# నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు

**రోడ్డెక్కిన అద్దె బస్సులు.. పోలీసులతో వాగ్వాదానికి దిగిన కార్మికులు**

**అర్హత గల డ్రైవర్లు కావలెను.**
రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు సమ్మె నిర్వహిస్తున్న క్రమంలో వేములవాడ డిపోలో డ్రైవర్, కండక్టర్ గా తాత్కాలిక విధులు నిర్వహించేందుకు ఆసక్తి కలవారు వేములవాడ డిపోలో కలవాలని డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు.డ్రైవర్ అర్హత హెవీ లైసెన్స్ ఉండి 18 నెలల అనుభవం కలిగి ఉండాలని,ఒరిజినల్ లైసెన్స్, ఆధార్ కార్డ్స్,2 ఫొటోస్ కావాలని, కండక్టర్ అర్హత ఎస్ఎస్సి పాస్ అయి ఉండాలని, ఒరిజినల్ ఎస్ఎస్సి మెమో,ఆధార్ కార్డ్స్, 2 ఫొటోస్ తో, వేములవాడ బస్సు డిపోలో సంప్రదించ న్నారు. డ్రైవర్‌కు రోజుకు రూ వేయి, కండక్టర్ రోజుకు రూ 800 సమస్త చెల్లిస్తుందన్నారు.మిగతా వివరాలకు ఈ క్రింది సెల్ నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. 9959225926, 9440521412, 7396888639

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** తెలంగాణ ఆర్టీసీ కార్మికుల జేఏసీ పిలుపు మేరకు బుధవారం వేములవాడ లో సమ్మె ప్రారంభమైంది. డిపో లోని బస్సులన్నీ నిలిచిపోయాయి. అద్దె బస్సులను డిపో నుండి తీసేందుకు ప్రయత్నించగా ఆర్టీసీ కార్మికులు పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో కొంత ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ సమ్మెతో వేములవాడ డిపోలో బస్సులు ఎక్కడికెక్కడ నిలిచిపోయాయని, తెల్లవారు జామున ఆర్టీసీ కార్మికులు డిపో ముందు నిరసన వ్యక్తం చేస్తూ, డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ జేఏసీ అధ్యక్షుడు జిపి సింగ్ మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చి 45 రోజులు అవుతున్న ప్రభుత్వం నుండి స్పందన లేకపోవడంతో తప్పని పరిస్థితిలో సమ్మెకు దిగామన్నారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత,మేనిఫెస్టోలో ఉన్న డిమాండ్లను పరిష్కరించాలని కోరుతున్న ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని, తప్పని పరిస్థితుల్లో సమ్మెకు దిగామని, ఇప్పటికైనా తమకు రావలసిన పిఆర్సిని, పెండింగ్ బకాయిలను చెల్లించి, 32 న్యాయమైన డిమాండ్లను తీర్చాలని డిమాండ్ చేశారు.

**పోలీసులకు కార్మికుల మధ్య వాగ్వివాదం.**
వేములవాడలో ఆర్టీసీ కార్మికులు చేపడుతున్న సమ్మె సందర్భంగా పోలీసులకు ఆర్టీసీ కార్మికులకు వాగ్వాదం చోటుచేసుకుంది.అద్దె బస్సులను ఆర్టీసీ డిపో నుండి బయటకు వెళ్లకుండా కార్మికులు అడ్డుకొని నిరసన తెలపడంతో పోలీసులు వారిని వారించారు అద్దె బస్సులను బయటకు వెళ్లనియాలని అడ్డుకోవడానికి వీలు లేదన్నారు.దీంతో ఆర్టీసీ డిపో వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఉదయాన్నే ఆర్టీసీ కార్మికులు డిపో వద్దకు చేరుకొని బస్సులు బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు.బస్ డిపో వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు.అయితే తమ న్యాయమైన 32 డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆ ధోరణి సరికాదన్నారు ప్రభుత్వం కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు.

# విద్యార్థి దశలో కష్టపడితే జీవితమంతా సుఖ సంతోషాలే!

- మంథని పేరును విశ్వవ్యాప్తం చేయాలి
- మంథని మున్సిపల్ ఛైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్
- ఉన్నత మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించిన మున్సిపల్ పాలకవర్గం



**మంథని, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** విద్యార్థి దశలో ఏకాగ్రతతో ఇష్టపడి చదువుకుంటే, జీవితమంతా సంతోషమయంగా ఉంటుందని మంథని మున్సిపల్ ఛైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ అన్నారు. మంథని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదివి అత్యధిక మార్కులు సాధించి కళాశాల స్థాయిలో ప్రథమ ద్వితీయ ర్యాంకులు సాధించిన గుండోజు శ్రీజ, పెండ్యాల శ్రీనిధి, ప్రైవేట్ కాలేజీలో చదివిన కొండ్ర అశ్విత్ గౌడ్ లను మంథని మున్సిపల్ పాలకవర్గం తరపున మంథని మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాలకమండలి సభ్యులు అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యను ఆయుధంగా మల్చుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని హితవు పలికారు. ఉన్నత చదువులు చదివేందుకు, జీవితంలో స్థిరపడేందుకు ఇంటర్మీడియట్ రెండవ మెట్టు అని అన్నారు. ఆరంభంలోనే తప్పటడుగు వేస్తే అది భవిష్యత్తును దెబ్బతీస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రణాళికాబద్ధంగా వార్షిక పరీక్షలకు,పోటి పరీక్షలకు అన్ని విధాలా సంసిద్దులు కావాలని సూచించారు. ఇదివరకటితో పోలిస్తే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అనేక వసతులు అందుబాటులోకి వచ్చాయని, ప్రభుత్వం కూడా పేద విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని అనేక విధాలుగా తోడ్పాటును అందిస్తోందన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలన్నారు. ఇతర వ్యాపకాల వైపు దృష్టి పడకుండా విలువైన సమయాన్ని చదువుకోవడానికి కేటాయించాలన్నారు. మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో మంథని నియోజకవర్గం సరస్వతీ నిలయంగా మారిందన్నారు. గుండోజు శ్రీజ, పెండ్యాల శ్రీనిధి,కొండ్ర అశ్విత్ గౌడ్ లు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు సాధించి మంథని పేరును విశ్వవ్యాప్తం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఎన్ మనోహర్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పాలక సభ్యులు నూకల కమల్, మాచిడి రాజు గౌడ్, మద్దికట్ల స్రవంతి, పోతరబోయిన శ్రీలత, మారుపాక నిహారి క, పెంటరి రాజు, వేముల లక్ష్మి, యేల్లంకి వంశీధర్, విద్యార్థుల తల్లిదం డ్రులు పెండ్యాల రామ్ కుమార్, గుండోజు భాస్కర్, కొండ్ర నాగరాజులు పాల్గొన్నారు.

# సుడా పనులపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం

- పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేసి కొత్త పనులకు టెండర్లు ఖరారు చేయాలని అధికారులను ఆదేశించిన
- సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ ప్రఫుల్ దేశాయ్



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేసి కొత్త పనులకు టెండర్లు ఖరారు చేయాలని అధికారులను ఆదేశించి, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ ప్రఫుల్ దేశాయ్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వివిధ కారణాలతో పెండింగ్ లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని, కొత్త పనులకు టెండర్లు పిలవడానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. సుడా కమర్షియల్ బిల్డింగ్ మొదటి విడత పనులు చివరి దశకు వచ్చాయని ఆది పూర్తి కాగానే మిగతా పనులకు టెండర్లు పిలవాలని, రాజీవ్ చౌక్ లో నూతనంగా ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ కాంస్య విగ్రహం, రాజీవ్ చౌక్ సుందరీకరణ పనులు ఐడిఎస్ఎంటి, వర్టికల్ గార్డెన్లు తదితర పనులను మే 21 లోగా పూర్తి చేయాలని మే 21 న రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ముఖ్య అతిథులచే ప్రారంభించు కుందామని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ శివానంద్, డిఈఈ లు రాజేంద్ర ప్రసాద్, వెంకటేశ్వర్లు ఎఈఈ లు సతీష్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో పనులు పూర్తి చేయాలి

**కాంట్రాక్టర్లు, అధికారులను కోరిన అదనపు కలెక్టర్ అరుణ శ్రీ**



**గోదావరిఖని, జనంసాక్షి :** నాణ్యతతో సకాలంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను, అధికారులను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జె. అరుణ శ్రీ ఆదేశించారు. బుధవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో అభివృద్ధి పనుల పురోగతిపై కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్తయిన పనులను సకాలంలో రికార్డు చేసి బిల్లుల చెల్లింపులో కూడా జాప్యం జరగకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. . పెండింగ్ లో ఉన్న పలు పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ లకు ఆదేశించారు.ఈ సమావేశంలో నగర పాలకసంస్థ ఎస్ ఇ గురువీర, ఇఇ రామన్ పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు వెల్నెస్ ఆసుపత్రి ఉచిత ఫ్యామిలీ హెల్త్ కార్డులు

- అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందిస్తాం
- సంక్షేమ పథకాలు వర్తించేలా కార్డులు రూపొందిస్తున్నాం :ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి
- జర్నలిస్టుల ఐక్యతే వారిని రక్షిస్తుంది
- రాష్ట్రంలో మొదటిసారి నిజామాబాద్‌లో ఉచిత హెల్త్ కార్డుల పంపిణీ




**నిజామాబాద్ సిటీ, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** జర్నలిస్టుల ఆరోగ్య రక్షణకు నిజామాబాద్ వెల్నెస్ ఆసుపత్రి యాజమాన్యం ముందుకు వచ్చింది. బుధవారం నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో ప్రెస్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో వెల్నెస్ హాస్పిటల్ యాజమాన్యం ఉచిత ఫ్యామిలీ హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ రాష్ట్ర ఛైర్పర్సన్ డాక్టర్ కవితా రెడ్డి, డిపిఆర్‌వో పద్మశ్రీ హాజరయ్యారు.
ఈ సందర్భంగా ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఒక్క వర్కింగ్ జర్నలిస్టు కూడా అక్రిడిటేషన్ కార్డుకు వంచితులు కాకూడదని, అర్హులందరికీ కార్డులు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఒక ప్రైవేట్ ఆసుపత్రి జర్నలిస్టులకు ఉచిత హెల్త్ కార్డులు జారీ చేయడం ఊహించని విషయమని, వెల్నెస్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించే జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు వెల్నెస్ తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి హయంలో వర్కింగ్ జర్నలిస్టులకు రెండు లక్షల వరకు యూనైటెడ్ ఇన్సూరెన్స్ ద్వారా బీమా సదుపాయం కల్పించారని, అందులో మూడో వంతు జర్నలిస్టులు, మిగిలింది ప్రభుత్వం భరించిందని గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ పేదలతోపాటు వర్కింగ్ జర్నలిస్టులకు కూడా వర్తించేలా చేశారని తెలిపారు. కేసీఆర్ హయంలో రెండేళ్లు కార్డులు పనిచేసినా, ప్రభుత్వం ఆసుపత్రులకు చెల్లింపులు ఆపడంతో వైద్య సేవలు నిలిచిపోయాయని, తాను ఛైర్మన్ అయిన తర్వాత బకాయిలు చెల్లించి కార్డులు పునరుద్ధరించినట్లు వివరించారు. దేశంలో 29 రాష్ట్రాలలో అక్రిడిటేషన్ కార్డులుండగా, రెండు తెలుగు రాష్ట్రాల కార్డులే అత్యధికంగా ఉన్నాయని పేర్కొన్నారు.
ప్రభుత్వ ఉద్యోగుల మాదిరే జారీ చేయనున్న అక్రిడిటేషన్ కార్డులు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ జర్నలిస్టులకు వర్తించేలా రూపొందిస్తున్నట్లు శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. రెండు మూడు రోజుల్లో రెవెన్యూ మంత్రితో సమావేశమై జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు అందేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. డిస్క్ జర్నలిస్టులకు గతంలో మాదిరే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. ఆర్ఎన్ఐ, పిజిఐ ఉండి పత్రికలు ముద్రిస్తున్న వారికి రెండు అక్రిడిటేషన్ కార్డులు మంజూరవుతాయన్నారు. జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నాయని తమ దృష్టికి వచ్చిందని, జర్నలిస్టుల ఐక్యతే వారికి అసలైన రక్షణ అని నొక్కిచెప్పారు. మెయిన్ మీడియా వైఫల్యాల కారణంగా ప్రజలు సోషల్ మీడియాపై ఆధారపడుతున్నారని, జర్నలిజం ప్రమాణాలు నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు.డాక్టర్ కవితా రెడ్డి మాట్లాడుతూ, విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే జర్నలిస్టులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రైవేట్ ఆసుపత్రి అంటే లాభాల కోసమే అన్న అపోహను వెల్నెస్ యాజమాన్యం ఈ కార్యక్రమంతో తొలగించిందని, ఇది వైద్య వృత్తికి ఖ్యాతిని తీసుకొస్తుందని అన్నారు. కార్పొరేట్ స్థాయి వైద్యం జర్నలిస్టులకు ఉచితంగా అందించడం అభినందనీయమని, జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.
వెల్నెస్ హాస్పిటల్ ఎండి అసద్ మాట్లాడుతూ, 2018లో అమీర్‌పేటలో ప్రారంభమైన వెల్నెస్ నేడు 7 బ్రాంచులు నడుపుతూ ఎనిమిదవ బ్రాంచ్ తెరవబోతున్నట్లు తెలిపారు. జర్నలిస్టు మిత్రుల సేవలను గుర్తించి, వారి కుటుంబాలకు ఈ హెల్త్ కార్డుల ద్వారా అత్యాధునిక చికిత్సలు పూర్తి ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పంచరెడ్డి శ్రీకాంత్, కార్యదర్శి వాగ్మారే సుభాష్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్రంలో మొదటిసారిగా నిజామాబాద్‌లో హెల్త్ కార్డులు పంపిణీ చేయడం గర్వంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో కోశాధికారి రాజ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాజు, ఉపాధ్యక్షులు సంగీత, నగర జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరి వివరాలు జనగణనలో నమోదు చేయాలి

**- నగర మేయర్ మహంకాళి స్వామి**

**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండంలో స్థానికంగా నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరి వివరాలు జన గణన లో నమోదు చేయాలని ఎన్యూమరేటర్ లను నగర మేయర్ మహంకాళి స్వామి కోరారు. ఎన్టిపిసి. పిటిఎస్ కాకతీయ కళ్యాణ మండపంలో జన గణన లో భాగంగా నిర్వహిస్తున్న రెండవ బ్యాచ్ ఎన్యూమరేటర్ల శిక్షణా శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డు, ఓటరు కార్డు, రేషన్ కార్డు స్వంత ఊళ్ళో ఉన్నా, మరో చోట ఉన్నా, రామగుండశీలో నివాసం ఉంటున్నట్టయితే ఇక్కడ జన గణనలోనే వివరాలు నమోదు చేయాలని అన్నారు. గతంలో జరిగిన సర్వేలలో కొందరు అపోహలతో ఇక్కడ వివరాలు నమోదు చేసుకోకపోవడంతో జన సంఖ్య తగ్గినట్టుగా కనిపిస్తున్నదని అన్నారు. రామగుండంలో దిన దినాభి వృద్ధి జరుగుతున్న క్రమంలో జన సంఖ్య పెరిగిందని అన్నారు. స్వంత ఇల్లు లేకపోయినా ఏడాది లో ఎక్కువ కాలం ఇక్కడే గడుపుతున్నారు కాబట్టి ఇక్కడే వివరాలు నమోదు చేయాలని అన్నారు. తద్వారా రామగుండం లో జనాభాకు తగినట్లుగా వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలలో ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలని కవిత, వద్దూరి రవి నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి. అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎ సిపి శ్రీహరి, టిపిఎస్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## వడగండ్ల వానతో నష్టపోయిన రైతంగానికి
# నష్టపరిహారం అందించాలి

- సిరికొండ, ధర్పల్లి, ఇందల్ వాయి, డిచ్‌పల్లి మండలాల్లో తీవ్రనష్టం
- క్షేత్రస్థాయిలో పంట నష్టంపై పరిశీలన



**సిరికొండ ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** వడగండ్ల వాన తో నష్టపోయిన రైతంగానికి రైతు యూనిటీగా తీసుకొని నష్టపరిహారం అందించాలని, తక్షణమే రైతులను ఆదుకోవాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం(ఏఐయుకెఎస్) రాష్ట్ర కార్యదర్శి బి దేవారం, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు పి రామకృష్ణలు డిమాండ్ చేశారు. సిరికొండ, మండలంలో వడగండ్ల వాన వల్ల నష్టపోయిన రావుట్ల, సిరికొండ, న్యావనంది తదితర గ్రామాల్లో అఖిలభారత ఐక్య రైతు సంఘం(ఏఐయుకెఎస్), సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్‌ల ఆధ్వర్యంలో బుధవారం నాడు క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. పంట నష్టం పై పరిశీలించారు ఈ సందర్భంగా అఖిలభారత ఐక్య రైతు సంఘం(ఏఐయుకెఎస్) రాష్ట్ర కార్యదర్శి బి దేవారం, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు పి రామకృష్ణలు మాట్లాడుతు: ప్రస్తుత సీజన్లో అకాల వర్షాలతో పాటు, వడగండ్ల వాన రెండు మూడు దపాలుగా పడ్డదని అకాల వర్షాలు, వడగండ్ల వాన వల్ల వరి పంట రాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఆరుగాలం కష్టపడితే నోటికి వచ్చిన పంట నేలపాలు కావడంతో రైతులు లబోదిపోమంటున్నారని వారు అన్నారు. అనేక తపాలుగా నష్టపోయిన రైతంగానికి నష్టపరిహారం ఇవ్వడంలో మీన వేషాలు వేస్తూన్నారన్నారు. రైతును యూనిట్గ తీసుకుంటే ఇన్సూరెన్స్ డబ్బులు అంది రైతులకు ఏదైనా న్యాయం జరుగుతుందన్నారు. మండలం యూనిట్ గా తీసుకొంటె రైతన్ననికి తీరని జరుగుతుంది అన్నారు. సిరికొండ, ధర్పల్లి, ఇందల్ వాయి మండలాల్లో తీవ్రంగా నష్ట పోయారు అన్నారు. ప్రభుత్వం రెండెండ్లుగా నష్టపోయిన రైతంగానికి నష్ట పరిహారం ఇవ్వడం లేదు అన్నారు ఇప్పటికైనా యుద్ధ ప్రతిపాధికన నష్ట పరిహారం అందించాలి అన్నారు. బ్యాంకుల ద్వారా రైతులకు తిరిగి హక్కులు రుణాలు ఇప్పించాలని వారు డిమాండ్. జిల్లా ఇస్తాయి అధికారులు సైతం నష్టపోయిన రైతాంగాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నష్టం అంచనా వేసి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకెఎస్) జిల్లా అధ్యక్షులు ఎస్ సురేష్, ప్రధానకార్యదర్శి బి బాబన్నలు మాట్లాడాగా సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు ఆర్ రమేష్, అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకెఎస్) జిల్లా కార్యదర్శి రిక్క దామోదర్, కోశాధికారి మల్కి లింబాద్రి, మాస్ లైన్ డివిజన్ నాయకులు ఎం సాయరెడ్డి, మండల నాయకులు ఈ రమేష్, పిట్ల ఎల్లయ్య, గ్రామ నాయకులు నాయిడి చిన్నరాజన్న రైతులు పాల్గొన్నారు.

## త్రిశక్తి వెంచర్‌లో అధికారుల
# మాయజాలం




**'జనంసాక్షి' కథనాలు... నిజం ఒప్పుకున్న అధికారులు**

- కొనసాగుతున్న మార్టిగేజ్ మంతనాలు
- నిబంధనలు గాలికి సర్దిచెప్పే ప్రయత్నం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/ కొందుర్గు (జనంసాక్షి) :** జనంసాక్షి ప్రచురించిన కథనాలు అక్షరాలా నిజం అంటూ అధికారులే ఒప్పుకుంటున్నారు. కానీ త్రిశక్తి వెంచర్ మాయాజాలంలో వెంచర్ నిర్వాహకులతో కుమ్మకై సర్ది చెప్పే ప్రయత్నం చేస్తున్నారన్న ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఓవైపు నివేదిక రెడీ చేస్తున్నామని చెబుతున్న అధికారులు పొరపాటు జరిగిందని క్షమించమని తమకు లెటర్ పంపించారని చెప్పుకొచ్చారు.

నిబంధనల ప్రకారం గ్రామపంచాయతీకి అప్పగించాల్సిన 15 శాతం మోర్టగేజ్ (తనాఖా) ప్లాట్లను సైతం లెక్కచేయకుండా, కొందుర్గు మండల కేంద్రంలోని 'త్రిశక్తి వెంచర్' యాజమాన్యం పచ్చి మోసానికి తెరలేపింది. అటు అధికారులను, ఇటు అమాయక వినియోగదారులను బురిడీ కొట్టిస్తూ అభివృద్ధి పనుల ఊసే లేకుండా విక్రయాలు సాగించడం ఇప్పుడు స్థానికంగా సంచలనం రేపుతోంది. వెంచర్ లేఅవుట్ అనుమతి కోసం నిబంధనల ప్రకారం 95 నుండి 125 నంబర్లు గల ప్లాట్లను ప్రభుత్వానికి తనాఖా పెట్టాలి. కానీ, ఆ ప్లాట్లను తనాఖా చేయకుండానే, పైగా వెంచర్‌లో కనీస మౌలిక సదుపాయాలైన రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు వంటి అభివృద్ధి పనులు చేపట్టకుండానే విక్రయాలు జరిపారు. ప్లాట్లు కొన్న కస్టమర్లు ఇప్పుడు పర్మిషన్లు రాక, కనీస సౌకర్యాలు లేక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

**అధికారుల తీరుపై అనుమానాలు**
నిబంధనలు ఉల్లంఘించిన వెంచర్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, వారితో 'చర్చలు' జరపడం వెనుక ఆంతర్యమేమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. 'జనంసాక్షి' ప్రతినిధి వివరణ కోరగా.. వెంచర్ నిర్వాహకులు తప్పు జరిగిందని ఒప్పుకుంటూనే, మరో నెల రోజులు సమయం కావాలని కోరుతుండటం గమనార్హం. తనాఖా చేయాల్సిన 30 ప్లాట్లల్లో సుమారు 10 ప్లాట్లు ఎలా రిజిస్ట్రేషన్ చేశారో సబ్ రిజిస్ట్రార్‌ను అడిగి తెలుసుకుంటామని అధికారులు చెబుతున్న సమాధానం చూస్తుంటే, లోపాయికారీ ఒప్పందాలు జరిగాయన్న విమర్శలకు బలం చేకూరుతోంది.

**బాధితుల డిమాండ్**
డబ్బులు చెల్లించి ప్లాట్లు కొనుగోలు చేసిన తమకు న్యాయం చేయాలని, వెంటనే వెంచర్‌లో అభివృద్ధి పనులు పూర్తి చేయించాలని కస్టమర్లు డిమాండ్ చేస్తున్నారు. మోసపూరిత విక్రయాలకు పాల్పడిన త్రిశక్తి వెంచర్ యాజమాన్యంపై, వారికి సహకరిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

"లక్షలు పోసి ప్లాట్ కొన్నాను. తీరా గృహ నిర్మాణం చేపడతామని అనుమతుల కోసం వెళితే అధికారులు అనుమతులకు నిరాకరించారు. ఏమిటని ప్రశ్నించడంతో వెంచర్ యజమాన్యం గ్రామ పంచాయతీకి 15% మాటిగేజ్ చేయాల్సిన ప్లాట్లను ఎలాంటి అభివృద్ధి పనులు చేయకముందే అమ్మేసింది. అందుకే ఆ వెంచర్లో పర్మిషన్లు ఇవ్వడానికి వీలు కాదు అంటున్నారు.



**ఈరపురం అశోక్ గౌడ్ (194 ప్లాట్ కస్టమర్ కొందుర్గు)**

"అప్పుచేసి ప్లాట్ కొన్నాం. మేము గృహనిర్మాణం చేసి 3 సంవత్సరాలు గడుస్తుంది. వెంచర్ యాజమాన్యం ఎలాంటి అభివృద్ధి పనులు చెయ్యలేదు. ఇప్పటివరకు విద్యుత్తు సప్లయ్ లేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు వెంచర్ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలి.



**మంగళి అనిల్ కుమార్ (33 నంబర్ ప్లాట్ కస్టమర్)**



# శంషాబాద్‌లో రూ.90 కోట్ల ప్రభుత్వ భూమి కాపాడిన హైడ్రా

హైదరాబాద్/శంషాబాద్, ఏప్రిల్ 22 (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలో సర్వే నంబర్ 626/2లో ఉన్న మొత్తం 176.05 ఎకరాల ప్రభుత్వ భూమిలో భాగమైన 9.05 ఎకరాలను హైడ్రా ఆక్రమణల నుంచి కాపాడింది. భూ ఆక్రమణ చట్టం-1905 ప్రకారం ఆక్రమణలు తొలగించాలని నోటీసులు ఇచ్చినా పట్టించుకోకపోవడంతో, రెవెన్యూ శంషాబాద్ మున్సిపల్ అధికారులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా టీం అక్రమ కంటైనర్లను తొలగించి, హైడ్రా సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ భూమి విలువ సుమారు రూ.90 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు తెలిపారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం, ఈ భూమిలో 166 ఎకరాలను అటవీ అభివృద్ధి సంస్థకు ప్రభుత్వం కేటాయించగా, మిగిలిన 9.05 ఎకరాలు ప్రభుత్వ భూమిగానే నమోదయ్యాయి. ఖస్రా పహాణీ ప్రకారం కూడా ఇది ప్రభుత్వ భూమిగా నమోదు అయింది. అయితే కొంతమంది దీనిని సీఎస్-14 (నిజాంలకు చెందిన భూమి)గా పేర్కొంటూ హక్కులు క్లైమ్ చేస్తున్నారు. ఈ వివాదం ప్రస్తుతం హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. హైకోర్టు తుది తీర్పు వచ్చే వరకు భూమి స్వరూపాన్ని మార్చకూడదని, ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని స్టేటస్ కో ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ తజమ్ముల్ మొయినుద్దీన్ ఖాన్ అనే వ్యక్తి భూమిని చదును చేసి లేఅవుట్‌గా మార్చి, ప్రీకాస్ట్ గోడలతో ఆక్రమణకు పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. కొన్ని ఇంటి స్థలాలను విక్రయించినట్లు కూడా సమాచారం లభించింది.

# తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా ఉప్పల శ్రీనివాస్ గుప్త



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా ఉప్పల శ్రీనివాస్ గుప్త నియమితులయ్యారు. ఈ సందర్భంగా క్రీడా రంగానికి చెందిన పలువురు ప్రముఖులు, అభిమానులు, నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నియామకంపై ఉప్పల శ్రీనివాస్ గుప్త ఆనందం వ్యక్తం చేస్తూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించిన అసోసియేషన్ ప్రెసిడెంట్ పరిశ్రమలు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకి, ప్రధాన కార్యదర్శి పుల్లెల గోపీచంద్‌కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అసోసియేషన్ సభ్యులందరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బ్యాడ్మింటన్ క్రీడను మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ప్రతిభ కలిగిన యువ క్రీడాకారులను గుర్తించి వారికి సరైన మార్గదర్శకత్వం, సౌకర్యాలు అందించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. క్రీడా మౌలిక సదుపాయాల పెంపు, శిక్షణా శిబిరాల ఏర్పాటు, జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తానని పేర్కొన్నారు. ఇకపై తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ, క్రీడా రంగంలో రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచేందుకు తన వంతు కృషి చేస్తానని ఉప్పల శ్రీనివాస్ గుప్త స్పష్టం చేశారు.

# ఖమ్మంలో 'బీసీ రచయితల సమాఖ్య' ఆవిర్భావం



ములక సురేష్ | సీహెచ్ ఆంజనేయులు | ఎంవీ రమణ

ఖమ్మం (జనంసాక్షి) : బీసీ రచయితల సమాఖ్య ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా రచయిత ములక సురేష్ ను ఎంపిక చేసామని బీసీ రచయితల సమాఖ్య రాష్ట్ర గౌరవ సలహాదారులు జూలూరు గౌరీ శంకర్ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ సిహెచ్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా ఎం.వి. రమణ, జిల్లా కార్య దర్శులుగా ఉరి మల్ల సునంద, తోట సుభాషిని, ప్రచార కార్యదర్శులుగా జి వెంకటేశ్వర్లు కార్యవర్గ సభ్యులుగా కార్యవర్గ సభ్యులుగా రేలా శ్రీనివాస్ బుక్కా సత్యనారాయణ లను ఎన్నుకున్నట్లు తెలిపారు. బీసీ రచయితల సమాఖ్య ద్వారా బడుగుల సాహిత్యం పై సెమినార్లు, బహుజన యోధుల స్మరణలో సభలు, తెలుగు సాహిత్యంలో బహుజన వాదనను ప్రకటిస్తూ రచనలు చేయించే బాధ్యతను నిర్వహిస్తారని తెలియజేశారు. బీసీలకు అందాల్సిన ఆర్థిక రాజకీయ సామాజిక న్యాయాల కోసం కలమెత్తి గళమెత్తి రచనలు చేయడమే లక్ష్యంగా బీసీ రచయితల సమాఖ్య ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.

# ఘోష్ కమిషన్‌ను పక్కన పెట్టిన హైకోర్టు

- న్యాయం గెలిచినట్లేనన్న పద్మాదేవేందర్



మెదక్, ఏప్రిల్ 22 (జనంసాక్షి) : కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తాజా తీర్పును మాజీ డిప్యూటీ స్పీకర్, మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు ఎం పద్మా దేవేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించడం న్యాయం గెలిచినట్టేనని ఆమె పేర్కొన్నారు. కమిషన్ విచారణలో ప్రాథమిక న్యాయ నిబంధనలు పాటించలేదని కోర్టు స్పష్టం చేయడం ద్వారా ఆ నివేదికకు చట్టపరమైన బలం లేదని తేలిందన్నారు. ముఖ్యంగా సెక్షన్ 8 కింద సంబంధిత వ్యక్తులకు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఆరోపణలు చేయడం సరికాదని కోర్టు వ్యాఖ్యానించడం అత్యంత కీలక పరిణామమని తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుపై రాజకీయ ఒత్తిడి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కమిషన్లను అడ్డంపెట్టుకుని వేధింపులకు పాల్పడిందని ఆమె విమర్శించారు. న్యాయస్థానాలపై నమ్మ కంతో పోరాడగా చివరకు నిజం గెలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ జీవధారగా భావించే కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ పార్టీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ప్రతిష్టను దెబ్బ తీయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కక్షపూరితంగా వ్యవహరించాయని ఆరోపించారు. ప్రాజెక్టు మరమ్మతులను సకాలంలో చేపట్టకుండా దాదాపు రెండున్నరేళ్లు ఆలస్యం చేశారని, గత్యంతరం లేక ఇప్పుడు పనులు ప్రారంభిస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం అంశంలో కేసీఆర్‌పై చేసిన ఆరోపణలు నిరాధారమని ఈ తీర్పుతో స్పష్టమైందని, కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఈ తీర్పుతో కనువిప్పు కలగాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ వేధింపులను పక్కన పెట్టి పాలనపై దృష్టి సారించి, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆమె అన్నారు. న్యాయం ఎప్పటికైనా గెలుస్తుందనే విశ్వాసానికి ఈ హైకోర్టు తీర్పు నిదర్శనమని పద్మా దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు.

# పెద్దల చదువుకు పెద్దపీట

## వయోజనుల్లో అక్షరాస్యత పెంపుపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

- సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో విద్యా రంగంలో వేగంగా సంస్కరణలు
- విద్యా రంగంలో తెలంగాణ దూకుడు
- సీఎం రేవంత్ నేతృత్వంలో విద్యా రంగంలో వేగంగా సంస్కరణలు



హైదరాబాద్ (జనంసాక్షి) : మారుతున్న కాలానికి తగినట్లు మారితేనే మనుగడ సాధ్యమవుతుంది.. ఈక్రమంలోనే విద్యా రంగంలోనూ పలు సంస్కరణలకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా శాఖను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. పిల్లలంతా బడుల్లో ఉండడమే కాదు పెద్దలు సైతం అక్షరాలు నేర్చుకోవాలని... ఆధునిక కాలపు అవసరాలకు తగినట్లు తమను తాము మల్చుకోవాలనేది రాష్ట్ర ప్రభుత్వం యోచన. అందుకే వయోజన అక్షరాస్యత పెంపునపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనపర్చుతోంది. అదే సమయంలో పాఠశాల విద్యా రంగంపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

### 100 శాతం అక్షరాస్యత... వయోజన విద్యకు ప్రాధాన్యం

సంపూర్ణ అక్షరాస్య రాష్ట్రంగా తెలంగాణను మార్చాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతుంది. 45 ఏళ్లు పైబడిన వయసులో అక్షరాస్యత తక్కువగా ఉండటాన్ని ప్రభుత్వం గుర్తించింది. దీంతో చాలా కాలంగా నిర్లక్ష్యానికి గురైన వయోజనుల విద్యపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎక్కడికక్కడ వయోజన విద్య తరగతులు నిర్వహించారు. దీంతో 2025--26 సంవత్సరంలో 6.31 లక్షల మంది పెద్దలు అక్షరాస్యత పరీక్షలకు హాజరయ్యారు. గత ప్రభుత్వం హయాంలో, ముఖ్యంగా 2019 నుంచి 2024 వరకు వయోజన విద్య పెంపు అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. దీంతో ఆ సమయంలో వయోజన విద్య పూర్తిగా కుంటుపడింది. అందుకు విరుద్ధంగా ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వయోజన విద్యపై ప్రత్యేక దృష్టి సారించింది. ఫలితంగానే వయోజన విద్యలో పెద్ద ఎత్తున పెరుగుదల నమోదైంది.

### పాఠశాలల్లో కొత్త మార్పులు

తెలంగాణలోని పాఠశాలల్లో విద్యలో నాణ్యత పెంచేందుకు ప్రజా ప్రభుత్వం నూతన విధానాన్ని తీసుకొచ్చింది. అకడమిక్ ప్యానెల్ ఇన్స్ట్రక్షన్ టీమ్స్ ద్వారా పాఠశాలల్లో బోధన విధానాలను ఉన్నతీకరించింది. ఇది విద్యార్థులకు అత్యాధునిక పద్ధతులలో అభ్యసనలో మెలుకువలు నేర్పించేందుకు ఉపయోగపడింది. ముఖ్యంగా పెద్దపల్లి జిల్లాలో 61 పాఠశాలల్లో ఈ విధానం అమలు చేసి, బోధనలో ఉన్న ఇబ్బందులు, అనుకూలతలను గుర్తించారు. చాలామంది ఉపాధ్యాయులకు మంచి పరిజ్ఞానం ఉన్నప్పటికీ, తరగతుల్లో విద్యార్థుల భాగస్వామ్యం తక్కువగా ఉండడాన్ని ఈ టీమ్స్ గుర్తించాయి. దానిని సరిదిద్ది సమర్థంగా అమలు చేయడంతో మంచి ఫలితాలు తీసుకురావడం సాధ్యమైందని విద్యా శాఖ అధికారులు భావిస్తున్నారు.

### ఆరు నెలల్లోనే మంచి ఫలితాలు

ప్రజా ప్రభుత్వ చర్యల ఫలితంగా తక్కువ సమయంలోనే పాఠశాల విద్యలో మంచి మార్పులు చోటుచేసుకున్నాయి. బోధన పద్ధతుల్లో వ్యూహాత్మకత 48% నుంచి 68%కు పెరిగింది. తరగతుల గదుల మెరుగైన నిర్వహణలో 42% నుంచి 65%కు, బోధనాభ్యసన సామగ్రి, వనరుల వినయోగం 35% నుంచి 58%కు పెరిగింది. ఇవన్నీ మంచి ఫలితాలు వచ్చేందుకు కారణమయ్యాయి.

### ప్రాథమిక విద్యపై ప్రత్యేక దృష్టి

పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ప్రాథమిక దశలోనే అక్షరాలు రాయడం, అంకెలు నేర్చుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఫ్లీచీ) పై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. దీంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2022-23 విద్యా సంవత్సరం నుంచి 2025-26 వరకు మంచి ఫలితాలు వచ్చాయి. తెలుగులో 9 శాతం నుంచి 35% శాతం వరకు... ఇంగ్లీష్ లో 4 శాతం, 29% శాతం... ఉర్దూ లో 19 శాతం నుంచి 40% శాతం వరకు అభ్యసన సామర్థ్యాలు పెరిగాయి. భాషతో పాటు అంకెలు నేర్చుకోవడం.. కూడికలు, తీసివేతలు వంటి గణిత ప్రక్రియల్లోనూ 18 శాతం నుంచి 30 శాతం ఫలితాలు అధికంగా వచ్చాయి.

### విద్యకు అత్యధిక నిధుల వినియోగం

సమగ్ర శిక్షా పథకం కింద వచ్చిన నిధులను వినియోగించడంలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 2025-26లో 84% నిధులు వినియోగించుకొని రాష్ట్రం దేశంలో మొదటి స్థానంలో ఉంది. ప్రతి రూపాయి విద్య కోసం, విద్యార్థుల కోసం వ్యయం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. విద్యా రంగంలో ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు తెలంగాణను దేశంలో ముందువరుసకి తీసుకెళుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలు విద్యార్థులు, ఉపాధ్యాయులకు విద్యా వ్యవస్థ ప్రగతికి మరింత దోహదపడుతున్నాయి. విద్యా రంగంలో తెలంగాణ ఆదర్శ రాష్ట్రంగా ముందుకు సాగుతోంది.

# కాళోజీ మార్గంలోనే నడవాలి

## రిటైర్డ్ ఉద్యోగులు తమ బెనిఫిట్స్ కోసం సంఘటితం కావాలి


- ఉపాధ్యాయుడు అనంతజు పదవీ విరమణ సభలో జూలూరు గౌరీశంకర్



ఖమ్మం (జనంసాక్షి) : తరగతి గదుల్లో పౌరవిద్యను కుటుంబ విద్యను బోధించాలని ప్రస్తుతం మార్కెట్ విద్య కొనసాగుతుందని ప్రముఖ కవి తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ తెలిపారు. సామాజిక మార్పులు జరుగుతున్న ప్రతి మలుపులో కాళోజి తన జీవితం కవిత్వం ద్వారా పౌరవిద్యను అందించారని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలకు కాళోజి పౌరవిద్యను కానుకగా అందించారని విశ్లేషించి చెప్పారు. పాఠశాల బాధ్యతాయుతమైన పౌరులను మరియు ప్రజాస్వామిక స్థలాలను ఇవ్వగలిగిన పౌరులను తయారు చేయాలని కోరారు. బుధవారం తనికెళ్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో అనంతోజు పుల్లయ్య చారి పదవీ విరమణ సభకు జూలూరు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులు ఎండమావుల వెంట పోయి చివరకు ఎడారి పాలైనట్లు పరిస్థితులు తయారయ్యాయని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు మబ్బుల్లో నీళ్లు చూసి ముంతలో నీళ్లు పారబోసుకున్నట్లు మోసపోయారని ఉపాధ్యాయ ఉద్యోగ వర్గాల ఆవేదనను వ్యక్తం చేశారు. జిపిఎఫ్, గ్రాట్యూటీ కింద రావలసిన డబ్బు, జి ఎల్ టి, ప్రభుత్వ ఉద్యోగులు తమ సర్వీసులో దాచుకున్న పదవీ విరమణ తర్వాత డబ్బు రాక అంతర్గత మానసిక శోభకు గురవుతున్నారని తెలిపారు. 2024 నుంచి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఉద్యోగులకు రావటం లేదని తెలిపారు. ఖమ్మం జిల్లాలో పదవీ విరమణ బెనిఫిట్స్ అందక ఒత్తిళ్ళ గురై అయిదుగురు మరణించారని ఉద్యోగ వర్గాలే చెబుతున్నారని గుర్తు చేశారు. కాళోజి మార్గంలో పౌర సమాజం కదలక తప్పని పరిస్థితి ఏర్పడిందని స్పష్టం చేశారు. ప్రశ్నించటం నేర్పే తరగతి గది నుంచే ప్రశ్నలు ఉసిల్ల పుట్టల్లా లేవక తప్పదని చెప్పారు.. తరగతిగది దేశభక్తులను సంపదల సృష్టికర్తలను తయారు చేసే శిక్షణాలయం అని చెప్పారు తరగతి గది అంటే పిల్లలకు ర్యాంకులను 10 శాతం మార్కులను మాత్రమే సంపాదించిపెట్టే కార్ఖానా కాకూడదన్నారు. దేశానికి ప్రపంచానికి శక్తివంతమైన మానవ వనరులను అందించే జ్ఞాన కేంద్రంగా తరగతిగది నిలుస్తుందని జూలూరు గౌరీ శంకర్ చెప్పారు. ఈ సభకు కొనిజర్ల ఎంఈఓ అబ్రహం అధ్యక్షత వహించగా టీఎస్జీవో నేత కూరపాటి రంగరాజు, ఉపాధ్యాయ సంఘాల నేత ములక సురేష్, పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్, పి ఆర్ టి యు మాజీ జిల్లా అధ్యక్షులు ఎన్ కృష్ణమోహన్, ఎస్ టి యు జిల్లా కార్యదర్శి కరామత్ అలీ, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా బాధ్యులు వై వెంకటేశ్వర్లు, టి ఎన్ యు ఎస్ జిల్లా అధ్యక్షులు జివి సూర్యం రిటైర్డ్ ఎంఈఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతీ అంత్య పుష్కరాలకు రండి

## గవర్నర్‌కు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ ఆహ్వానం



హైదరాబాద్, ఏప్రిల్ 22 (జనంసాక్షి) : దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ ఎన్. హనుమంతరావు లు బుధవారం లోక్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిశారు. రానున్న సరస్వతి అంత్య పుష్కరాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోదావరి పుష్కరాలు (జూన్ 26 నుంచి జూలై 7, 2027 వరకు), సరస్వతి అంత్య పుష్కరాలు (మే 21 నుంచి జూన్ 1, 2026 వరకు) నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లపై దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి గవర్నర్‌కు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పుష్కరాలను సజావుగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్ తెలిపారు. భక్తుల వసతి సదుపాయాలు, క్రౌడ్ మేనేజ్మెంట్ చర్యలు, ముఖ్య ఆలయాలు-వాటి ప్రాధాన్యత, శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలపై గవర్నర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిశోర్ కూడా సమావేశంలో పాల్గొన్నారు.

అలాగే అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీ కృష్ణ బుధవారం లోక్ భవన్‌లో గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంసిఈఎంఈ, సికింద్రాబాద్ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్ష్నే (ఏవీఎస్ఎం, వీఎస్ఎం) బుధవారం లోక్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంసిఈఎంఈలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలు, సంస్థ కార్యకలాపాలకు సంబంధించిన అంశాలను గవర్నర్ కు వివరించారు.

# ఆర్థికంగా కుదేలవుతున్న ఇరాన్

- రోజుకు సుమారు 500 మిలియన్ల డాలర్లు నష్టం

వాషింగ్టన్, ఏప్రిల్22 (జనంసాక్షి) : ఇరాన్ ఆర్థికంగా కుదేలవుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇరాన్ ఆదాయం పడిపోతున్నట్లు ఆచయన చెప్పారు. హోర్ముజ్‌ను తక్షణమే ఓపెన్ చేయాలని ఇరాన్ భావిస్తున్నదని, ఎందుకంటే వాళ్లకు నగదు కొరత ఏర్పడిందన్నారు. ప్రతి రోజూ ఆ దేశం సుమారు 500 మిలియన్ల డాలర్లు నష్టపోతున్నదని ట్రంప్ తెలిపారు. మిలిటరీకి, పోలీసులకు జీతాలు అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. హోర్ముజ్‌ను మూసిన ఇరాన్ ఆ పరిస్థితి నుంచి బయటపడేందుకు ఇబ్బందిపడుతున్నట్లు ఆయన తెలిపారు. జలసంధిని బ్లాకేడ్ చేసినట్లు తాము చెప్పడం వల్లే ఇరాన్ దాన్ని మూయాలని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. వాస్తవానికి నాలుగు రోజుల క్రితం తన వద్దకు కొందరు వచ్చి హోర్ముజ్‌ను ఓపెన్ చేయాలని కోరారని, కానీ ఒకవేళ హోర్ముజ్‌ను తాము ఓపెన్ చేస్తే, అప్పుడు ఇరాన్‌తో డీల్ కుదుర్చుకోలేమన్నారు. ఒకవేళ ఆ దేశాన్ని మొత్తం పేల్చివేస్తే తప్ప మళ్లీ ఆ డీల్ కుదిరే అవకాశం ఉండదని ట్రంప్ అన్నారు.

# త్రిస్సూర్ బాణాసంచా పేలుడు ఘటన రాష్ట్ర విపత్తు

తిరువనంతపురం, ఏప్రిల్ 22 (జనంసాక్షి) : కేరళలోని త్రిస్సూర్ లో బాణా సంచా పేలుడు ఘటనను విజయన్ ప్రభుత్వం బుధవారం రాష్ట్ర విపత్తుగా ప్రకటించింది. ఈ ఘటనను రాష్ట్ర విపత్తుగా కేరళ మంత్రివర్గం బుధవారం విపత్తు నిర్వహణ అథారిటీని ఆదేశించింది. ఈ ప్రమాదంపై న్యాయవిచారణకు ఆదేశించింది. జస్టిస్ సి.ఎన్. రామచంద్రన్ నాయర్ నేతృత్వంలో న్యాయ కమిషన్ పర్యవేక్షించనుంది. మృతుల కుటుంబాలకు రూ.14 లక్షల అత్యవసర ఆర్థిక సహాయం అందించనున్నట్లు విజయన్ ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి నుండి రూ.4 లక్షలు, సిఎం విపత్తు సహాయ నిధి (సిఎండిఆర్ ఎఫ్)నుండి రూ.10 లక్షలు కేటాయించినట్లు తెలిపింది. గాయపడిన వారికి ఎస్ డిఎంఎ నిధి కింద కేటాయించిన మొత్తాన్ని ఇవ్వనున్నారు. అదనంగా సిఎండి ఆర్ ఎఫ్ నుండి రూ.2లక్షలు అత్యవసర ఆర్థిక సహాయం కింద అందించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో గాయపడిన వారి చికిత్స ఖర్చులను ఆరు నెలల పాటు ప్రభుత్వం భరించనున్నట్లు తెలిపింది. ఈ మొత్తాన్ని జిల్లా కలెక్టర్ సిఫార్సు ఆధారంగా సిఎండిఆర్ఎఫ్ నుండి కేటాయిస్తారు. ఒకవేళ ఆరు నెలల కంటే ఎక్కు వ కాలం చికిత్స అవసరమైతే, సిఫార్సు చేయ బడిన ప్రైవేట్ ఆసుపత్రులలోని చికిత్స ఖర్చు లను వైద్య మండలి నిర్ణయం ఆధారంగా సీఎండీఆర్ఎఫ్ నుండి కేటాయించనున్నట్లు వెల్లడించింది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370